
'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 236

గురువారం 17-11-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అల్‌కరాజ్ అదరహో

ఏటీపీ ర్యాంకింగ్స్‌లో స్పెయిన్ టీనేజర్ కార్లోస్ అల్‌కరాజ్ కొత్త చరిత్ర - 12లో



కొత్త గరిష్టాల వద్ద ముగింపు

సెన్సెక్స్ 108 పాయింట్లు ప్లస్
నిఫ్టీకి ఆరు పాయింట్ల లాభం - 13లో



మూడోసారీ పోటీచేస్తా

దేశాన్ని మళ్లీ అభివృద్ధి బాట పట్టించేందుకు తదుపరి అధ్యక్షుడిగా పోటీ చేస్తానని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు.

వివరాలు 6లో



ఏడాదికి 3 వేల బ్రిటన్ వీసాలు

భారతీయ యువ నిపుణులకు ఏటా 3 వేల వీసాలిచ్చే ఒప్పందానికి బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.


వివరాలు 6లో



నిందితుడికి నార్కో టెస్టు

శ్రద్ధాను కిరాతకంగా చంపిన అఫ్తాబ్ అమీన్‌కు నార్కో పరీక్షలు చేసేందుకు పోలీసులు కోర్టును అనుమతి కోరనున్నారు.

వివరాలు 6లో



తెరుచుకున్న శబరిమలై ఆలయం

మండల దీక్ష భక్తుల సందర్శనార్థం కేరళలో శబరిమలై ఆలయం ద్వారాలు బుధవారం సాయంత్రం తెరిచారు.

వివరాలు 6లో

న్యూస్‌రీల్

మన్యం గజగజ



ఉత్తరాంధ్ర ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోవడంతో చలితో ప్రజలు గజగజ వణుకుతున్నారు. బుధవారం మూడు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉదయం 9.30 గంటల వరకు ఏజెన్సీ వ్యాప్తంగా పొగమంచు దట్టంగా కురిసింది.

వివరాలు 2లో ▸

అవినీతి దురుద్దేశాలపై దర్యాప్తు చేయొద్దా?



అవినీతి దురుద్దేశాలపై దర్యాప్తు చేయకూడదా? ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో ప్రజాధనం వృథా లాంటివి ఉంటే దర్యాప్తు వద్దా..? అని టీడీపీ నేత వర్ల రామయ్య తరఫు న్యాయవాదిని సుప్రీంకోర్టు ప్రశ్నించింది.

వివరాలు 10లో ▸

అపోహలు సృష్టిస్తున్నారు



రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రతిపక్షాలు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు విమర్శించారు.

వివరాలు 2లో ▸

అశేష అభిమాన సంద్రం మధ్య కొనసాగుతున్న హీరో కృష్ణ అంతిమయాత్ర



జోహార్ నటశేఖరా



ప్రభుత్వ లాంఛనాలతో సూపర్‌స్టార్ కృష్ణ అంత్యక్రియలు

- గౌరవ వందనం సమర్పించిన పోలీసులు
- చితికి నిప్పంటించిన కుమారుడు మహేష్‌బాబు
- జనసంద్రంగా మారిన మహాప్రస్థానం పరిసరాలు
- కుటుంబసభ్యులు, ప్రజాప్రతినిధులు, సినీ ప్రముఖులకే అనుమతి
- ఉదయం 7 గంటలకు పద్మాలయా స్టూడియోకు పార్థివదేహం
- అంతిమయాత్రకు పోటెత్తిన హీరో కృష్ణ అభిమానులు



మహేష్‌బాబుకు ధైర్యం చెబుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నివాళి

కృష్ణ పార్థివ దేహానికి సీఎం వైఎస్ జగన్ నివాళులు అర్పించారు. బుధవారం హైదరాబాద్ ఫిలింనగర్ పద్మాలయ స్టూడియోస్ ఆవరణలోని కృష్ణ నివాసానికి విచ్చేసి పుష్పాంజలి ఘటించారు. మహేష్‌బాబు సహా ఇతర కుటుంబసభ్యులను పేరుపేరునా పరామర్శించారు. మహేష్‌ను ఆలింగనం చేసుకుని ధైర్యం చెప్పారు.

హైదరాబాద్: గుండెపోటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన ప్రముఖ సినీ నటుడు, సూపర్‌స్టార్ కృష్ణ అంత్యక్రియలు బుధవారం సాయంత్రం రాయదుర్గంలోని వైకుంఠ మహా ప్రస్థానం మోక్షఘాట్‌లో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. సీనియర్ పోలీస్ అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. బ్రాహ్మణుల

మిగతా 2వ పేజీలో ▶

క్షీణిస్తున్న మునిసిపల్ కార్పొరేషన్ల ఆదాయం

దశాబ్ద కాలంగా దేశ జీడీపీలో ఒక్క శాతమే



- దేశవ్యాప్తంగా స్థితిగతులపై ఆర్బీఐ నివేదికలో వెల్లడి
- నాణ్యమైన సేవల కోసం సొంత ఆదాయం పెంచుకోవాలి
- ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రాలు విడుదల చేసే గ్రాంట్లే ఆధారం
- రుణాల సేకరణకు చర్యలు తీసుకోవాలి.. మునిసిపల్ బాండ్లు జారీ చేయాలి.. ఆస్తి పన్ను సంస్కరణలు చేపట్టాలి
- ప్రైవేట్ సంస్థలు, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవాలి
- కార్పొరేషన్ల బడ్జెట్, వ్యయాల నిర్వహణ సరిగా లేదు
- దక్షిణాఫ్రికా తరహాలో సంస్కరణలు తీసుకురావాలి

3లో

వికేంద్రీకరణకు మద్దతుగా అనంతపురం జిల్లా గుంతకల్లులో నిర్వహించిన భారీ ర్యాలీ



వికేంద్రీకరణే సీమ అభివృద్ధికి దిక్సూచి

- మూడు రాజధానులు కోరుతూ నినదించిన రాయలసీమ
- కర్నూలులో న్యాయ రాజధాని కోసం డిమాండ్
- సీమవ్యాప్తంగా ర్యాలీలు, మానవహారాలు, రౌండ్ టేబుల్ సమావేశాలు, సత్యాగ్రహ దీక్షలు

3లో

ఇది యుద్ధాల శకం కాదు



- ఉక్రెయిన్‌పై యుద్ధానికి రష్యా తక్షణమే ముగింపు పలకాలని జీ–20 సదస్సు నాయకులు పిలుపునిచ్చారు. ఇది యుద్ధాలు చేసుకునే శకం కాదని నినదించారు. కాగా, ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన కూటమి జీ–20 అధ్యక్ష బాధ్యతల్ని భారత్ స్వీకరించింది. బాలిలో జరిగిన ముగింపు సదస్సులో జరిగిన ఒక కార్యక్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఇండోనేసియా అధ్యక్షుడు జోకో విడోడో అధ్యక్ష బాధ్యతల్ని అప్పగించారు.

6లో

నారాయణను ఇంటి వద్దే విచారించండి

మాజీ మంత్రిపై కేసులో సీఐడీకి హైకోర్టు ఆదేశం

14లో



అమరావతి రైతులకు హైకోర్టులో ఎదురు దెబ్బ

- రాజధాని రైతు సంఘాల అప్పీళ్ల కొట్టివేత
- ఉత్తర్వులు జారీ చేసిన కోర్టు

14లో



పోలవరానికి నిధులు!

- సీఎం వైఎస్ జగన్ వినతిపై కేంద్రం సానుకూలం
- 21న జల్‌శక్తి శాఖ కార్యదర్శి భేటీ అనంతరం కేంద్ర ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు
- ఈ సీజన్ పనులపై కమిటీ నివేదికకు ఆమోదం

2లో



కృష్ణ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న సీఎం జగన్



సూపర్ స్టార్ కృష్ణ చిత్రపటానికి నమస్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



కృష్ణ సోదరుడు ఆదిశేషగిరిరావుతో సీఎం జగన్



మహేశ్‌బాబు కుటుంబసభ్యులను ఓదారుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

క్లుప్తంగా

'వక్ఫ్ భూముల ఆక్రమణలపై సీఐడీ దర్యాప్తు జరపాలి'

సాక్షి, అమరావతి: ఏపీలో వక్ఫ్ భూముల ఆక్రమణలపై సీఐడీతో దర్యాప్తు చేయించాలని రాష్ట్ర మైనారిటీ కమిషన్ నిర్ణయించింది. కొందరి కబ్జాదారుల గుప్పిట్లోకి వక్ఫ్ భూములు భారీగా వెళ్లిపోయాయని మైనారిటీ కమిషన్‌కు 36 ఫిర్యాదులందాయి. ఆ ఆక్రమణలపై సీఐడీతో దర్యాప్తు చేయించి ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ కె.ఇక్బాల్ అహ్మద్ ఖాన్ ప్రభుత్వానికి బుధవారం లేఖ రాశారు.

'దిశ' ఆమోదానికి కేంద్రానికి సిఫార్సు చేయండి

- గవర్నర్‌ను కోరిన రాష్ట్ర మహిళా కమిషన్

సాక్షి, అమరావతి: మహిళా భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన 'దిశ' చట్టం బిల్లును ఆమోదించేలా కేంద్రానికి సిఫార్సు చేయాలని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు ఏపీ మహిళా కమిషన్ విజ్ఞప్తి చేసింది. కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, సభ్యులు గజ్జల లక్ష్మి, వినీత విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో బుధవారం భేటీ అయ్యారు. దిశ చట్టం స్ఫూర్తితో నిర్ణీత వ్యవధిలో చార్జ్‌షీట్లు వేయడం, వేగవంతమైన విచారణలతో నేరస్తులకు శిక్షలు పడుతున్నాయని ఫలితంగా మూడేళ్లలో మహిళలు, బాలికలపై నేరాలు తగ్గుముఖం పట్టాయని గవర్నర్‌కు వివరించారు. బాధితులకు సత్వరం న్యాయం జరగాలంటే దిశ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాల్సి ఉంటుందని చెప్పారు. అందుకే దిశ చట్టం బిల్లుకు కేంద్రం త్వరగా ఆమోదముద్ర వేసేలా చొరవ చూపాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు.

ముఖ్య సమాచార కమిషనర్‌గా బాషా బాధ్యతల స్వీకారం

- కమిషనర్‌గా శామ్యూల్..



సీఎస్ సమీర్‌శర్మ సమక్షంలో బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్.మహబూబ్ బాషా

సాక్షి, అమరావతి: రాష్ట్ర సమాచార కమిషన్ ముఖ్య కమిషనర్‌గా ఆర్.మహబూబ్ బాషా, కమిషనర్‌గా శామ్యూల్ జొనాతన్ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం సచివాలయంలో వారితో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ ప్రవీణ్‌కుమార్, సమాచార కమిషనర్లు రేపాల శ్రీనివాసరావు, బి.వి.రమణ కుమార్, కట్టా జనార్ధనరావు, ఐలాపురం రాజా, సమాచార కమిషన్ కార్యదర్శి సాంబశివరాజు, ఆర్ఎం బాషా, శామ్యూల్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నూతనంగా నియమితులైన చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ ఆర్.మహబూబ్ బాషా, ఇన్ఫర్మేషన్ కమిషనర్ శామ్యూల్ జొనాథన్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రికి ఆర్.ఎం.బాషా, శామ్యూల్ కుటుంబసభ్యులతో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

అల్పపీడనం ఒకింత ఆలస్యం!

సాక్షి, విశాఖపట్నం: వాతావరణ శాఖ ముందుగా అంచనా వేసినట్టుగా కాకుండా ఒక రోజు ఆలస్యంగా బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. తొలుత ఆగ్నేయ బంగాళాఖాతంలో అండమాన్ సముద్రానికి ఆనుకుని బుధవారం అల్పపీడనం ఏర్పడుతుందని ఐఎండీ అంచనా వేసింది. కానీ మారిన వాతావరణ పరిస్థితుల్లో గురువారం ఏర్పడనుందని పేర్కొంది. అనంతరం ఈ అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ 48 గంటల్లో దక్షిణ బంగాళాఖాతం మధ్య ప్రాంతంలో వాయుగుండంగా బలపడుతుందని తెలిపింది. దీని ప్రభావం ఈనెల 19 నుంచి దక్షిణ కోస్తాంధ్రపై మొదలు కానుంది. దక్షిణ కోస్తాంధ్రలో 19 నుంచి వర్షాలు కురవనున్నాయి. క్రమంగా వర్షాల ఉధృతి పెరిగే అవకాశాలున్నాయి.

ఒక్క క్లిక్‌తో ఓపీ రిజిస్ట్రేషన్

- క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు
- క్యూ లైన్లలో నిలబడాల్సిన తిప్పలుండవు
- దక్షిణాదిలో తొలిసారిగా విజయవాడ జీజీహెచ్‌లో
- వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు



ఓపీ రిజిస్ట్రేషన్ కోసం విజయవాడ జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్

సాక్షి, అమరావతి: ప్రస్తుత డిజిటల్ యుగంలో అగ్గిపెట్టె నుంచి ఆడి కారు కొనుగోలు వరకూ ఆర్థిక లావాదేవీలు మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లోనే జరిగిపోతున్నాయి. బ్యాంకు ఖాతా నెంబర్, మొబైల్ ఫోన్ నెంబర్‌తో పనిలేకుండా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అవతలి వ్యక్తి ఖాతాలోకి డబ్బులు పంపుతున్నారు. ఇదే తరహాలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా అవుట్ పేషెంట్ (ఓపీ) రిజిస్ట్రేషన్ పూర్తి చేసి డాక్టర్ అపాయింట్‌మెంట్‌కు టోకెన్ పొందే వెసులుబాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులోకి వస్తోంది. దక్షిణాదిలో తొలిసారిగా ఈ సేవలు విజయవాడ జీజీహెచ్‌లో ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఈమేరకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ విధానంపై ఆస్పత్రిలో రిసెప్షన్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటుతో పాటు క్యూఆర్ కోడ్ హోర్డింగ్స్, ఓపీ రిజిస్ట్రేషన్ ఎలా చేసుకోవాలో అవగాహన కల్పించేలా ఫ్లెక్సీలను అమర్చారు.

ఏమిటి లాభం?

సాధారణంగా ఎవరైనా వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వెళితే తొలుత ఓపీ కౌంటర్‌లో వివరాలను నమోదు చేసుకోవాలి. రోగి పేరు, చిరునామా, ఫోన్ నెంబర్, ఇతర వ్యక్తిగత వివరాలను వెల్లడించాలి. అనంతరం సంబంధిత విభాగానికి రోగిని రిఫర్ చేస్తూ టోకెన్ ఇస్తారు. ఈ ప్రక్రియ అంతా పూర్తయ్యేందుకు కనీసం 5–10 నిమిషాలు పడుతుంది. పెద్దాస్పత్రుల్లో రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. రోగులు గంటల తరబడి క్యూలో నిల్చొని పడిగాపులు పడాల్సి వస్తుంది. అదే క్యూఆర్ కోడ్ ద్వారా ఓపీ రిజిస్ట్రేషన్ చేసుకుంటే నేరుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌కు వెళ్లి టోకెన్ తీసుకుని డాక్టర్‌ను సంప్రదించవచ్చు. క్యూలైన్‌లో నిరీక్షించే అగచాట్లు తప్పుతాయి.

దేశానికి ఆదర్శంగా ఏపీ

ప్రజలకు కాగిత రహిత వైద్య సేవలు అందించడంలో ఏపీ ఇప్పటికే దేశానికి ఆదర్శంగా నిలిచింది. ఏపీ విధానాలను మార్గదర్శకంగా తీసుకోవాలని ఇతర రాష్ట్రాలకు సూచిస్తున్నట్లు నేషనల్ హెల్త్ అథారిటీ(ఎన్‌హెచ్‌ఏ) డైరెక్టర్ కిరణ్ గోపాల్ తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో ఇప్పటి వరకూ 3.50 కోట్ల మందికి ఆభా ఐడీలు సృష్టించారు. వీటిని ఆయా వ్యక్తుల ఆరోగ్య రికార్డులతో అనుసంధానించడంలో ఏపీ దేశంలో అగ్రస్థానంలో ఉంది. డిజిటల్ హెల్త్ సేవల్లో దేశంలోనే టాప్‌లో ఉన్న మన రాష్ట్రాన్ని పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సైతం వరించాయి.

మిగిలిన ఆస్పత్రులకూ విస్తరిస్తాం

విజయవాడ జీజీహెచ్‌లో ఈ వారం క్యూఆర్ కోడ్ ద్వారా ఓపీ రిజిస్ట్రేషన్ ప్రారంభిస్తాం. అనంతరం మిగిలిన ఆస్పత్రులకు సేవలను విస్తరిస్తాం. డిజిటల్ వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో ముందుకు వెళుతోంది. ప్రతి వ్యక్తి ఆభా ఐడీని వారి ఆరోగ్య రికార్డులతో అనుసంధానిస్తున్నాం. తద్వారా ఆ వ్యక్తి దేశంలో ఎక్కడికి వెళ్లిన ఆరోగ్య చరిత్ర వివరాలన్నీ ఒక్క క్లిక్‌తో అందుబాటులోకి వస్తాయి.

– జి.ఎస్.నవీన్‌కుమార్, ప్రత్యేక కార్యదర్శి, రాష్ట్ర డిజిటల్ హెల్త్

ఇదీ నమోదు విధానం..

- స్మార్ట్ ఫోన్ ద్వారా ఆస్పత్రిలో ప్రదర్శించే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి.
- వెంటనే యూఆర్ఎల్ కోడ్ కనిపిస్తుంది. దానిమీద క్లిక్ చేస్తే నేషనల్ హెల్త్ అథారిటీకి చెందిన ఆభా, ఇతర భాగస్వామ్య యాప్‌లు పేటీఎం, డ్రిఫ్కేస్, ఆరోగ్యసేతు, ఎక కేర్ లాంటి యాప్‌లు కనిపిస్తాయి.
- ఒకవేళ ఇప్పటి వరకూ ఆ యాప్‌లు ఫోన్‌లో లేకుంటే ప్లేస్టోర్ నుంచి ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- ఆయుష్మాన్ డిజిటల్ హెల్త్ అకౌంట్(ఆభా) 14 అంకెల గుర్తింపు/ఆభాలో రిజిస్టర్ చేసిన ఫోన్ నెంబర్/మెయిల్ ఐడీ ద్వారా యాప్‌లో రిజిస్టర్ అవ్వాలి.
- యాప్‌లోకి లాగిన్ అయిన వెంటనే ఆభా వివరాలు ప్రత్యక్షం అవుతాయి. వీటిని ఆస్పత్రితో షేర్ చేసే ఆప్షన్ కనిపిస్తుంది. షేర్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే టోకెన్ నెంబర్ వస్తుంది. ఈ టోకెన్ 30 నిమిషాల పాటు వ్యాలిడిటీలో ఉంటుంది.
- టోకెన్ నెంబర్ వచ్చాక ఆస్పత్రిలో కౌంటర్‌కు వెళ్లి ఆభా గుర్తింపు నెంబర్, ఫోన్ నెంబర్ తెలియచేసి ఏ స్పెషాలిటీలో ఓపీ అవసరమో చెబితే రిసెప్షన్ సిబ్బంది స్లిప్ ఇస్తారు. దీన్ని తీసుకుని నేరుగా డాక్టర్‌ను సంప్రదించవచ్చు.

జోహార్ నటశేఖరా

▶ మొదటి పేజీ తరువాయి

మంత్రోచ్చారణల మధ్య క్రతువును నిర్వహించారు. కృష్ణ చితికి ఆయన కుమారుడు మహేష్ బాబు నిప్పంటించారు. వేలాదిమంది ప్రజలు అశ్రునయనాలతో తమ అభిమాన నటుడికి అంతిమ వీడ్కోలు పలికారు. అంతకుముందు పూలతో అలంకరించిన వాహనంలో కృష్ణ పార్థివదేహాన్ని ఉంచి పద్మాలయ స్టూడియో నుంచి మహాప్రస్థానం వరకు అంతిమయాత్ర నిర్వహించారు. కుటుంబసభ్యులు, బంధువులు, సినీ, రాజకీయ ప్రముఖులు బారులు తీరిన కార్లలో ఊరేగింపును అనుసరించారు. పెద్దసంఖ్యలో ప్రజలు జేజేలు పలుకుతూ మహాప్రస్థానానికి చేరుకున్నారు.

పరిమిత సంఖ్యలో లోపలికి అనుమతి

వైకుంఠ మహాప్రస్థానంలోకి వెళ్లేందుకు పోలీసులు తొలుత పరిమిత సంఖ్యలోనే అనుమతించారు. మహేష్‌బాబు, కృష్ణ సోదరుడు ఆదిశేషగిరిరావు, కుమార్తెలు మంజుల, ప్రియదర్శిని, పద్మావతితో పాటు నటుడు నరేష్, సుధీర్‌బాబు, సంజయ్, గల్లా జయదేవ్ తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. తెలంగాణ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పువ్వాడ అజయ్‌కుమార్, ఏపీ మంత్రులు అంబటి రాంబాబు, చెల్లుబోయిన వేణులతో పాటు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ అరుణ్, కాంగ్రెస్ నాయకుడు వి.హన్మంతరావు, సినీ ప్రముఖులు మురళీమోహన్, దిల్‌రాజు, శివపార్వతి లోనికి వెళ్లారు. అభిమానులను మాత్రం క్రతువు ముగిసే వరకు అనుమతించలేదు. దీంతో మహాప్రస్థానం పరిసరాలన్నీ జనసంద్రంగా మారి పోయాయి.

నినాదాలతో మారుమ్రోగిన పరిసరాలు

భారీగా గుమిగూడిన అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 'కృష్ణ అమర్ రహే, సూపర్‌స్టార్ కృష్ణ అమర్ రహే, జోహార్ కృష్ణ, జై కృష్ణ..జైజై కృష్ణ' అంటూ హోరెత్తించారు. ఒక దశలో వారిని నియంత్రించడం పోలీసులకు కష్టసాధ్యంగా మారింది. కుటుంబసభ్యులు, ప్రముఖులు వెళ్లిపోయిన తర్వాత అభిమానులను అనుమతించారు. కృష్ణ అంత్యక్రియల ఏర్పాట్లను తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ దగ్గరుండి పర్యవేక్షించారు. అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని తెలంగాణ సీఎం కేసీఆర్ ఆదేశించిన నేపథ్యంలో ఆయన ముందుగానే మహాప్రస్థానానికి చేరుకుని పోలీసులు, అధికారులకు పలు సూచనలు చేశారు.



కాలుతున్న సూపర్‌స్టార్ కృష్ణ చితి

ఉదయం పద్మాలయ స్టూడియోకు తరలింపు

నానక్‌రాంగూడలోని విజయకృష్ణ నిలయంలో ఉన్న కృష్ణ పార్థివదేహాన్ని సందర్శించేందుకు మంగళవారం రాత్రి 8 గంటల వరకు అభిమానులను అనుమతించారు. ఆ తర్వాత ఎవరూ రాకుండా చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం 7.15 గంటలకు కృష్ణ భౌతికకాయాన్ని జూబ్లీహిల్స్‌లోని పద్మాలయ స్టూడియోకు పోలీస్ ఎస్కార్ట్‌తో తరలించారు. కుటుంబీకులు, సమీప బంధువులు కూడా స్టూడియోకు చేరుకున్నారు.

ప్రముఖుల నివాళులు

కృష్ణ పార్థివ దేహానికి సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణతో పాటు ఆయన సతీమణి వసుంధర, కుమార్తె బ్రాహ్మణి నివాళులర్పించారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, నిర్మాత అల్లు అరవింద్, నటుడు కోట శ్రీనివాసరావు, సినీ నటి జయప్రద, ఏపీ మంత్రి రోజా, రచయిత పరుచూరి గోపాలకృష్ణ తదితరులు కృష్ణ భౌతికకాయాన్ని సందర్శించారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో అంతిమయాత్ర మొదలైంది. సాయంత్రం 4 గంటల సమయంలో అంత్యక్రియలు ముగిసాయి.

పోలవరానికి నిధులు!

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వినతిపై కేంద్ర ప్రభుత్వం సానుకూలం

- 21న జల్ శక్తి శాఖ కార్యదర్శి సమావేశం అనంతరం కేంద్ర ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు
- ఈ సీజన్‌లో చేపట్టాల్సిన పనులపై కమిటీ నివేదికకు ఆమోదం
- బ్యాక్ వాటర్‌పై రీ సర్వే చేయాలన్న తెలంగాణ వినతికి పీపీఏ తిరస్కృతి
- ఏపీ అధికారుల వాదనతో ఏకీభవించిన పీపీఏ సీఈవో అయ్యర్
- ముంపు ప్రాంతాల రాష్ట్రాలతో త్వరలో జల్ శక్తి మంత్రి షెకావత్ భేటీ
- సమావేశంలో వెల్లడయ్యే అంశాల ఆధారంగా సుప్రీం కోర్టుకు నివేదిక



సాక్షి, అమరావతి: పోలవరాన్ని సత్వరమే పూర్తి చేసేందుకు వీలుగా రూ.పది వేల కోట్లను ముందస్తు (అడ్‌హాక్)గా ఇవ్వాలన్న సీఎం వైఎస్ జగన్ వినతిపై కేంద్రం సానుకూలంగా ఉన్నట్లు జల్ శక్తి శాఖ సంయుక్త కార్యదర్శి రిచా శర్మ చెప్పారు. ఈ అంశంపై జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ ఈ నెల 21న సమావేశాన్ని నిర్వహిస్తున్నారని, సమావేశం తర్వాత పోలవరానికి అడ్‌హాక్ నిధులు విడుదల చేయాలని కేంద్ర ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపుతారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో చంద్రశేఖర్ అయ్యర్ అధ్యక్షతన బుధవారం హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో 15 అంశాల అజెండాతో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. పీపీఏ సభ్యులైన రిచా శర్మ ఇందులో పాల్గొన్నారు. పోలవరాన్ని సత్వరమే పూర్తి చేసేందుకు వీలుగా సీఎం జగన్ ప్రతిపాదించిన మేరకు అడ్‌హాక్‌గా రూ.పది వేల కోట్లను విడుదల చేయాలని ఈ సందర్భంగా రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ కోరారు. దీనిపై రిచా శర్మ, చంద్రశేఖర్ అయ్యర్ స్పందిస్తూ అడ్‌హాక్‌గా నిధులు ఇచ్చే దిశగా కేంద్రం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

రీయింబర్స్ నిధులివ్వండి..

ఈ సీజన్‌లో మార్చి వరకూ పనులకు, 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని భూసేకరణకు, నిర్వాసితుల పునరావాసానికి రూ.7,300 కోట్లు విడుదల చేయాలని సమావేశంలో రాష్ట్ర అధికారులు కోరారు. ప్రాజెక్టు పనులకు రాష్ట్రం ఖర్చు చేసిన రూ.2,807 కోట్లను వెంటనే రీయింబర్స్ చేయాలని కోరారు. ఈ నెల 21న జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ అధ్యక్షతన జరిగే సమావేశంలో ఈ అంశాలను వివరించి నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని పీపీఏ సీఈవో చెప్పారు.

ప్రణాళికాయుతంగా పూర్తి..

గోదావరికి జూన్‌లో వచ్చిన ఆకస్మిక వరదల వల్ల గతేడాది ఆమోదించిన వర్కింగ్ షెడ్యూల్‌కు అంతరాయం కలిగింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడం, ఈ సీజన్‌లో చేపట్టాల్సిన పనులపై కార్యాచరణ రూపొందించేందుకు ఐదుగురు సభ్యులతో పీపీఏ కమిటీని నియమించింది. ప్రాజెక్టు పనులను కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇచ్చిన నివేదికపై సర్వ సభ్య సమావేశంలో చర్చించి ఆమోదించారు. గోదావరిలో వరద ప్రవాహం 24 వేల క్యూసెక్కులకు తగ్గిన నేపథ్యంలో పనులు ప్రారంభించామని, జనవరి ఆఖరుకు దిగువ కాఫర్ డ్యామ్‌ను డిజైన్ మేరకు 30.5 మీటర్ల ఎత్తుకు పూర్తి చేస్తామని రాష్ట్ర అధికారులు తెలిపారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్యన ఉన్న నీటిని తోడివేసి ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ గ్యాప్–1లో పనులు ప్రారంభించి డిసెంబర్ 2023 నాటికి 52 మీటర్ల ఎత్తుకు పూర్తి చేయాలని పీపీఏ ఆదేశించింది. ఈసీఆర్ఎఫ్ గ్యాప్–2లో కోతకు గురైన ప్రాంతం పూడ్చివేత పనుల పరీక్షలను నిర్వహించి సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్ మేరకు ఫిబ్రవరికి భూ ఉపరితలం స్థాయికి పూర్తి చేయాలని నిర్దేశించింది. డయాఫ్రమ్ వాల్ భవితవ్యం తేలాక సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు పనులు చేపట్టి ప్రాజెక్టును పూర్తి చేసేలా ప్రణాళికను ఆమోదించారు. తొలిదశలో కుడి, ఎడమ కాలువల కింద 2.98 లక్షల ఎకరాలు, రెండో దశలో మిగతా 4.22 లక్షల ఎకరాలకు నీళ్లందించేలా డిస్ట్రిబ్యూటరీలను పూర్తి చేయాలని పీపీఏ సూచించింది. డిసెంబర్‌లో పీపీఏ సమావేశాన్ని పోలవరం ప్రాజెక్టు వద్ద నిర్వహించి ఈ సీజన్‌లో చేపట్టాల్సిన పనులపై సమగ్రంగా చర్చిద్దామని రాష్ట్ర అధికారులు చేసిన ప్రతిపాదనకు పీపీఏ సీఈవో చంద్రశేఖర్ అయ్యర్ అంగీకరించారు. రాజమహేంద్రవరానికి పీపీఏ కార్యాలయం తరలింపుపై కూడా సానుకూలంగా స్పందించారు.

బ్యాక్ వాటర్‌పై రీ సర్వేకు నిరాకరణ

గోదావరికి జూలైలో వచ్చిన వరదలకు పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావం వల్ల భద్రాచలంతోపాటు తమ భూభాగంలో 827 ఎకరాల పంట పొలాలు ముంపునకు గురయ్యాయని తెలంగాణ ఈఎన్‌సీ సి.మురళీధర్ పేర్కొన్నారు. రిజర్వాయర్ గరిష్ట నీటి మట్టం (ఎఫ్ఆర్ఎల్) రేఖ తమ భూభాగంలో లేదని, ఎఫ్ఆర్ఎల్‌కు మించి జలాలు వెనక్కి ఎగదన్నడం వల్ల తమ భూభాగం ముంపునకు గురైందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల బ్యాక్ వాటర్ ప్రభావంపై మళ్లీ సర్వే చేయాలని కోరారు. దీనిపై రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎఫ్ఆర్ఎల్ రేఖ ఏపీ భూభాగంలోనే ఉంటుందని, కావాలంటే క్షేత్రస్థాయిలో చూపించడానికి సిద్ధమని స్పష్టం చేశారు. ఎఫ్ఆర్ఎల్‌కు, బ్యాక్ వాటర్ ప్రభావానికి సంబంధమే ఉండదన్న విషయంపై సంపూర్ణ అవగాహన ఉండి కూడా అందుకు విరుద్ధంగా మాట్లాడటం తగదని సూచించారు. ఈ దశలో పీపీఏ సీఈవో చంద్రశేఖర్ అయ్యర్ జోక్యం చేసుకుంటూ బ్యాక్ వాటర్ ప్రభావంపై ఇప్పటికే అధ్యయనం చేశామని గుర్తు చేశారు. బ్యాక్ వాటర్ ప్రభావమే ఉండదని అందులో తేలిందని, మళ్లీ అధ్యయనం చేసే ప్రశ్నే లేదన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పోలవరం ముంపు ప్రాంతాల రాష్ట్రాల అనుమానాలను నివృత్తి చేయడానికి జల్‌శక్తి శాఖ, సీడబ్ల్యూసీ రెండు దఫాలు సమావేశాలు నిర్వహించాయని గుర్తు చేశారు. జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ త్వరలో ముంపు ప్రాంత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశాన్ని నిర్వహించి సుప్రీం కోర్టుకు నివేదిక ఇస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో బ్యాక్ వాటర్ ప్రభావంపై చర్చకు అనుమతించబోమని తేల్చి చెప్పారు.

మన్యం గజగజ

- కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల లోపు నమోదు
- చలిగాలుల విజృంభణతో ప్రజల అవస్థలు



సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు): ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోవడంతో చలిపులితో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. మంగళవారంతో పోల్చుకుంటే బుధవారం మూడు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తగ్గాయి. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 13 డిగ్రీల నుంచి 8.2 డిగ్రీలకు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 12 డిగ్రీల నుంచి 9 డిగ్రీలకు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 12.7 డిగ్రీల నుంచి 9.7 డిగ్రీలకు పడిపోయింది. ఉష్ణోగ్రతలు తగ్గడంతో ఏజెన్సీ గ్రామాల్లో చలిగాలులు అధికమయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి చలి తీవ్రతకు ప్రజలు తాళలేకపోయారు. ఒక వైపు బంగాళాఖాతంలో అల్పపీడనంపై వాతావరణ శాఖ ప్రచారం చేసినా మన్యంలో మాత్రం పొగమంచు దట్టంగా కురిసి కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవడం విశేషం. బుధవారం ఉదయం 9.30 గంటల వరకు ఏజెన్సీ వ్యాప్తంగా పొగమంచు దట్టంగా కురిసింది. సూర్యోదయం ఆలస్యమైంది. మన్యంలో వృద్ధులు, చిన్నారులు చలితో అవస్థలు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు పొగమంచు, చలితీవ్రతతో వణుకుతున్నారు. మారేడుమిల్లి, రాజవొమ్మంగి, అడ్డతీగల, మోతుగూడెం, చింతూరు ప్రాంతాల్లో కూడా చలితీవ్రత నెలకొంది. ఘాట్ ప్రాంతాల్లో పొగమంచు తీవ్రతతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. అయితే చలిగాలులు విజృంభించినప్పటికీ పర్యాటకుల తాకిడి మన్యానికి ఏమాత్రం తగ్గలేదు. పొగమంచు ప్రకృతి అందాలను తనివితీరా వీక్షిస్తూ మధురానుభూతి పొందుతున్నారు.



అరకులోయలో ఉదయం 9 గంటలకు దట్టంగా కురుస్తున్న పొగమంచు

చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో	8.2 డిగ్రీలు	మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో	9.0 డిగ్రీలు	అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో	9.7 డిగ్రీలు

ప్రతిపక్షాలు అపోహలు సృష్టిస్తున్నాయి

- మంత్రి ధర్మాన ప్రసాదరావు

తిరుపతి అర్బన్/తిరుచానూరు: రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రతిపక్షాలు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు విమర్శించారు. వీటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. తిరుపతిలో బుధవారం ఉమ్మడి రాయలసీమ జిల్లాల ప్రాంతీయ రెవెన్యూ సదస్సు జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన మంత్రి ధర్మాన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ బడుగు, బలహీనవర్గాల వారికి మంచి చేయాలనే సంకల్పంతో అధికారంలోకి వచ్చిన తరువాత ఈ మూడున్నరేళ్లలో రూ.1.65 లక్షల కోట్లను వివిధ పథకాల లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమచేశారని గుర్తుచేశారు. ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలన్న లక్ష్యంతో రాష్ట్రంలో 30 లక్షల మందికి ఇంటిపట్టాలు ఇవ్వడంతోపాటు గృహనిర్మాణాలు చేపడుతున్నారని గుర్తుచేశారు. ఇందుకు రూ.12 వేల కోట్లు ఖర్చుచేస్తున్నారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇంత మొత్తంలో ఇళ్ల పంపిణీ ఇదే తొలిసారన్నారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న భూసర్వేతో ఎన్నో ప్రయోజనాలున్నాయని చెప్పారు. 90 శాతం గ్రామాల్లో సమస్యలు పరిష్కారమై ప్రశాంతమైన వాతావరణం నెలకొంటుందన్నారు.

అధికారులకు అండగా ప్రభుత్వం

క్షేత్రస్థాయిలో సమస్యలుంటే వాటికి పరిష్కారం చూపుతామని చెప్పారు. అవినీతి రహిత పాలనకు సీఎం శ్రీకారం చుట్టారని చెప్పారు. నిజాయితీగా పనిచేస్తున్న అధికారులపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. నిబద్ధతతో పనిచేస్తున్న అధికారులకు ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలను విజయవంతం చేయడానికి రెవెన్యూ విభాగం ఎంతో కీలకమైనదన్నారు. ఇందుకోసం సమష్టిగా పనిచేయాలని సూచించారు. కాలక్రమంలో వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా చేపట్టిన సంస్కరణలు అమల్లోకి వచ్చాయన్నారు. ఓ వ్యక్తి పుట్టినప్పటి నుంచి జీవించినంతకాలం, చివరికి అంత్యక్రియల వరకు రెవెన్యూ విభాగంతో ముడిపడి ఉండే బంధాలను ఆయన వివరించారు. ఈ సదస్సులో సీసీఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్, అదనపు సీసీఎల్ఏ సెక్రటరీ ఇంతియాజ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్, డైరెక్టర్ సిద్ధార్థ జైన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతిపక్షాలది దుష్ప్రచారం

అఖిల భారత రొయ్యల ఎగుమతిదారుల సంఘం

భీమవరం (ప్రకాశంచౌక్): ఆక్వారంగంపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు అఖిల భారత రొయ్యల ఎగుమతిదారుల సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇటీవల కాలంలో రొయ్యల ధర పడిపోయిందని, దీంతో రైతులు పంట విరామం ప్రకటిస్తున్నారని పలు పత్రికల్లో వచ్చిన వార్తలను నిరాధారమైనవని తెలిపింది. ప్రతిపక్షాలు ఆక్వారంగంపై చేస్తున్న ఆరోపణలు, ఆందోళనలు బాధ్యతారహితంగా ఉన్నాయని పేర్కొంది. రొయ్యలసాగులో ఏపీ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని తెలిపింది. రొయ్యల రైతులు, హేచరీలు, మేత ఉత్పత్తిదారులు, రొయ్యల ఎగుమతి దారులు చక్కటి అవగాహనతో కలిసి పనిచేయడం వల్లనే ఇది సాధ్యమైందని, ఈ అభివృద్ధి సాధనలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సహాయ, సహకారాలందించి ప్రోత్సహిస్తున్నాయని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ రంగానికి చెందిన భాగస్వాముల అభివృద్ధి కోసం తరచు సంప్రదింపులు జరుపుతూ తగిన ప్రోత్సాహం ఇచ్చే ప్రయత్నం చేస్తోందని తెలిపింది. ధరల నియంత్రణకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించిందని, ఈ ఉపసంఘం చర్చల ఫలితంగానే మేత ఉత్పత్తిదారులు పెంచిన ధరలను టన్నుకు రూ.2,600 తగ్గించారని వివరించింది. సీఎం జగన్ ఆదేశాల మేరకు ప్రభుత్వం చేపట్టిన క్రియాశీలక చర్యలను రైతులు, హేచరీల యజమానులు, మేత తయారీదారులు, ఎగుమతిదారులు అభినందిస్తున్నారని పేర్కొంది.

బంగారు భవితకే మూడు రాజధానులు

మంత్రి మేరుగు నాగార్జున



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: భావితరాల బంగారు భవిష్యత్తు కోసమే మూడు రాజధానులు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. శ్రీబాగ్ ఒప్పందంపై ఒంగోలు నగరంలోని ప్రకాశం భవనం వద్ద బుధవారం నిర్వహించిన సదస్సులో మంత్రి, ఎంపీ మాగుంట్ల శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

పచ్చదనం పెంపునకు అధిక ప్రాధాన్యం

రాష్ట్ర అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి

సాక్షి, అమరావతి/లబ్బీపేట(విజయవాడ తూర్పు): రాష్ట్రంలో పచ్చదనం పెంపునకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని రాష్ట్ర విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. రాష్ట్రంలో 23 శాతంగా ఉన్న అడవుల విస్తీర్ణాన్ని 33 శాతానికి పెంచాలన్నది లక్ష్యంగా సీఎం నిర్దేశించినట్టు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో బుధవారం యూఎస్ ఎయిడ్, కేంద్ర అటవీ పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో అటవీయేతర ప్రాంతాల్లో చెట్ల పెంపకంపై నిర్వహించిన సదస్సులో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

క్షీణిస్తున్న మునిసిపల్ కార్పొరేషన్ల ఆదాయం

దశాబ్ద కాలంగా దేశ జీడీపీలో ఒక్క శాతమే

దేశవ్యాప్తంగా స్థితిగతులపై ఆర్బీఐ నివేదికలో వెల్లడి

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా మునిసిపల్ కార్పొరేషన్ల సొంత ఆదాయం, సామర్థ్యం క్షీణిస్తోందని ఆర్బీఐ నివేదిక వెల్లడించింది. మునిసిపల్ కార్పొరేషన్ల ఆదాయ, వ్యయాలు దశాబ్ద కాలంలో దేశ జీడీపీలో ఒక్క శాతం వద్ద స్తబ్దుగా ఉన్నట్లు తెలిపింది. మెజారిటీ మునిసిపల్ కార్పొరేషన్ల బడ్జెట్ కాగితాలకే పరిమితమని, వాస్తవికతను ప్రతిబింబించడం లేదని పేర్కొంది. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే గ్రాంట్లపైనే మునిసిపల్ కార్పొరేషన్లు ఆధారపడుతున్నాయని, సొంత ఆదాయ మార్గాలు పెంచుకోవడంపై దృష్టి సారించాలని సూచించింది. దేశవ్యాప్తంగా మునిసిపల్ కార్పొరేషన్ల ఆర్థిక స్థితిగతులపై ఆర్బీఐ తొలిసారిగా అధ్యయన నివేదికను విడుదల చేసింది.

దక్షిణాఫ్రికా తరహాలో..


పెరుగుతున్న పట్టణ జనాభాకు తగినట్లుగా సేవల్లో నాణ్యత పెరిగేందుకు తక్షణం సొంత ఆదాయం పెంచుకోవాల్సిన అవసరం ఉందని నివేదిక స్పష్టం చేసింది. ఇందుకోసం దక్షిణాఫ్రికా తరహాలో సంస్కరణలు తేవాలని సూచించింది. బ్రెజిల్, రష్యన్ ఫెడరేషన్, చైనా, దక్షిణాఫ్రికాతో పోల్చి చూస్తే దేశంలో పట్టణ ప్రజలకు కనీస నీటి సరఫరా, పారిశుద్ధ్య సేవలు అందించడం చాలా తక్కువ శాతం ఉందని తెలిపింది. పెరుగుతున్న పట్టణ జనాభాకు మెరుగైన మౌలిక సదుపాయాలు, కనీస ప్రాథమిక సేవలందించేందుకు ఆస్తి పన్ను సంస్కరణలతోపాటు పాలనా సంస్కరణలు తేవాలని సూచించింది. ఆస్తి పన్ను మరింత సమర్థంగా వసూలు చేసే చర్యలు చేపట్టడంతోపాటు యూజర్ చార్జీలు, ప్రకటన పన్ను, పార్కింగ్ ఫీజు, ట్రేడ్ లైసెన్సుల జారీలో పటిష్ట విధానాలను అమలు చేయాలని పేర్కొంది. రహదారులు, సీవరేజ్, మంచినీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాల కల్పనకు మునిసిపల్ బాండ్లను జారీ చేయాలని సూచించింది.

సీఆర్‌డీఏ బాండ్లతో అత్యధిక రుణం

దేశంలో తొలిసారిగా 1997లో బెంగళూరు మునిసిల్ కార్పొరేషన్, 1998లో అహ్మదాబాద్ మునిసిపల్ కార్పొరేషన్లు మున్సిపల్ బాండ్ల జారీ ద్వారా రుణాలను సేకరించాయని, 2000 సంవత్సరం వరకు తొమ్మిది మునిసిపల్ కార్పొరేషన్లు బాండ్ల జారీ ద్వారా రూ.1200 కోట్ల వరకు సమీకరించినట్లు నివేదికలో ప్రస్తావించింది. జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యూవల్ మిషన్ ప్రారంభమయ్యాక 2005 నుంచి మున్సిపల్ బాండ్ల జారీ ఆకస్మాత్తుగా నిలిచిపోయిందని పేర్కొంది. తిరిగి 2017–2021 మధ్యలో తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్లు మున్సిపల్ బాండ్ల జారీ ద్వారా రూ.3840 కోట్లను సమీకరించినట్లు పేర్కొంది. ఇందులో అత్యధికంగా ఏపీ సీఆర్‌డీఏ బాండ్ల ద్వారా రూ.2000 కోట్లు రుణం తీసుకున్నాయి.

సొంత వనరులు పెంచుకునేలా..

ప్రైవేట్ భూ యజమానులపై భూమి విలువ పన్నులు, బెటర్‌మెంట్ లెవీ, డెవలప్‌మెంట్ చార్జీలు, ఖాళీ భూమి పన్ను మొదలైన మార్గాల ద్వారా సొంత ఆదాయ వనరులను పెంచుకోవాలని నివేదిక సూచించింది. మునిసిపల్ బాండ్ల జారీ ద్వారా సమీకరించిన నిధులను మూలధన వ్యయం కోసం ప్రత్యేకంగా వినియోగించాలని పేర్కొంది. బ్యాంకులు, ప్రైవేట్ సంస్థల ద్వారా మున్సిపాలిటీలకు రుణాల సేకరణకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపింది.



తలసరి అప్పుల్లో తెలంగాణ టాప్

దేశంలో మునిసిపల్ కార్పొరేషన్ల తలసరి రుణాల్లో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. తలసరి అప్పు రూ.1750 ఉండగా బిహార్, మహారాష్ట్రలో రూ.600 ఉన్నట్లు నివేదిక తెలిపింది. ఆంధ్రప్రదేశ్, కేరళ, గుజరాత్ రాష్ట్రాల్లో మునిసిపల్ కార్పొరేషన్లలో తలసరి అప్పు రూ.400 చొప్పున ఉంది.

షరతుల బాండ్లతో అవరోధాలు

దేశంలో మునిసిపల్ బాండ్లకు అనేక షరతులతో అనుమతించడం అవరోధంగా ఉందని నివేదిక తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వాల అనుమతితో బాండ్ల జారీకి అనుమతించినా ద్వితీయ మార్కెట్ లేకపోవడంతో కీలకమైన అడ్డంకిగా ఉందని పేర్కొంది. ఈ సెక్యూరిటీల కోసం మరింత విస్తృతమైన పెట్టుబడిదారుల వ్యవస్థ అవసరమని సూచించింది. పట్టణాలు, నగరాల్లో మౌలిక సదుపాయాలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో మునిసిపల్ బాండ్ల ద్వారా స్థిరమైన వనరుల సమీకరణకు ప్రోత్సహించాలని తెలిపింది. ఆర్థిక పెట్టుబడికి అవసరమైన వాతావరణం, సమర్థ నియంత్రణ, పారదర్శకత, మెరుగైన పాలనకు చర్యలు తీసుకోవాలని, స్టాక్ ఎక్స్ఛేంజీలలో మునిసిపల్ బాండ్లు నమోదయ్యేలా ద్వితీయ మార్కెట్‌ను అభివృద్ధి చేయాలని పేర్కొంది.

బాండ్ల జారీతో రూ.37,600 కోట్లు

మునిసిపల్ పాలన మెరుగుపరచేందుకు దక్షిణాఫ్రికా రెండు దశాబ్దాలుగా పలు చర్యలు తీసుకుంది. మూడంచెల విధానంలో జనాభా ఆధారంగా షరతులు లేకుండా సమానంగా వనరుల పంపిణీ చేపడుతోంది. అక్కడ 97 మునిసిపాలిటీలు 4.7 బిలియన్ డాలర్లు (రూ.37,600 కోట్లు) బాండ్ల జారీ ద్వారా నిధులను సమీకరించాయి.

పట్టణాల్లో మౌలిక సదుపాయాలకు బాండ్ల జారీలు ఇలా

జారీ చేసిన సంస్థ	ఏడాది	బాండ్లు జారీ (రూ.కోట్లలో)	అవసరం
ఏపీసీఆర్‌డీఏ	2018	2000	అమరావతి అభివృద్ధి ప్రణాళిక సమన్వయం
తమిళనాడు వాటర్ అండ్ శానిటేషన్	2017	80	అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు
తమిళనాడు వాటర్ అండ్ శానిటేషన్	2013	51	అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు
తమిళనాడు వాటర్ అండ్ శానిటేషన్	2012	51	అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు
కర్ణాటక వాటర్ అండ్ శానిటేషన్	2010	300	మున్సిపాలిటీలకు రుణాల కోసం
తమిళనాడు వాటర్ అండ్ శానిటేషన్	2010	83.2	అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు
తమిళనాడు వాటర్ అండ్ శానిటేషన్	2008	6.7	అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు
నాగ్‌పూర్ మెట్రోపాలిటన్ నీటి సరఫరా	2007	21.2	నీటి సరఫరా
కర్ణాటక వాటర్ అండ్ శానిటేషన్	2005	100	నీటి సరఫరా గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు
చెన్నై మెట్రోపాలిటన్ నీటి సరఫరా	2005	50	నీటి సరఫరా
చెన్నై మెట్రోపాలిటన్ నీటి సరఫరా	2004	42	నీటి సరఫరా
చెన్నై మెట్రోపాలిటన్ నీటి సరఫరా	2003	42	నీటి సరఫరా పెంపు
హైదరాబాద్ మెట్రోపాలిటన్ నీటి సరఫరా	2003	50	తాగునీటి సరఫరా
తమిళనాడు వాటర్ అండ్ శానిటేషన్	2002	30.4	అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు
తమిళనాడు అర్బన్ డెవలప్‌మెంట్ ఫండ్	2000	110	

రాష్ట్రమంతా ఒకేలా కొనుగోలు చేయాలి

- రొయ్యలు 100 కౌంట్ రూ.210 తగ్గకుండా కొనాల్సిందే
- ఇకనుంచి శాస్త్రీయంగా ధరల నిర్ధారణ జరగాలి
- ఎగుమతుల ప్రతికూలతపై దృష్టి సారించాలి
- జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లపై నిరంతర పర్యవేక్షణ
- రైతులు నష్టపోకుండా సమన్వయంతో ముందుకెళ్లాలి
- ఆక్వా సాధికారత కమిటీ భేటీలో మంత్రులు పెద్దిరెడ్డి, బొత్స, సీదిరి

సాక్షి, అమరావతి: ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు రాష్ట్రమంతా ఒకేరీతిలో రొయ్యల కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, డాక్టర్ సీదిరి అప్పలరాజు అధికారులను ఆదేశించారు. 100 కౌంట్ రొయ్యల ధర రూ.210కి తగ్గడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఈ ధర కంటే తక్కువగా కొనుగోలు చేసే ప్రాసెసింగ్ కంపెనీలను ఉపేక్షించబోమన్నారు. ఆక్వా సాధికారత కమిటీ సమావేశం బుధవారం మంత్రి పెద్దిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో జరిగింది. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు తీరును అధికారులు మంత్రులకు వివరించారు.



మాట్లాడుతున్న మంత్రులు సీదిరి, బొత్స, పెద్దిరెడ్డి

ఏపీ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వడ్డి రఘురాం మాట్లాడుతూ 100 కౌంట్ రూ.210 చొప్పున కొనుగోలు చేయాలన్న గత కమిటీ భేటీలో నిర్ణయాన్ని మెజార్టీ ప్రాసెసింగ్ కంపెనీలు పాటిస్తున్నాయని, కొన్ని కంపెనీలు మాత్రం నేటికీ రూ.190 నుంచి రూ.200 చొప్పున కొనుగోలు చేస్తున్నాయని చెప్పారు. అటువంటి కంపెనీలు, వ్యాపారులతో నిత్యం సంప్రదిస్తూ ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, కమిషనర్ కన్నబాబు మాట్లాడుతూ సాధికారత కమిటీ సమావేశాల్లో మంత్రులు ఇచ్చిన ఆదేశాల మేరకు సీడ్, ఫీడ్ రేట్లు, ఆక్వా ఉత్పత్తుల కొనుగోలు ధరలపై స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ రూపొందించినట్లు చెప్పారు. సీడ్, ఫీడ్ రేట్లను ఎప్పటికప్పుడు డిపార్ట్‌మెంట్ పోర్టల్‌లో ఉంచుతున్నామన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌తోపాటు దేశీయంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న ధరలను కూడా పోర్టల్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

ఆక్వారంగానికి ప్రభుత్వం చేయూత

మంత్రులు మాట్లాడుతూ ఆక్వా రంగానికి ప్రభుత్వం చేయూతనిస్తోందని చెప్పారు. ఆక్వా రైతులు, ప్రాసెసింగ్ యూనిట్లు, సీడ్, ఫీడ్ తయారీదారులు సమన్వయంతో ముందుకు సాగితేనే ఆక్వారంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ఆక్వారంగం సమస్యల పరిష్కారం కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సాధికారత కమిటీ ఏర్పాటైందని చెప్పారు. ధరల విషయంలో నిరంతరం అధికారుల పర్యవేక్షణ ఉండాలని, సమస్య ఏర్పడిన వెంటనే స్పందించాలని ఆదేశించారు. రొయ్యల ధరల స్థిరీకరణ, సీడ్, ఫీడ్ రేట్లు, నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థలను కలిగి ఉన్న రాష్ట్రం మనదేనని చెప్పారు. అత్యధికంగా ఆక్వా ఎగుమతులు చేస్తున్న రాష్ట్రంగా గుర్తింపు తెచ్చుకున్నామన్నారు. అంతర్జాతీయ మార్కెట్ల కారణంగా మన రాష్ట్రంలో ఆక్వారేట్లు కొన్నిసార్లు తగ్గిపోతున్నాయని, స్టోరేజీ అవకాశాలను పరిశీలించి అటువంటి సమయాల్లో ధరలను స్థిరీకరించేందుకు పరిశీలించాలని వారు సూచించారు. ఈ సమావేశంలో పర్యావరణం, అటవీ సైన్స్, సాంకేతిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పది రోజుల్లో 'ఆక్వా సమస్య' పరిష్కారం

ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ మార్కెట్లో ఒడిదొడుకుల వల్లే ఆక్వా ఎగుమతులు తగ్గాయని, పది రోజుల్లో ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఆక్వా సిండికేట్ వ్యాపారులకు కొమ్ముకాసి, రైతుల పొట్టకొట్టిన టీడీపీ నేతలు ఇప్పుడు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నేతల నేతృత్వంలో ప్రతిపక్షాలు చేస్తున్న విష ప్రచారాన్ని నమ్మవద్దని ఆక్వా రైతులకు విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. చైనా, అమెరికా వంటి దేశాలకు ఎగుమతులు తగ్గడం వల్ల ఆక్వా ధరలు.. ప్రధానంగా రొయ్యల ధరలు తగ్గాయని తెలిపారు. ఈక్వెడార్ దేశంలో రొయ్యల ఉత్పత్తి గణనీయంగా పెరగడమూ కారణమని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తక్షణమే స్పందించి ఆక్వా రైతులకు అండగా నిలిచేందుకు మంత్రుల నేతృత్వంలో సాధికార కమిటీని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ కమిటీ ఇప్పటికే ఎగుమతిదారులతో సమావేశమై మద్దతు ధర ఇవ్వాలని ఆదేశించిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఒడిదుడుకులు ఏర్పడినప్పుడు రొయ్యలు, చేపలను నిల్వ చేసుకోవడానికి రూ.546 కోట్లతో పది ప్రాసెసింగ్ యూనిట్లు, 23 ప్రీ ప్రాసెసింగ్ యూనిట్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.



ఆక్వా రైతులకు ఎన్నో ప్రయోజనాలు

ఆక్వా రైతులకు సీఎం జగన్ ఎన్నో ప్రయోజనాలు చేకూర్చారని తెలిపారు. పాదయాత్ర చేసిన సందర్భంగా యూనిట్ విద్యుత్ రూ.1.50కే హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక దానిని అమలు చేశారని చెప్పారు. దీనివల్ల 86 శాతం రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. మూడేళ్లలో విద్యుత్ సబ్సిడీ రూపంలోనే రూ.2,377 కోట్లు ఇచ్చారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో ఆక్వాకు రూ.100 కోట్లు కూడా ఖర్చు చేయలేదని చెప్పారు. కరోనా సంక్షోభంలోనూ సీఎం జగన్ రైతులకు అండగా నిలిచారని, ఎన్నడూ లేని రీతిలో ఆక్వా ఉత్పత్తులకు మంచి ధరలు ఇప్పించారని గుర్తు చేశారు. తక్కువ ధరకు నాణ్యమైన విత్తనం (సీడ్), ఫీడ్ (మేత) అందించేలా చట్టాలను తెచ్చారన్నారు. ఈ చర్యల ద్వారా పెట్టుబడి వ్యయాన్ని తగ్గిస్తున్నారని వివరించారు. ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీని కూడా ఏర్పాటు చేశారన్నారు. అనుమతులను సులభతరం చేయడం వల్ల ఆక్వా సాగు ఐదు లక్షల ఎకరాలకు చేరుకుందన్నారు. ఆక్వా సాగులో దేశంలో రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలిపిన ఘనత సీఎంకు దక్కిందన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు శిష్యులైన కొందరు వ్యాపారులు సిండికేట్ అయ్యి ఆక్వా రంగాన్ని దెబ్బతీసేలా దుష్ప్రచారం చేస్తున్నారని, వారి ఆటలు సాగనివ్వబోమని చెప్పారు.

వికేంద్రీకరణే సీమ అభివృద్ధికి దిక్సూచి

శ్రీ బాగ్ ఒప్పందానికి 85 ఏళ్లు పూర్తి.. సీమవ్యాప్తంగా ర్యాలీలు, రౌండ్ టేబుల్ సమావేశాలు, దీక్షలు

సాక్షి అమరావతి/సాక్షి నెట్‌వర్క్: వికేంద్రీకరణే రాయలసీమ అభివృద్ధికి దిక్సూచి అని సీమ ప్రజ ఎలుగెత్తి చాటింది. పాలన వికేంద్రీకరణ ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పానికి మద్దతు పలికింది. అన్ని ప్రాంతాల సమానాభివృద్ధి ద్వారా భవిష్యత్తులో వేర్పాటు వాదం రాకూడదన్నదే సీఎం జగన్ ఆలోచన అని వెల్లడించింది. పాలన వికేంద్రీకరణ చేసి, శ్రీబాగ్ ఒప్పందం మేరకు కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. 1937 నవంబర్ 16న జరిగిన శ్రీబాగ్ ఒడంబడికకు 85 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆ ఒప్పందం స్ఫూర్తిని ప్రజలకు తెలియజేసే ఉద్దేశంతో బుధవారం సీమ వ్యాప్తంగా పలు కార్యక్రమాలు జరిగాయి. ర్యాలీలు, మానవ హారాలు, రౌండ్ టేబుల్ సమావేశాలు, చర్చా కార్యక్రమాలు, సత్యాగ్రహ దీక్షలు నిర్వహించారు. ప్రజలు, విద్యార్థి, యువజన సంఘాలు, న్యాయవాదులు, మేధావులు పాల్గొన్నారు.

కర్నూలు జిల్లాలో ఉద్యమ శంఖారావం

కర్నూలు నగరంలో జేఏసీ చైర్మన్ విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజ్ విహార్ సర్కిల్‌లో వేలాది మందితో మానవహారం ఏర్పాటు చేశారు. ప్లకార్డులు పట్టుకుని మూడు రాజధానుల కోసం నినదించారు. విద్యార్థులు వినూత్నంగా 'శ్రీబాగ్ 1937' ఆకారంలో కూర్చొన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. న్యాయ రాజధానిని సాధించుకోకపోతే భావితరాలు మనల్ని క్షమించవన్నారు. 25న భారీ సభ ఏర్పాటు చేసి రాష్ట్రమంతా తమ వాణిని వినిపిస్తామని చెప్పారు. ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ పాల్గొన్నారు. నంద్యాల గాంధీచౌక్‌లో జేఏసీ చైర్మన్ బంగారురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ పాల్గొన్నారు. ఆళ్లగడ్డలో జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన భారీ ర్యాలీ, మానవహారంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బనగానపల్లిలో జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండలో భారీ ర్యాలీలు,ఆదోనిలో, ఆలూరులో రౌండ్‌టేబుల్ సమావేశాలు జరిగాయి. నందికొట్కూరులో నిర్వహించిన మానవహారంలో ఎమ్మెల్యే ఆర్థర్, ప్రజలు పాల్గొన్నారు.



కర్నూలులో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, ప్రజా సంఘాల, జేఏసీ నేతలు

శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలు చేయాల్సిందే

శ్రీబాగ్ ఒడంబడికను అమలు చేసి తీరాల్సిందేనని మేధావులు, ప్రజా సంఘాల నేతలు ఉద్ఘాటించారు. వికేంద్రీకరణకు మద్దతుగా బుధవారం వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా రౌండ్ టేబుల్ సమావేశాలు, ర్యాలీలు నిర్వహించారు. కడపలో జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, కేసీ కెనాల్ ఆయకట్టుదారుల సంఘం అధ్యక్షుడు చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, డాక్టర్ ఓబుల్‌రెడ్డి, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. మైదుకూరు నియోజకవర్గం, దువ్వూరులో మేధావులు, రైతు, ప్రజా సంఘాల నేతల రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బద్వేల్ పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పులివెందులలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మునిసిపల్ చైర్‌పర్సన్ వరప్రసాద్, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. కమలాపురంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఇప్పుడు కాకపోతే.. ఇంకెప్పుడు?

తిరుపతిలో జరిగిన శ్రీబాగ్ ఒప్పంద దినోత్సవ సమావేశంలో ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, ఎంపీ, పలువురు మేధావులు మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ హయాంలో తప్ప మరెప్పటికీ శ్రీబాగ్ ఒప్పందం అమలు కాదని భూమన స్పష్టంచేశారు. శ్రీబాగ్ ఒప్పందం రాజకీయ పార్టీ ఒప్పందం కాదని, పెద్ద మనుషుల ఒప్పందమని రాయలసీమ మేధావుల ఫోరం కన్వీనర్ పురుషోత్తంరెడ్డి స్పష్టం చేశారు. శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, సభ నిర్వహించారు. సూళ్లూరుపేట, నాయుడుపేటలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం చేశారు. పలమనేరులో ఎమ్మెల్యే వెంకటేగౌడ్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో భారీ సభ నిర్వహించారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో..

కళ్యాణదుర్గంలో మంత్రి ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో మానవహారం, రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. అనంతపురంలో వికేంద్రీకరణ జేఏసీ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్షలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. శింగనమలలో ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరి సాంబశివారెడ్డి నేతృత్వంలో భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. గుంతకల్లులో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీకి ప్రజలు, విద్యార్థులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రాయలసీమ విమోచన సమితి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఉరవకొండ బుదగవిలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పుట్టపర్తిలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి పెనుకొండ, మడకశిర, కదిరి ఎమ్మెల్యేలు శంకరనారాయణ, తిప్పేస్వామి, సిద్ధారెడ్డి హాజరయ్యారు. మడకశిరలో ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు.

అందరినోటా.. వికేంద్రీకరణ మాట

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరులో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో, ఆత్మకూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో, ఉదయగిరిలో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీలు చేశారు. నెల్లూరు రూరల్ పరిధిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో, నెల్లూరు నగరంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో, కావలి నియోజకవర్గం బోగోలులో ర్యాలీలు నిర్వహించారు.

చంద్రబాబుకు చుక్కెదురు

'రాయలసీమ ద్రోహి.. గో బ్యాక్ బాబు' అంటూ నినాదాలు





మాట్లాడుతున్న చంద్రబాబు, నిరసన తెలుపుతున్న స్థానికులు

కర్నూలు (సెంట్రల్): కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన చంద్రబాబుకు బుధవారం పత్తికొండలో చుక్కెదురైంది. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడ నుంచి రోడ్డు మార్గాన కర్నూలు, కోడుమూరు, దేవనకొండ మీదుగా పత్తికొండకు చేరుకున్నారు. దేవనకొండలో విద్యార్థి, ప్రజా సంఘాల సంఘాల నేతలు కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. వారిని పోలీసులు అడ్డుకొని కాన్వాయ్‌ను ముందుకు పంపారు. పత్తికొండకు చేరుకోగానే స్థానికులు చంద్రబాబు కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. గో బ్యాక్ బాబు.. రాయలసీమ ద్రోహి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసులు వారిని పక్కకు తోసివేశారు. దీంతో చంద్రబాబు ఆందోళనకారులపై విరుచుకుపడ్డారు. చిల్లర రాజకీయాలు తన దగ్గర చెల్లవని, అవన్నీ జగన్‌రెడ్డి దగ్గర చేసుకోవాలన్నారు.

ప్రశ్నిస్తే అరెస్టులే సీఎం పని: బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు పత్తికొండలో బహిరంగ సభలో మాట్లాడుతూ.. సీఎం జగన్ నియంత పాలన చేస్తున్నారని, సైకో రెడ్డి ఎప్పుడు ఎవరిని అరెస్ట్ చేయిస్తారో తెలియడం లేదని ఆరోపించారు. దమ్ముంటే వివేకా హత్య కేసులో సీబీఐ విచారణకు సహకరించాలని సవాల్ విసిరారు. ఆయన వెంట కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, కోట్ల సుజాతమ్మ, వైకుంఠం మల్లికార్జునచౌదరి, కేఈ శ్యాంబాబు, గౌరు చరితారెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి ఉన్నారు.

ఈసారి అధికారంలోకి రాకపోతే ఇవే నాకు ఆఖరి ఎన్నికలు

2024లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురాకపోతే, తనకు ఇవే ఆఖరి ఎన్నికలు అవుతాయని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు.



మీకు ఉన్న దానిని
మీరు ఆస్వాదించలేనంతగా
మీ జీవితాన్ని గడపడంలో అర్థం లేదు.
– పరమహంస యోగానంద

సాక్షి

గురువారం, నవంబర్, 17

మళ్లీ దారిమళ్లిన జీ-20

వర్తమానం యుద్ధశకంగా మారకూడదని, రష్యా–ఉక్రెయిన్ మధ్య ఘర్షణలు అంతమొందించటానికి అన్ని పక్షాలూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిస్తూ రెండురోజులపాటు ఇండొనేసియాలోని బాలిలో జరిగిన జీ–20 శిఖరాగ్ర సదస్సు బుధవారం ముగిసింది. దేశాలమధ్య ఆర్థిక సహకారం పెంపొందించటం ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను సుస్థిరపరచాలన్న సంకల్పంతో 23 ఏళ్లక్రితం ఈ సంస్థ ఏర్పడింది. కానీ ఆరంభం నుంచీ ఇతరేతర సంక్షోభాలు దాన్ని ముసురుకుంటున్నాయి. పర్యవసానంగా శిఖరాగ్ర సదస్సు ఎజెండాపై కాక ఎప్పటికప్పుడు ముంచుకొచ్చే క్లిష్ట సమస్యలపైనే దృష్టి కేంద్రీకరించక తప్పడం లేదు. జీ–20 సామాన్యమైనది కాదు. ప్రపంచ స్థూల ఉత్పత్తిలో ఈ సంస్థ సభ్య దేశాల వాటా 80 శాతం. ప్రపంచ వాణిజ్యంలో 75 శాతం ఈ దేశాలదే. ఇక జనాభారీత్యా చూస్తే దాదాపు మూడింట రెండువంతుల మంది ఈ దేశాల్లోనే నివసిస్తున్నారు. బాలి శిఖరాగ్ర సదస్సు ఎదుట పెద్ద ఎజెండాయే ఉంది. దాదాపు ఏణ్ణర్థంపాటు కోవిడ్ మహమ్మారి ప్రపంచ దేశాలన్నిటినీ తీవ్రంగా దెబ్బతీసిన నేపథ్యంలో భవిష్యత్తు సంక్షోభాలను ఎదుర్కొనడానికి అంతర్జాతీయంగా పటిష్టమైన ఆరోగ్య వ్యవస్థ రూపకల్పనపై సమాలోచనలు ఈ సదస్సు లక్ష్యం. ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ మరింత సమర్థవంతంగా అమలయ్యేలా తగిన ప్రణాళికలు రూపొందించాలని కూడా ముసాయిదా తెలిపింది. స్వచ్ఛ ఇంధన వనరుల వినియోగం పెరిగేలా, ప్రపంచ దేశాలు ఆ దిశగా మళ్లేలా ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించాలని కూడా సంకల్పించారు. స్వచ్ఛ ఇంధన వనరుల కోసం భారీ పెట్టుబడులు అవసరమవుతాయి. అందుకోసం సంపన్న దేశాలు ఏం చేయాలో కూడా ఈ సదస్సులో చర్చించాల్సి ఉంది. కానీ రెండురోజుల సదస్సునూ గమనిస్తే నిరాశే మిగులుతుంది.

నిరుడు అక్టోబర్‌లో ఇటలీలోని రోమ్‌లో జీ–20 శిఖరాగ్ర సదస్సు జరిగింది. ఈ ఏడాది కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. జీ–20 సభ్య దేశాల్లో కోవిడ్ పర్యవసానంగా ఉత్పాదకత గణనీయంగా పడిపోయింది. మన దేశం వరకూ చూస్తే ఉత్పాదకతలో 14 శాతం క్షీణత కనబడుతోంది. అందరికన్నా అధికంగా నష్టపోయింది మనమే. మొన్న ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణకు దిగకపోయివుంటే ఆర్థిక వ్యవస్థలు ఇంత చేటు నష్టపోయేవి కాదేమో! కానీ దురాక్రమణ, అనంతరం రష్యాపై పశ్చిమ దేశాల ఆంక్షలు తీసుకొచ్చిన అనిశ్చితి ద్రవ్యోల్బణాన్ని అమాంతం తారస్థాయికి చేర్చింది. పర్యవసానంగా వేరే దేశాల మాటేమోగానీ పశ్చిమ దేశాల కొనుగోలు శక్తి పడిపోయింది. వృద్ధిని అది కోలుకోలేని దెబ్బతీసింది. ఈ గండంనుంచి గట్టెక్కేందుకు చాలా దేశాల సెంట్రల్ బ్యాంకులు వడ్డీ రేట్లు పెంచాయి. ఇది సహజంగానే ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం చూపింది. అమెరికా, బ్రిటన్‌లు ఆర్థిక మాంద్యంలోకి జారుకునే సూచనలు కనబడుతున్నాయి. యూరోప్ దేశాల ఆర్థిక వ్యవస్థలు మందగమనం నుంచి స్తంభించే దిశగా కదులుతున్నాయంటున్నారు. ఆకలి, నిరుద్యోగం ఇప్పటికే చాలా దేశాలను చుట్టుముట్టాయి. ఇక ప్రపంచ ఆర్థిక చోదక శక్తుల్లో ఒకటైన చైనాను రియల్ ఎస్టేట్ సంక్షోభం పీడిస్తోంది. దాంతో ఆ దేశ జీడీపీ బాగా తగ్గే అవకాశాలు కనబడుతున్నాయి. దీన్నుంచి బయటపడటం మాట అటుంచి కనీసం తక్కువ నష్టంతో గట్టెక్కాలన్నా జీ–20 దేశాలమధ్య సహకారం, సమన్వయం, ఐక్యత అవసరం. ఈ శిఖరాగ్ర సదస్సు ఎజెండాలోని అంశాల మాట అటుంచి కనీసం సభ్య దేశాల ఐక్యతకు అనువైన కార్యాచరణ రూపొందించగలిగితే బాగుండేది. కానీ అది సాధ్యపడినట్టు కనబడటం లేదు. ఈమధ్య ప్రపంచ ఆర్థిక స్థితిగతులపై ఐఎంఎఫ్ విడుదల చేసిన నివేదిక ఒక ముఖ్యమైన సూచన చేసింది. జీ–20 దేశాలన్నీ సమష్టిగా కదలి, గట్టి కార్యాచరణకు పూనుకొంటే ప్రస్తుత సంక్షోభంనుంచి ప్రపంచం గట్టెక్కుతుందని తెలిపింది. ఇందుకు శాంతి నెలకొనడం అవసరమని వివరించింది. కానీ వినేదెవరు? సదస్సు మొదటి రోజున కూడా ఉక్రెయిన్ ప్రధాన నగరాలపై రష్యా క్షిపణి దాడులు చేసింది. నాటో సభ్యదేశమైన పోలాండ్‌లో రష్యా క్షిపణి ఒకటి పేలి ఇద్దరు పౌరులు మరణించారు. ఇది ఉద్దేశపూర్వకమా, పొరపాటా అన్నది నిర్ధారణ కాలేదు. ఆ క్షిపణి రష్యా భూభాగంనుంచి ప్రయోగించివుండకపోవచ్చని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చెబుతున్నారు. రష్యా ఉద్దేశపూర్వకంగా చేసివుంటే అది నాటోకు తొలి హెచ్చరిక పంపినట్టే అనుకోవాలి.

ఈసారి జీ–20 సదస్సు మొత్తం రష్యా–ఉక్రెయిన్ లడాయిపైనే కేంద్రీకరించక తప్పని స్థితి ఏర్పడింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ సదస్సుకు రాలేదన్న మాటేగానీ సదస్సు మొత్తం ఆయన చుట్టూ, ఆయన ముందుముందు వేయబోయే అడుగుల చుట్టూ తిరిగింది. ఏతావాతా ప్రచ్ఛన్న యుద్ధ కాలానికి ప్రపంచం తిరోగమించిందనే చెప్పుకోవాలి. రష్యా–పాశ్చాత్య దేశాల వైషమ్యాలు పెచ్చుమీరాయి. దీనికి చైనా తలనొప్పి అదనం. అందువల్లనే ప్రధాన ఎజెండా మాట అటుంచి అసలు రష్యా దురాక్రమణను ఖండిస్తూ జీ–20 ఒక సంయుక్త ప్రకటనైనా విడుదల చేయగలదా అన్న సందేహాలు తలెత్తాయి. అనుకున్నట్టే ఆ ప్రకటనలో హితబోధలే ధ్వనించాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే నెల 1న జీ–20 సారథ్య బాధ్యతలు స్వీకరించబోతున్నారు. రెండు ప్రపంచ యుద్ధాల పర్యవసానంగా మానవజాతి మనుగడకు ఏర్పడిన ముప్పును గుర్తుంచుకునైనా సంపన్న రాజ్యాలు కయ్యానికి కాలుదువ్వే పోకడలకు స్వస్తిపలకాలి. శాంతి నెలకొనడానికి దోహదపడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
కార్తీక మాసం, **తిథి:** బ.నవమి తె.5.40 వరకు (తెల్లవారితే శుక్రవారం)
తదుపరి దశమి, **నక్షత్రం:** మఖ సా.6.41 వరకు, తదుపరి పుబ్బ,
వర్జ్యం: రా.3.16 నుండి 5.01 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.51 నుండి
10.36 వరకు, తదుపరి ప.2.20 నుండి 3.05 వరకు,
అమృతఘడియలు: రా.3.13 నుండి 5.01 వరకు.

సూర్యోదయం : 6.09
సూర్యాస్తమయం : 5.21
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సంక్షోభం నుంచి సంక్షేమం లోకి...

విశ్లేషణ



ప్రొ॥ కె.వి. రమణా రెడ్డి

సంక్షేమ కార్యక్రమాలు ఉచితాలు కావనీ, మానవ వనరుల అభివృద్ధికి అవి తప్పనిసరి అనీ, దీర్ఘకాలంలో నిలకడైన అభివృద్ధికి అవి దోహదపడతాయనీ ఏపీ ప్రభుత్వం చెబుతోంది. పైగా ఈ పథకాల ద్వారా కలిగే ప్రయోజనాలు కింది వర్గాల కొనుగోలు శక్తిని పెంచి, కుటుంబాల శ్రేయస్సును, పురోగతిని పెంచుతాయని అంటోంది. పేదల అనుకూల విధానాలను వైఎస్ జగన్ ప్రభుత్వం గత మూడున్నర సంవత్సరాలుగా క్రియాశీలకంగా అమలుచేయడం వల్లే గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో మునుపెన్నడూ చూడని గొప్ప మార్పులు చోటు చేసుకుంటున్నాయని చెప్పవచ్చు. ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా ఏపీలో ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. ప్రభుత్వ పథకాలు, బ్యాంకుల వితరణ కారణంగా కుటుంబాల్లో దారిద్ర్య స్థాయి గణనీయంగా తగ్గుముఖం పట్టింది. ప్రధానంగా నిరుపేదల్లో కెల్లా నిరుపేద కుటుంబాల్లో 90 శాతం పైగా దారిద్ర్య రేఖను అధిగమించేశారు.

సంక్షేమ కార్యక్రమాలు వర్సెస్ ఉచితాలు, అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం తీవ్రంగా చర్చ జరుగుతోంది. సంక్షేమ కార్యక్రమాలు ఉచితాలు కావనీ మానవ వనరుల అభివృద్ధికి అవి తప్పనిసరి అనీ, దీర్ఘకాలంలో నిలకడైన అభివృద్ధికి అవి దోహదపడతాయనీ ఏపీ ప్రభుత్వం వాదిస్తోంది. పైగా ఈ పథకాల ద్వారా కలిగే ప్రయోజనాలు కింది వర్గాల కొనుగోలు శక్తిని పెంచి దారిద్ర్యాన్ని తగ్గించడమే కాక, కుటుంబాల శ్రేయస్సును, పురోగతిని పెంచుతాయని ఏపీ ప్రభుత్వం చెబుతోంది. మరోవైపున ప్రధాన ప్రతిపక్షం మాత్రం సంక్షేమ పథకాలు అంటే ఉచితాలు మాత్రమేననీ, అవి వృథా ఖర్చు మాత్రమేననీ, అనుత్పాదకమైనవనీ విమర్శిస్తోంది. పైగా ఈ సంక్షేమ పథకాలు ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రజాకర్షక మార్గాలు మాత్రమేనని ప్రతిపక్షాలు వాదిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకుల నుంచి రుణాల ప్రభావం గురించి సెర్ప్ (ఎస్ఈఆర్‌పీ) సంస్థ సీఈఓ అంచనా వేయాలని భావించారు. కూలంకషమైన చర్చల తర్వాత, ఒక కన్సల్టెంటుగా (ఎమ్ అండ్ ఈ) విశాఖపట్నం జిల్లాలో పద్మనాభ మండలాన్ని, రెండు మండల మహిళా సమాఖ్యలు, మరో రెండు గ్రామ సంస్థలను పరిశీలన కోసం ఎంపిక చేసుకున్నాను. ఎఫ్‌జీడీల ద్వారా, వీఓ నేతలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులతో వ్యూహాత్మక ఇంటర్వ్యూల ద్వారా ఈ కార్యక్రమాల ప్రభావాన్ని అంచనా వేయాలని నిర్ణయించుకున్నాను. ఈ పనిలో భాగంగా అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు, క్లస్టర్ కోఆర్డినేటర్లు, వ్యవసాయ అధికారులు, మండలంలోని అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్, ఆదర్శ వ్యవసాయదారులతో కూలంకషంగా చర్చించాను.

పద్మనాభ మండల మహిళా సమాఖ్య 45 వీవోలతో కూడి ఉంది. ప్రతి వీఓలో ఇద్దరు లీడర్లు ఉంటారు. 1,423 స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జీలు) ఉన్నాయి. వీటి మొత్తం సభ్యుల సంఖ్య 15,363. మండలంలోని దాదాపు 90 శాతం గృహాలు ఎస్‌హెచ్‌జీల పరిధి కింద ఉంటున్నాయి. మండలంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, బ్యాంకుల నుంచి తీసుకుంటున్న రుణాలపై అభిప్రాయాలు తీసుకోవడానికి 100 మందితో మాట్లాడటం జరిగింది.

సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సభ్యులు, మండలంలోని ప్రజల సామాజిక నిర్మాణం గురించి తెలుసుకోవడం సముచితంగా ఉంటుంది. అప్పుడే ఏఏ వర్గాల వారు ఏ మేరకు ప్రభుత్వ పథకాల ప్రయోజనం పొందుతున్నారో అవగతమవుతుంది. ఎస్‌హెచ్‌జీలోని మొత్తం సభ్యులలో ఎస్సీలు 10 శాతం, ఓసీలు 10 శాతం, బీసీలు 70 శాతం మంది ఉంటున్నారు. సామాజికంగా వెనుకబడిన బృందాల వద్ద తక్కువ పరిమాణంలో భూమి ఉన్నదనీ తేలింది.

దారిద్ర్యం నుంచి బయటపడేయటానికి ప్రధాన సూచికలలో ఒకటి ఏమిటంటే డబ్బు అందుబాటులోకి రావడం. బ్యాంకులు, స్త్రీనిధి కలిసి 2019 నుంచి 2022 జూలై వరకు స్వయం సహాయక బృందాలకు రూ. 130 కోట్ల నగదును పంపిణీ చేశాయి. సున్నా వడ్డీ కారణంగా బృంద సభ్యులు ఒకటి నుంచి రెండు లక్షల రూపాయల వరకు రుణాలు తీసుకోగలిగారు. పైన పేర్కొన్న కాలంలోనే రూ. 130 కోట్లను వీరికి పంపిణీ చేశారు. ఎస్‌జీహెచ్‌లలోని సభ్యుల్లో 95 శాతం మంది ఒకటి కంటే ఎక్కువ ప్రయోజనాలు పొందారని తేలింది. మరోమాటలో చెప్పాలంటే 5 శాతం మంది సభ్యులు ఒక ప్రయోజనం మాత్రమే పొందగా 40 శాతం మంది సభ్యులు 3 ప్రయోజనాలు పొందారనీ, మిగిలిన 55 శాతం సభ్యులు 6 కంటే ఎక్కువ ప్రయోజనాలు పొందారనీ తేలింది. సగటున ప్రతి గ్రూప్ మెంబర్ సంవత్సరానికి 50 వేలనుంచి లక్షరూపాయల వరకు లబ్ధి పొందారు.

ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా స్వయం సహాయక బృందాలకు దాదాపు రూ. 170 కోట్లు పంపిణీ చేశారు. ఇది కాకుండా, రైతు భరోసా, అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యా దీవెన, వసతి దీవెన, ఆసరా, సున్నా వడ్డీ, చేయూత, శ్రీనిధి తదితర సంక్షేమ పథకాలు, బ్యాంక్ రుణాలు కలిసి రూ. 300 కోట్ల నగదు మహిళలకు అందింది.

'నవరత్నాలు' పేరిట సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడానికి ఏపీ ప్రభుత్వం ప్రత్యక్ష నగదు బదిలీ పద్ధతిని అనుసరించింది. దీంతో ప్రభుత్వం అందించే ప్రయోజనాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి బదిలీ అవుతున్నాయి. వలంటీర్ వ్యవస్థతో కూడిన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ద్వారా కులం, మతం, జెండర్, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన లబ్ధిదారులందరికీ ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు చేరుతున్నాయి.





విశాఖ జిల్లా పద్మనాభం మండలంలోని మహిళలతో వ్యాసకర్త

బ్యాంకుల రుణాలు, సంక్షేమ పథకాలు సకాలంలో అందితే వ్యవసాయరంగం ఎంతగా అభివృద్ధి చెందుతుందో ఏపీ ప్రభుత్వ పాలన నిరూపించింది. గత మూడేళ్ల నాలుగు నెలల్లో ఈ మండలంలో రైతులు ఖరీఫ్, రబీ సీజన్లు రెండింటిలోనూ మూడు పంటలు పండిస్తూ వచ్చారు. ఖరీఫ్‌లో ప్రధానంగా వరి పంట పండించారు. రబీలో బోర్‌వెల్స్‌లో నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో రాగులు, వరి, నువ్వులు, నల్ల ఉలవలు వంటి పంటలను పండించారు. ఈ మూడేళ్ల నాలుగు నెలల కాలంలో వరి ధాన్యం 24– 26 సంచులు ఎక్కువగా పండించారు. వరి పంట పండించిన రైతుల ఆదాయం రూ. 12 వేల నుంచి 15 వేల రూపాయల వరకు పెరిగింది. రాగి పంట 7 బస్తాలు అదనంగా పండింది. ఆదాయం రూ. 30 వేలవరకు పెరిగింది. నువ్వుల పంట కూడా 3 క్వింటాల్స్ అదనంగా పెరిగి రూ. 30 వేల వరకు ఆదాయం కూడా పెరిగింది.

మూడేళ్లలోపే పంటల విస్తీర్ణం, పంటల దిగుబడి పెరిగి రైతుల ఆదాయం కూడా గణనీయంగా పెరగడానికి ప్రస్తుత ఏపీ ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాల వల్ల లభించే సహాయం సకాలంలో రైతులకు అందడమే కారణమని స్వయం సహాయక గ్రూపు సభ్యులు ముక్త కంఠంతో చెప్పారు. రైతుభరోసా కేంద్రాల్లో అవసరమైనంత పరిమాణంలో ఎరువులు, పురుగు మందులు మార్కెట్ రేట్ కంటే పది శాతం తక్కువ ధరకే లభించడంతో వ్యవసాయ దిగుబడుల్లో గణనీయంగా మార్పు వచ్చింది. వ్యవసాయ యంత్రాలు, ఇతర ఉపకరణాలను కూడా రైతు భరోసా కేంద్రాలు అద్దె ప్రాతిపదికన అందించడంతోపాటు వరి ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి సేకరించడంతో రైతుకు బహుళ ప్రయోజనాలు కలిగాయి.

మండలంలో అనేక కార్యక్రమాల ద్వారా కుటుంబ ఆదాయాలు గణనీయంగా పెరిగాయి. సున్నావడ్డీ కారణంగా ఒకటి నుంచి రెండులక్షల రూపాయల మేరకు రుణాలను తీసుకున్న మహిళా సభ్యులు పెద్దగా కష్టం లేకుండానే రుణ చెల్లింపులు చేస్తూవచ్చారు. దీంతో మహిళా స్వయం సహాయక గ్రూపులు తీసుకున్న బ్యాంక్ రుణాల్లో నిరర్థక రుణాల శాతం 0.5 శాతం మాత్రమే నమోదవడం విశేషం.

ఏపీలో ప్రభుత్వం ప్రారంభించిన అమ్మ ఒడి పథకం కారణంగా మహిళలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో పెద్దఎత్తున చేర్పించగలిగారు. ఇక 'విద్యా దీవెన', 'విద్యా వసతి' పథకాల ద్వారా ఆర్థిక ఇబ్బందులు లేకుండానే మహిళలు తమ పిల్లలను ఉన్నత విద్య చదవడానికి పంపించారు. పద్మనాభ మండలంలోని స్వయం సహాయక బృందంలోని 600 మంది సభ్యుల్లో వందమంది చేయూత పథకం కింద గొర్రెలు, మేకలు కొన్నారు. ఈ మండలం లోని 900 మంది మహిళా సభ్యులు 'జగనన్న తోడు' పథకం కింద తమ కూరగాయాలు, ఆకు కూరలను అమ్ముకోగలిగారు. దీంతో వడ్డీ చెల్లింపుల భారం తగ్గిపోయింది. 'తోపుడు బండి' పథకం కింద 300 మంది మహిళలు ఊరగాయలు తయారు చేసి అమ్మి లాభాలు సంపాదించారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాల కల్పన, చక్కటి వర్షపాతం కారణంగా పద్మనాభ మండలంలోని ప్రతి ఒక్క కుటుంబం తాము సంతోషంగా ఉంటున్నట్లు తెలిపారు. రెండు పంటలు పండటం, పంటల్లో వైవిధ్యత, ప్రత్యేకించి కూరగాయలు, ఆకుకూరల సేద్యం పెరగడం వల్ల రైతుల నికర ఆదాయం బాగా పెరిగింది. దీంతో లేబర్‌కి డిమాండ్ పెరిగి కూలీ రేట్లుకూడా పెరిగాయి. ఇవన్నీ చేరి రైతు కుటుంబాలు రుణ భారం నుంచి బయటపడ్డాయి. కుటుంబాలు తమ సొంత వనరులను ఏర్పర్చుకోవడంతో అప్పులు లేకుండా ఇళ్లు కట్టుకుంటున్నారు. ఇటుకల బట్టీలు, ఆటో ట్రాన్స్‌పోర్ట్ వంటి వ్యవసాయేతర ఉపాధి అవకాశాలను వీరు సృష్టించుకున్నారు. పిల్లలకు ఉచిత విద్య కారణంగా మహిళలు రాజకీయ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఏపీ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లను మహిళలకు కేటాయించినా, 65 శాతం పైగా సీట్లను మహిళలే కైవసం చేసుకోవడం ఇందుకు నిదర్శనం.

ప్రభుత్వ పథకాలు, బ్యాంకుల వితరణ కారణంగా కుటుంబాల్లో దారిద్ర్య స్థాయి గణనీయంగా తగ్గుముఖం పట్టింది. ప్రధానంగా నిరుపేదల్లో కెల్లా నిరుపేద కుటుంబాల్లో 90 శాతంపైగా దారిద్ర్య రేఖను అధిగమించేశారు. ప్రతి సంవత్సరమూ పెరుగుతున్న సంపాదన కారణంగా వీరు ఇప్పుడు దిగువ మధ్యతరగతి వర్గంలోకి చేరుకున్నారు. పోషకాహారం పట్ల శ్రద్ధ పెరగడం, నాణ్యమైన దుస్తులు ధరించడం, రోజువారీ దుస్తుల స్టయిల్ కూడా మారిపోవడం వంటి పలు కారణాలతో మహిళా బృంద సభ్యులు ఎలాంటి ఆకస్మిక పరిణామాలు, ఎదురుదెబ్బలనైనా తాము తట్టుకోగలమని ఆత్మవిశ్వాసంతో ఉండటం మరీ విశేషం. అంతిమంగా పేదల అనుకూల విధానాలను వైఎస్ జగన్ ప్రభుత్వం క్రియాశీలకంగా అమలు చేయడం వల్లే గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి గొప్ప మార్పు చోటు చేసుకుంటోందని చెప్పవచ్చు. సంక్షేమ పథకాల ద్వారా అట్టడుగు వర్గాలు, పేదల జీవితాల్లో సర్వతోముఖ అభివృద్ధి జరుగుతుండటమే దీనికి కారణమని నొక్కి చెప్పవచ్చు.

వ్యాసకర్త రిటైర్డ్ ప్రొఫెసర్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ప్రతికూల స్పందన



భయానకమైన ఢిల్లీ హత్య నిజానికి ఒక సంబంధంలో ఉన్న మహిళల్ని పురుషులు ఎలా దుర్వినియోగం చేస్తారన్న దాని మీద చర్చ మొదలుపెట్టాల్సింది! దానికి బదులుగా మనం చూస్తున్నవి ఫ్రిడ్జ్ జోకులు, సూట్‌కేసు జోకులు, అబ్దుల్ జోకులు, బాధితురాలిని నిందించడం. మనం ఎలాంటి సమాజంలో జీవిస్తున్నాం!

– కౌశిక్ రాజ్, పాత్రికేయుడు

మంచి వ్యవస్థ



ఇండియాలో మనం 130 కోట్ల మందిమి ఉన్నాం. యూఎస్ఏ జనాభాకు ఇది నాలుగింతలు. ఇందులో చాలా మారుమూల ప్రాంతాలు, భాషా అడ్డంకులు, భారీ భిన్నత్వం, ఎన్నో రాజకీయ పార్టీలు! అయినా ఎన్నికల ఫలితాలను మనం వెంటనే ప్రకటిస్తాం. ఫలితాలు చెప్పడానికి యూఎస్ఏ వారాలు తీసుకుంటుంది. పైగా అక్రమాలు. మన దగ్గర అత్యుత్తమ వ్యవస్థ ఉంది. యూఎస్ఏ మన ఎన్నికల సంఘం నుంచి నేర్చుకోవచ్చు.

– రిక్కీ కేజ్, మ్యూజిక్ కంపోజర్

ఉద్యోగాల కోసం...



ఫేస్‌బుక్ 11,000 మందికి లేఆఫ్ ఇస్తోంది. అమెజాన్ 10,000 మందికి లేఆఫ్ ఇస్తోంది. స్ట్రయిప్ ఇప్పటికే దాని వర్క్‌ఫోర్స్‌లో సగం అయిన 3,700 మందికి లేఆఫ్ ఇచ్చింది. షాపిఫై 1,000 మందికి, లిఫ్ట్ 700 మందికి లేఆఫ్ ఇచ్చింది. అందుకే టెక్ కార్మికులు సంఘటితం కావాల్సిన అవసరం ఉంది.

– రాబర్ట్ రీచ్, ప్రొఫెసర్

అంత ఖాళీ లేదు!



కళాశాల ఉత్సవాల్లో గాయకులకు డబ్బులు చెల్లిస్తారు. కానీ వేదికల మీద మాట్లాడే రచయితలకు మాత్రం ఏమీ ఇవ్వడానికి సిద్ధంగా ఉండకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఫలానా 'ఎక్స్' ఉచితంగా మాట్లాడుతున్నప్పుడు, మీరు కూడా మాట్లాడవచ్చు కదా అంటారు. సారీ!

– ప్రీతీ షెనాయ్, రచయిత్రి

ఇక్కడి వివక్షే కనిపిస్తుందా?

అభిప్రాయం



డా॥ పి. కృష్ణ మోహన్ రెడ్డి

కొంతమంది నియోదళిత్ మేధావులకు, వామపక్షీయులకు ప్రతి విషయాన్నీ కులం లేదా మత కోణంలో చూసే ధోరణి గత 30 సంవత్సరాలుగా అలవాటైంది. అకడమిక్స్‌లో కూడా ఈ ధోరణి రావడం ప్రమాదకరం. దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన కులాలు, ముస్లింలు, క్రిష్టియన్లు, అగ్రవర్ణాల వారు కూడా తమదైన వివక్షను ఎదుర్కొంటున్నారు. 130 కోట్ల జనాభాలో, దాదాపుగా 30 కోట్ల మంది దళితులు ఉన్న భారతదేశంలో... కేవలం కొన్ని సంఘటలను చూపించి రిపోర్టులు తయారు చేసి, దేశమంతా వివక్ష ఉందని చెప్పడం ఎంతమాత్రమూ శాస్త్రీయం కాదు.

అధర్మమైన విషయం ఏమిటంటే, ప్రపంచంలో చాలా దేశాల్లో దారుణమైన వివక్ష నేటికీ కొనసాగుతోంది. మన నియోదళిత్ మేధావులు వాటిని ఏమాత్రం ప్రస్తావించకుండా భారతదేశానికీ, హిందూమతానికీ వ్యతిరేకంగా పని చేసే కొన్ని సంస్థల రిపోర్టుల గురించి మాట్లాడుతుంటారు. రాజీవ్ మల్హోత్రా, అరవిందన్ నీలకంఠన్ రాసిన 'బ్రేకింగ్ ఇండియా – వెస్టర్న్ ఇంటర్వెన్షన్స్ ఇన్ ద్రవిడియన్ అండ్ దళిత్ ఫాల్ట్ లైన్స్' పుస్తకంలో ఇటువంటి విదేశీ సంస్థలూ, అస్తిత్వ అధ్యయన కేంద్రాలూ, ఎన్జీఓలూ వంటివి భారతదేశాన్ని, హిందూమతాన్ని విచ్ఛిన్నం చేయడానికి గత 30 ఏళ్లుగా చేస్తున్న ఒక బహిరంగమైన కుట్ర బట్టబయలైంది.

ఇక ప్రపంచంలోని వివక్షకు వస్తే, అమెరికాలో ఉన్న నల్లజాతీయులపై వివక్ష నేటికీ కొనసాగుతోంది. అయినా వారికి భారతదేశంలో దళితులలాగా రాజకీయాలు, విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు లేవు. దక్షిణాఫ్రికాలో నల్లజాతి వివక్ష (అపార్థైడ్) 1992 వరకు చట్టబద్ధంగా, రాజ్యాంగ బద్ధంగా జరిగింది. ఇప్పటికి కూడా దక్షిణాఫ్రికాలో వాళ్ళు రిజర్వేషన్లు కావాలని అడగలేదు. 1883 వరకు అమెరికాల్లో నల్లజాతీయులు బానిసలుగా ఉండేవాళ్ళు, 1970 వరకు అమెరికాలో నల్లజాతీయులకు ఓటు హక్కులేదు. యూఎస్‌తో సహా అనేక దేశాల్లో జాతి, మతపరమైన వివక్ష ఇప్పటికీ ఉంది.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, 1930లలో భారత్‌లో షెడ్యూల్డ్ కులాల వివక్ష మీద అంబేడ్కర్ పోరాటం చేస్తున్న సమయంలోనే అమెరికాలో కూడా వివక్ష మీద పోరాటం జరుగుతోంది. ప్రముఖ అమెరికన్ నల్లజాతీయుల నాయకులు చానీతో బియాస్, బెంజమిన్ మేస్ లాంటి వారు భారతదేశానికి వచ్చి గాంధీని కలిసి వివక్షతపై చర్చలు జరిపారు. 1938లో హోవర్డ్ తురిమెన్ అనే ప్రముఖ నల్ల మతాధికారి అమెరికాకు వచ్చి పోరాటం సాగించాలని గాంధీని కలిసి విన్నవించారు. ప్రముఖ నల్ల జాతి హక్కుల ఉద్యమకారుడు మార్టిన్ లూథర్ కింగ్... గాంధీజీనే ఆదర్శంగా తీసుకున్నారు. అలాగే దక్షిణాఫ్రికాలో అపార్థైడ్‌కు వ్యతిరేకంగా పోరాడిన నెల్సన్ మండేలా తదితరులు కూడా గాంధీనే ఆదర్శంగా తీసుకున్నారు.

ఇక్కడ నియో దళిత మేధావులు, వామపక్ష వాదులు దాచిపెట్టేదేమిటంటే... పైన పేర్కొన్న నాయకులు ఎవ్వరూ కూడా అంబేడ్కర్‌ను కలవలేదు. వీరెవ్వరు కూడా ఆయా దేశాల్లో రిజర్వేషన్లు కోరలేదు. ఎందుకంటే ఈక్వాలిటీ అనే యూనివర్సల్ ప్రిన్సిపుల్‌కు రిజర్వేషన్లు అనేవి బద్ధ వ్యతిరేకం కాబట్టి. దేశం 200 సంవత్సరాల బ్రిటిష్ పాలనలో కొన్ని శతాబ్దాల కాలం వెనుకబడింది. 1951 నాటికి అక్షరాస్యత కేవలం 16.7 శాతం. గ్రామీణ ప్రాంతాల్లో 9 శాతం, కాబట్టి కేవలం దళితులే కాదు అన్ని కులాల వాళ్ళు, మతాల వాళ్ళు వెనకబడే ఉన్నారు. దళితుల పరిస్థితి ఇంకా దయనీయమనే చెప్పాలి. అయితే ల్యాండ్ సీలింగ్ వల్ల వచ్చిన భూమిలో 46 శాతం దళితులకే వచ్చింది. అయినా ఇంకా అభివృద్ధి జరగాల్సి ఉంది.

వ్యాసకర్త అసోసియేట్ ప్రొఫెసర్, చరిత్ర విభాగం
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం

నిరసనకారులకు గుణపాఠమా?!



మల్లెపల్లి లక్ష్మయ్య

హిజాబ్ వ్యతిరేక ఉద్యమంలో అరెస్టయిన అందరికీ 'నిర్ణయాత్మక' శిక్ష విధించి, తగిన గుణపాఠం నేర్పాలని ఇరాన్ పార్లమెంటు తీర్మానించింది. 290 మంది సభ్యులున్న ఇరాన్ పార్లమెంటులో 227 మంది ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశారు. ఇరాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి మసూద్ సెతాయ్‌షి నవంబర్ 6వ తేదీన పార్లమెంటు సమావేశమై ఈ నిర్ణయానికి వచ్చినట్టు తెలియ జేశారు. ఈ అల్లర్లలో ఇప్పటివరకు 15 వేల మంది అరెస్ట య్యారు. నిర్ణయాత్మక శిక్ష అంటే మరణ శిక్షా అనేది ఆందోళన కలిగిస్తున్న విషయం. ఈ తీర్మానాన్ని ఐక్యరాజ్య సమితి నియమించిన 16 మంది మానవ హక్కుల ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. ఉద్యమాలను అణచివేయాలనే లక్ష్యంతో ఇరాన్ ప్రభుత్వం విధించిన శిక్షను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఇప్పటికే... అంటే అక్టోబర్ 29న తెహరాన్ రాష్ట్ర పరిధిలోని ఇస్లామిక్ రివల్యూషన్ కోర్టు ఈ ఉద్యమంలో పాల్గొన్న 8 మందికి మరణశిక్షను విధించింది. ఇరాన్ చట్టం ప్రకారం 'దేవుడికి వ్యతిరేకంగా యుద్ధం' అనే నిబంధన ప్రకారం ఈ శిక్షలు విధిస్తారు. అదేవిధంగా అదే కోర్టు ప్రాసిక్యూటర్ మరో వేయిమంది పేర్లను ఈ కేసులో చేర్చారు. దీని తర్వాతనే ఇరాన్ పార్లమెంటు అన్ని కోర్టులకు ఇదే విధమైన కఠిన చర్యలను తీసుకోవాలని తీర్మానించింది. ఒక ఉద్యమంలో పాల్గొన్నందుకు మూకుమ్మడిగా '15 వేల మందికి' పైగా కార్యకర్తలకు 'నిర్ణయాత్మక' శిక్ష విధించాలని ఒక ప్రజాప్రతినిధుల సభ తీర్మానం చేయడం ప్రపంచ చరిత్రలోనే చాలా దుర్మార్గమైన చర్య.

ఇరాన్‌లో మహిళలు హిజాబ్ ధరించకపోవడం చట్టరీత్యా నేరం. ఎవరైనా ఇరాన్ పీనల్ కోడ్‌లోని ఆర్టికల్ 638లో పేర్కొన్నదాని ప్రకారం హిజాబ్‌ను ఉల్లంఘిస్తే, పదిరోజుల నుంచి రెండు నెలల వరకు జైలు శిక్షను అనుభవించాలి. 55,500 రూపాయల జరిమానాను చెల్లించాలి. ఇంకా అవసరమైతే 74 కొరడా దెబ్బల శిక్షను కూడా అమలు చేస్తారు. హిజాబ్‌ను సక్రమంగా పాటిస్తున్నారా లేదా అని పర్యవేక్షించడానికి 'మొరాలిటీ పోలీసు' ప్రత్యేక విభాగమే ఉంటుంది. ఈ క్రమంలోనే సెప్టెంబర్ 13న 22 ఏళ్ళ కుర్దిష్–ఇరానియన్ యువతి మహసా అమీని హిజాబ్‌ను సక్రమంగా ధరించలేదని అరెస్టు చేశారు. అప్పుడు ఆమె తెహరాన్ నగరాన్ని చూడటానికి కుటుంబ సమేతంగా వచ్చింది. అమీనీని పోలీసులు వ్యాన్‌లో ఎక్కించుకొని, తీసుకెళ్ళారు. అదే వాహనంలో ఆమెను కొట్టి, తీవ్రంగా హింసించినట్టు ఆమె సోదరుడు చెప్పారు. ముఖం ఉబ్బిపోయి, కాళ్ళు చేతులు నల్లగా మారిపోయిన స్థితిలో కుటుంబ సభ్యులకు అప్పజెప్పితే, వాళ్ళు హాస్పిటల్‌లో చేర్చారు. మూడు రోజుల తర్వాత మహసా అమీని మరణించింది. ప్రభుత్వం మాత్రం ఆమె గుండెనొప్పితో బాధపడితే కుటుంబానికి అప్పజెప్పామని ప్రకటించింది.

కొత్త కోణం



ఈ దారుణానికి నిరసనగా, వేలమంది వీధుల్లోకి వచ్చి 'మహిళ–జీవితం–స్వేచ్ఛ' అంటూ యావత్ ప్రపంచమే కదలిపోయే మహిళా ప్రభంజనానికి ఊపిరిలూదారు. పోలీసులు, భద్రతా బలగాలు తమ నిర్బంధ కాండతో ఉద్యమాన్ని అణచివేయాలని చూశాయి. నిరసన ఆరంభమైన వారం రోజులకే అంటే సెప్టెంబర్ 20న పదహారేళ్ల నికా శకరామీని అపహరించి, చంపేశారు. సెప్టెంబర్ 21న 22 ఏళ్ళ హదీస్ నజఫీ కూడా భద్రతా బలగాల చేతిలో బలైపోయింది. ఈ రెండు ఘటనలూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేశాయి. ఈ ఉద్యమంలో ఇప్పటివరకూ 326 మందిని ఇరాన్ భద్రతా దళాలు కాల్చి చంపినట్టు ఇరాన్ మానవ హక్కుల సంస్థ ప్రకటించింది. మగవారు, ప్రత్యేకించి కాలేజీ, యూనివర్సిటీ విద్యార్థులు మహిళలకు మద్దతుగా ఉద్యమంలో పాల్గొంటున్నారు. ఇది కేవలం హిజాబ్‌కు వ్యతిరేక ఉద్యమం మాత్రమే కాదు, అయాతుల్లాహ్ ఖొమైనీ నాయకత్వంలోని ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్బంధ విధానాల పట్ల నిరసన కూడా.

ఇరాన్‌లోనే కాదు, చాలా దేశాల్లో ప్రభుత్వాలు ప్రజల జీవితాల్లోకి చొరబడి దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నాయి. మన దేశంలో కొన్ని చోట్ల ఇటీవల హిజాబ్ ధరించిన ముస్లిం యువతులను వేధించే సంఘటనలు జరిగాయి. ఇరాన్‌లో బలవంతంగా హిజాబ్‌ను అమలు చేయడం, భారత్‌లో తమ ఇష్టాలకు భిన్నంగా హిజాబ్‌ను తొలగించాలని చూడడం రెండూ తప్పే. ప్రజలు తినే తిండి మీద, ధరించే దుస్తుల మీద, భాష మీద, అలవాట్ల మీద ఆంక్షలు విధించడం వాంఛనీయం కాదు. ఇరాన్ పార్లమెంటు చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకునేలా, అంతిమంగా మానవ హక్కులను పరిరక్షించేలా ప్రపంచ ప్రజలంతా ఇరాన్ మహిళలకు అండగా నిలబడాలి.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । 81063 22077

శ్రీవారి సేవలో కేంద్ర మంత్రి షెకావత్



కేంద్ర మంత్రి షెకావత్‌కు శ్రీవారి ప్రసాదాలు అందిస్తున్న టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి

తిరుమల: కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు టీటీడీ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. షెకావత్‌కు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని, డైరీ, క్యాలెండర్‌ను అందజేశారు. రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు, ఎంపీలు మిథున్ రెడ్డి, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే, మండలిలో ప్రభుత్వ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఏపీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, సినీ గాయని మంగ్లీ కూడా స్వామి వారిని దర్శించుకున్నారు.

సర్వ దర్శనానికి 30 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. 30 క్యూ కంపార్ట్‌మెంట్లు నిండాయి. సర్వ దర్శన టోకెన్లు లేనివారికి 30 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటలు పడుతోంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 71,461 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 26,631 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.4.77 కోట్లు సమర్పించారు.

విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా వేర్వేరు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. సికింద్రాబాద్–తిరుపతి (02764) ఈ నెల 19న రాత్రి 8.05 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 9 గంటలకు తిరుపతి చేరుతుంది. తిరుపతి–శ్రీకాకుళం (07451) ఈ నెల 20న రాత్రి 8.10 గంటలకు తిరుపతిలో బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు శ్రీకాకుళం చేరుకుంటుంది. శ్రీకాకుళం–తిరుపతి (07452) ఈ నెల 21న మధ్యాహ్నం 3 గంటలకు శ్రీకాకుళంలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 8 గంటలకు తిరుపతి చేరుతుంది. తిరుపతి–సికింద్రాబాద్ (07455) ఈ నెల 22న రాత్రి 8.05 గంటలకు తిరుపతిలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 9.45 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

టమాటా రైతుకు బాసట

- నిలకడగా ధరలు ఉండేలా చర్యలు
- మార్కెట్‌లో జోక్యం చేసుకొని టమాటా కొనుగోలు
- రైతులకు కిలో రూ.5 నుంచి రూ.10 గిట్టుబాటు

ఓ వైపు కొనుగోలు.. మరోవైపు విక్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక



కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్ యార్డులో రైతుల నుంచి టమాటాలు కొనుగోలు చేస్తున్న మార్కెటింగ్ శాఖ సిబ్బంది

సాక్షి, అమరావతి: ధర లేని ప్రతిసారి టమాటా రైతును ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోంది. నాణ్యమైన టమాటాలనే కాదు, కాస్త వినియోగానికి పనికొచ్చేలా ఉన్న టమాటాలను మార్కెట్‌లో జోక్యం చేసుకొని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి వారికి బాసటగా నిలుస్తోంది. ఇప్పటికే కర్నూలు, అన్నమయ్య జిల్లాల్లోని పలు మార్కెట్ యార్డుల నుంచి 220 క్వింటాళ్ల టమాటాలను కొనుగోలు చేసి రైతుబజార్ల ద్వారా వినియోగదారులకు విక్రయించింది. ఇదే రీతిలో మిగిలిన మార్కెట్ యార్డుల్లో కూడా ఎక్కడైనా ధర రావడం లేదు, కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదంటూ ఆర్బీకేకు సమాచారం ఇస్తే చాలు యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. గత కొద్ది రోజులుగా రాష్ట్రమంతటా ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండటంతో తెగుళ్లు సోకి టమాటా పంట చాలా చోట్ల దెబ్బ తిన్నది. తమిళనాడు, తెలంగాణ, ఉత్తరాఖండ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో వర్షాలు పడుతుండటంతో ఎగుమతులకు ప్రతిబంధకంగా మారింది. ఈ పరిస్థితుల్లో ధరలను నిలకడగా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

వినియోగదారులపై భారం పడకుండా..

కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్ యార్డు పరిధిలో రైతుల నుంచి 150 క్వింటాళ్లు, అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మార్కెట్ యార్డు పరిధిలోని రైతుల నుంచి 70 క్వింటాళ్లు టమోటాలు నాణ్యతను బట్టి కిలో రూ.5 నుంచి రూ.12 చొప్పున మార్కెట్‌శాఖ ద్వారా కొనుగోలు చేసింది. వీటిని స్థానిక రైతుబజార్లలో విక్రయిస్తోంది. టమాటా సాగు ఎక్కువగా ఉండే అన్నమయ్య, శ్రీసత్యసాయి, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లోని ప్రధాన టమాటా యార్డుల పరిధిలో రేటు దక్కని రైతుల నుంచి టమాటా కొనుగోలుకు ఏర్పాట్లు చేసింది. వర్షాలు, తెగుళ్ల వల్ల దెబ్బతిన్న టమాటా రైతులను ఆదుకుంటూ వినియోగదారులపై భారం పడకుండా సరసమైన ధరలకే రైతు బజారుల ద్వారా విక్రయిస్తోంది.

ప్రభుత్వ జోక్యంతో పెరిగిన ధర..

సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు మార్కెట్‌లో జోక్యం చేసుకుంటూ వ్యాపారులతో కలిసి పోటీపడి ధర పెంచేలా మార్కెటింగ్ శాఖ కృషి చేస్తోంది. ఫలితంగా ఏపీలో ఏ ఒక్క మార్కెట్ యార్డులోనూ టమాటా కిలో రూ.5కు తక్కువగా పలకడం లేదు. నాణ్యతను బట్టి ఫస్ట్ క్వాలిటీ రకం గరిష్ఠంగా రూ.9 నుంచి రూ.13, కనిష్ఠంగా రూ.5 నుంచి 10 వరకు పలుకుతోంది. ఇక మధ్యస్థంగా ఉండే టమాటాలకు రూ.7 నుంచి రూ.11 వరకు ధర పలుకుతోంది.

ప్రధాన టమాటా మార్కెట్లలో కిలో ధర (రూ.)

జిల్లా	మార్కెట్ యార్డు	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర	మోడల్ ధర
అన్నమయ్య	కలికిరి	7	13	10
	వాల్మీకిపురం	9	11	7
	ములకలచెరువు	5	10	7
	మదనపల్లి (ఫస్ట్ క్వాలిటీ)	9	12	11
	(సెకండ్ క్వాలిటీ)	6	9	8
చిత్తూరు	పలమనేరు	5	11	7
	పుంగనూరు	10	12	11
కర్నూలు	పత్తికొండ (ఫస్ట్ క్వాలిటీ)	6	12	8
	(సెకండ్ క్వాలిటీ)	5	10	7

ప్రభుత్వం ఆదుకుంటోంది



నేను 3 ఎకరాల్లో టమాటా సాగు చేస్తున్నాను. 20 రోజుల నుంచి మార్కెట్‌లో రేటు తగ్గిపోయింది. ప్రభుత్వం జోక్యం చేసుకుని మార్కెటింగ్ శాఖ ద్వారా టమాటాలను కొనుగోలు చేస్తోంది. కిలో రూ.5 నుంచి రూ.10 వరకు పెట్టి కొనుగోలు చేస్తోంది. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– బద్దునాయక్, గుండుతాండ, కర్నూలు జిల్లా

రైతులు ఆందోళన చెందవద్దు



టమాటా రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. వినియోగానికి పనికి వచ్చే టమాటాలను కొనుగోలు చేస్తాం. క్షేత్రస్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. మార్కెట్‌లో వ్యాపారాలు కొనుగోలు చేయకపోతే సమాచారమివ్వండి. పొలం వద్ద గ్రేడింగ్ చేసి తీసుకొస్తే మంచి ధర లభించేలా కృషి చేస్తాం. నాణ్యతను బట్టి రాష్ట్రంలో ఎక్కడా కిలో రూ.5 కు తక్కువగా కొనుగోలు చేసే పరిస్థితి లేదు.

– ముల్లంగి నందకిషోర్, సీఈవో, రైతు బజార్స్

టీడీపీ నేత దాష్టీకం

- తల్లీ, బిడ్డల గృహనిర్బంధం
- పోలీస్ కంట్రోల్ రూంను ఆశ్రయించిన బాధితులు
- ఏడేళ్ల బిడ్డతో పాటు మహిళను విడిపించిన పోలీసులు



చంద్రబాబుతో నిందితుడు ప్రకాష్ (ఫైల్)

కుప్పం: చీటీ డబ్బులు సకాలంలో చెల్లించలేదనే కారణంతో ఏడేళ్ల బిడ్డతో సహా తల్లిని గృహనిర్బంధం చేసిన ఓ టీడీపీనేత నిర్వాకం వెలుగుచూసింది. శాంతిపురం మండలంలోని ఎం.కె.పురం పంచాయతీ కృష్ణాపురంలో మంగళవారం రాత్రి ఈ దారుణం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కృష్ణాపురానికి చెందిన టీడీపీ బూత్ కమిటీ నాయకుడు ప్రకాష్ గ్రామంలో చీటీలు నడుపుతున్నాడు. అదే గ్రామానికి చెందిన పాండురంగ ఇతని వద్ద చీటీ వేసి పాడుకున్నాడు. ఇందుకు సంబంధించిన డబ్బులు సకాలంలో ఇవ్వలేదని మంగళవారం రాత్రి పాండురంగ ఇంటి వద్దకు వెళ్లిన ప్రకాష్ గొడవకు దిగాడు. అయ్యప్ప స్వామి దీక్షలో ఉన్న పాండురంగ గుడిలో ఉన్నాడని భార్య భవాని (26) చెప్పినా వినిపించుకోకుండా వీధిలో నిలబడి నానా బూతులు తిట్టాడు. భవాని, తన కూతురు చిద్విలాసిని (7) వెంటనే ఇల్లు విడిచిపోవాలని హుకుం జారీ చేశాడు. ఎలాగోలా అప్పు తీర్చేస్తామని ఆమె వేడుకున్నా కనికరించకుండా తల్లీబిడ్డలు ఇంట్లో ఉండగానే ఇంటి బయట తాళం వేసుకుని వెళ్లిపోయాడు. దిక్కుతోచని స్థితిలో బాధితులు పోలీస్ కంట్రోల్ రూంకు సమాచారం ఇచ్చారు. రాళ్లబూదుగూరు పోలీసులు తాళాలు తెరిపించి తల్లీబిడ్డలకు గృహనిర్బంధం నుంచి విముక్తి కలిగించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ మునిస్వామి తెలిపారు.

మోసం చేసి స్టేలు తెచ్చుకుంటున్నారు..

780వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన నాయకులు



రిలే నిరాహార దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: అమరావతి పేరుతో నకిలీ ఉద్యమం చేస్తున్న కులవాదులు రాష్ట్ర ప్రజలను, కోర్టులను మోసం చేస్తూ స్టేలు తెచ్చుకుని తిరుగుతున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్‌యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 780వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న ఇళ్ల స్థలాలు, ఇంగ్లిష్ మీడియం విద్య, మూడు రాజధానుల ద్వారా సమానాభివృద్ధిని అందకుండా కులవాదులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ప్రతి చిన్న విషయానికి కోర్టులను ఆశ్రయించి కుల ఉగ్రవాదులు పేదల హక్కులకు భంగం కలిగిస్తున్నారని మండిపడ్డారు. అమరావతి పేరుతో దొంగ ఉద్యమం చేస్తున్న కులవాదులు ప్రజల మద్దతు లేక కోర్టు ఆదేశాలతో అర్థాంతరంగా నిలిపివేసి పారిపోయారని ఎద్దేవా చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా బాబు అండ్ కో రాష్ట్రంలో ప్రాంతాలు, ప్రజల మధ్య చిచ్చుపెట్టేలా వ్యవహరిస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, పులి దాసు, ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాడి అరెస్ట్

- నిందితుడిపై 14 రాష్ట్రాల్లో కేసులు
- 7 బ్యాంక్ అకౌంట్లలోని రూ.2.05 కోట్లు ఫ్రీజ్



వివరాలు తెలియజేస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: అంతర్రాష్ట్ర సైబర్ నేరగాడు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఖుషినగర్‌కు చెందిన ఎంఓ జలాల్‌ఖాన్‌ను వైఎస్సార్ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. అతనితో పాటు మరికొందరి బ్యాంక్ అకౌంట్లను సీజ్ చేసి రూ.2.05 కోట్ల నగదును ఫ్రీజ్ చేశారు. కడప నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద వున్న 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో బుధవారం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వివరాలు వెల్లడించారు. జలాల్‌ఖాన్, అతడి స్నేహితులు తన్వీర్ ఆలం, ఇపజిడ్ కలిసి ఓ ముఠాగా ఏర్పడ్డారు. వివిధ మార్గాల ద్వారా సేకరించిన నంబర్లకు ట్రూకాలర్ ద్వారా ఫోన్ చేస్తూ డబ్బు కోసం వేధించడం మొదలెడతారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ జిల్లా బద్వేల్ టౌన్ సుమిత్రానగర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి అల్లూరి మోహన్ నంబరుకు ఫోన్ చేశారు. వాట్సాప్ ద్వారా లోన్ తీసుకున్నావని, తాము చెప్పిన మొత్తం చెల్లించకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బెదిరించసాగారు. తాను లోన్ తీసుకోలేదని చెప్పినా పదే పదే బెదిరింపు కాల్స్ చేసేవారు. బాధితుడి ఫొటోలు మార్ఫింగ్ చేసి న్యూడ్‌గా కుటుంబ సభ్యులకు పంపించారు. వారికి భయపడిన మోహన్ పలు దఫాలుగా సుమారు రూ.లక్ష అరవై వేలు పంపాడు. ఇక తాను ఇవ్వలేనని చెప్పినా వేధింపులు మానకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. బద్వేల్ పోలీసులు అక్టోబర్ 14న కేసు నమోదు చేశారు. ఈ కేసును జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని కడప అదనపు ఎస్పీ తుషార్ డూడీ, మైదుకూరు డీఎస్పీ వంశీధర్ గౌడ్‌ల పర్యవేక్షణలో బద్వేల్ అర్బన్ సీఐ జి.వెంకటేశ్వర్లు, కడప సైబర్‌క్రైం సీఐ శ్రీధర్‌నాయుడు ఆధ్వర్యంలో రెండు టీములు ఏర్పాటు చేశారు. బాధితుడు డబ్బు చెల్లించిన యూపీఐ ఐడీలను సేకరించి, వాటి ద్వారా నిందితులు ఉపయోగించిన అకౌంట్ వివరాలను సేకరించారు. వాటి ద్వారా కేసు విచారణలో లోన్ యాప్‌ల ద్వారా మోసం చేస్తున్న ప్రధాన నిందితుడు ఎంఓ జలాల్‌ఖాన్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద రెండు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారు. కాగా.. ప్రస్తుతం అరెస్టయిన నిందితుడు జలాల్‌ఖాన్, అతని స్నేహితులపై 14 రాష్ట్రాల్లో 58 ఎన్‌సీఆర్‌పీ (నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్) ఫిర్యాదులున్నాయి. వీరికి ఉన్న 7 బ్యాంక్ అకౌంట్లను సీజ్ చేసి రూ.2.05 కోట్లు ఫ్రీజ్ చేయించారు. ఈ వివరాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఐటీ విభాగాలకు పంపిస్తామని ఎస్పీ వివరించారు.

బాణాలతో దాడి.. వ్యక్తికి గాయాలు

- ఇద్దరి మధ్య ఘర్షణకు దారి తీసిన పెంపుడు కుక్కల కొట్లాట
- ఛాతీలో బాణం గుచ్చుకుని వ్యక్తి ఆస్పత్రిపాలు
- నంద్యాల జిల్లాలో ఘటన



బాణం దిగి గాయపడ్డ నాగరాజు

ఆత్మకూరు: రెండు పెంపుడు కుక్కల మధ్య కొట్లాట ఇద్దరి మధ్య ఘర్షణకు దారి తీసింది. ఒకరిపై ఒకరు విల్లంబులతో దాడికి దిగడంతో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. ఓ కుక్క చనిపోయింది. నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలంలోని నాగలూటి చెంచుగూడెంలో ఈ ఘటన జరిగింది. నాగలూటి చెంచుగూడెంలో నాగరాజు, తోట ఆంజనేయులు కుక్కలను పెంచుకుంటున్నారు. బుధవారం ఆంజనేయులుకు చెందిన కుక్క నాగరాజుకు చెందిన కుక్కను కరిచింది. నాగరాజు ఆగ్రహంతో విల్లంబులు పట్టుకొని ఆంజనేయులు ఇంటికి వెళ్లి వాదనకు దిగాడు. అదే సమయంలో ఆ కుక్క అక్కడికి రావడంతో బాణాలు వేసి దానిని చంపేశాడు. కళ్లెదుటే పెంపుడు కుక్క చనిపోవడంతో అంజనేయులు కోపంతో నాగరాజుపై బాణం ఎక్కుపెట్టి వదిలాడు. అది నాగరాజు ఛాతీలో దిగడంతో కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు అతన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. దాసరి నాగరాజు, తోట ఆంజనేయులు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.



బాణాలతో దాడి చేయడంతో చనిపోయిన కుక్క

వివాహితల హక్కులపై పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): మార్పు ట్రస్ట్ ద్వారా సంకలనం చేసిన 'వివాహిత స్త్రీల హక్కులు–హక్కుల కోసం పోరాడుతున్నప్పుడు చేయవలసినవి, చేయకూడనివి' హ్యాండ్‌బుక్‌ను బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైవాహిక జీవితంలో కష్టాల్లో ఉన్న మహిళలు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా, ఆర్.సూయజ్, అనుపమ దార్ల, ఆర్.సాదిక్, మిషా గోరా పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లాలో కంపించిన భూమి



వీధుల్లోకి వచ్చిన జనం

పలమనేరు: చిత్తూరు జిల్లా గంగవరం మండలం కీలపట్ల పరిసర ప్రాంతాల్లో భూమి కంపించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ప్రాంతంలో బుధవారం సాయంత్రం స్వల్పంగా భూమి కంపించడంతో ఇళ్లలోని జనం వీధుల్లోకి వచ్చేశారు. కీలపట్ల, బండమీదజరావారిపల్లి, నలసానపల్లి, గాంధీనగర్ అటవీ ప్రాంతంలో భూమి కంపించినట్లు స్థానికులు చెప్పారు. ఇదే గ్రామంలో మంగళవారం రాత్రి భూమి కంపించిన విషయం తెలిసిందే.

మల్లేపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురు మృత్యువాత.. మరో ఏడుగురికి గాయాలు
- ట్రాలీని ఢీకొట్టిన టాటా మేజిక్
- కాకినాడ జిల్లాలో ఘటన



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన టాటా మేజిక్‌ముందు భాగం

గోకవరం/గండేపల్లి: అతివేగం, నిర్లక్ష్యం నాలుగు నిండుప్రాణాలను బలితీసుకున్నది. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామ శివారు జీడిపిక్కల ఫ్యాక్టరీ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు మృత్యువాత పడగా, ఏడుగురు గాయాలపాలయ్యారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం, ఉండ్రాజవరం, ఏలూరు జిల్లా ఉంగుటూరు తదితర గ్రామాల నుంచి సుమారు 13 మంది అనకాపల్లి జిల్లా కశింకోటలో పరమటమ్మతల్లి జాతరలో ప్రదర్శన ఇచ్చేందుకు టాటా మ్యాజిక్ వాహనంలో బయలు దేరారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు గండేపల్లి మండలం మల్లేపల్లి వచ్చే సరికి హైదరాబాద్ నుంచి వస్తున్న భారీ ట్రాలీని అతి వేగంతో వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉంగుటూరు మండలం నారాయణపురానికి చెందిన దుబ్బాకుల ప్రసాద్ (47) అక్కడికక్కడే మృతి చెందాడు. నల్లజర్లకు చెందిన డ్రైవర్ నల్లకాసుల వెంకట్రావు (కొండ) (28), నల్లజర్ల మండలం నబీపట గ్రామానికి చెందిన పెనుపాక గుబ్బల మంగమ్మ (30) ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందగా, ఉండ్రాజవరం మండలం చివటంకు చెందిన గారపాటి మహేష్ (20), రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని బుధవారం పెద్దాపురం డీఎస్పీ సుంకర మురళీమోహన్ పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ వాహనం డ్రైవర్ అతివేగంగా నడపడం వలనే ప్రమాదం జరిగిందన్నారు. కాగా, టాటా మేజిక్ వాహనం ట్రాలీని ఢీకొట్టి డ్రైవర్‌తో సహా ఇరుక్కుపోగా.. సుమారు అరగంట పాటు శ్రమించి బయటకు తీశారు. టాటా మేజిక్ డ్రైవర్ కుడికాలు దాదాపు తెగిపోయింది. క్షతగాత్రులు రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

తెరుచుకున్న శబరిమలై ఆలయం

కరోనా ఆంక్షల్లేకపోవడంతో ఈసారి భక్తులు రెట్టింపవుతారని అంచనాలు



పత్తనంతిట్ట: అయ్యప్ప భక్తుల కోసం కేరళలోని శబరిమల ఆలయ ద్వారాలు తెరుచుకున్నాయి. మాలధారుల సందర్శనార్థం బుధవారం సాయంత్రం ఆలయాన్ని తెరిచారు. కరోనా నిబంధనలేవీ లేకపోవడంతో ఈ ఏడాది భక్తులు సంఖ్య 40 నుంచి 50 శాతం పెరగవచ్చునని అంచనాలున్నాయి. గత రెండేళ్లుగా కరోనా భయాలు ఉండడంతో రోజుకి 30 వేల మంది భక్తులకి మాత్రమే దర్శనానికి అనుమతినిచ్చారు. ఈ ఏడాది అలాంటి ఆంక్షలేవీ లేవని కేరళ దేవాదాయ శాఖ మంత్రి కె. రాధాకృష్ణన్ తెలిపారు.భక్తుల సంఖ్య రెట్టింపు అవుతుందని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. బుధవారం సాయంత్రమే 30 వేల మంది భక్తులు అయ్యప్పను దర్శించుకున్నారు.

ఆక్సిజన్ అంతమైన వేళ...




టొరంటో: దాదాపు 50 కోట్ల ఏళ్ల క్రితం. భూమిపై ఆక్సిజన్ ఉన్నట్టుండి ఎవరో పీల్చేసినట్టుగా సంపూర్ణంగా ఆవిరైపోయింది. దాంతో చాలా జీవరాశులూ ఉన్నపళంగా కళ్లు తేలేశాయి. ఉనికినే కోల్పోయాయి. భూగోళంపై తొలి జీవ వినాశనం జరిగిన తీరు ఇదేనని శాస్త్రవేత్తలు తాజాగా కనిపెట్టారు. భూమిపై తొలి జీవ వినాశనం జరిగిన తీరును అర్థం చేసుకునేందుకు, ఫలితంగా పూర్తిగా నశించిపోయిన జీవరాశులు ఎలా ఉండేవో తెలుసుకునేందుకు పరిశోధకులు శిలాజ ముద్రలను అధ్యయనం చేశారు. ఆ వినాశనమే చాలా జంతు జాతులు ఇప్పుడున్న రూపాల్లో వికసించేందుకు పురిగొల్పి ఉంటుందని వారు భావిస్తున్నారు.

ఆక్సిజన్ ఏమైపోయింది?

ఇందుకు ఫలానా సంఘటనే కారణమని కచ్చితంగా చెప్పలేకపోయినా, అది అప్పట్లో జరిగిన అనేకానేక పరిణామాల ఫలస్వరూపం అయ్యుండొచ్చన్నది పరిశోధక బృందం అభిప్రాయం. ''అగ్ని పర్వతాల పేలుడు, భూ ఫలకాల్లో భారీ కదలికలు, గ్రహశకలాలు ఢీకొనడం వంటివాటి వల్ల భూమిపై ఆక్సిజన్ బాగా తగ్గిపోవడమో, లుప్తం కావడమో జరిగి ఉంటుంది'' అని అధ్యయనానికి సారథ్యం వహించిన వర్జీనియా టెక్ కాలేజ్ ఆఫ్ సైన్స్‌కు చెందిన పరిశోధకుడు స్కాట్ ఇవాన్స్ అభిప్రాయపడ్డారు. ''గ్లోబల్ వార్మింగ్ వంటివి ఆక్సిజన్ స్థాయిలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇదిలాగే కొనసాగితే మరో సామూహిక జీవ హననం దగ్గర్లోనే ఉంది'' అని హెచ్చరించారు.

అతిపెద్ద ఐస్‌బర్గ్ అంతర్ధానం!



వాషింగ్టన్: భూతాపానికి ఫలితం ఈ ఉదాహరణ. అంటార్కిటికాలోని అట్లాంటిక్ తీరప్రాంతంలో ఉన్న రొన్నే మంచు పలక నుంచి విడివడిన ఒక భారీ ఐస్‌బర్గ్ త్వరలోనే కనుమరుగు కానుంది. దీనిని ప్రపంచంలోనే అతిపెద్దదిగా భావిస్తున్నారు. ఈ ఐస్‌బర్గ్ 2021 మేలో విడిపోయాక మరో మూడు ముక్కలైంది. అమెరికాకు చెందిన టెర్రా ఉపగ్రహం ఈ ఐస్‌బర్గ్‌లోని అతిపెద్ద భాగం ఫొటో తీసింది. దాదాపు 2 వేల కిలోమీటర్ల దూరం పయనించిన ఈ ఐస్‌బర్గ్ భారీ శకలం ప్రస్తుతం దక్షిణ అమెరికా ఖండంలోని కేప్ హార్న్‌కు, అంటార్కిటికాలోని దక్షిణ షెట్లాండ్ దీవులు, ఎలిఫెంట్ దీవులకు మధ్యలోని డ్రేక్ పాసేజీలో ఉంది. ఎ-76ఎ గా పిలుస్తున్న దీని పొడవు 135 కిలోమీటర్లు కాగా వెడల్పు 26 కిలోమీటర్లు.. లండన్ నగరానికి ఇది రెట్టింపు సైజు అని అమెరికా నేషనల్ ఐస్ సెంటర్ వెల్లడించింది. ఇప్పటి వరకు ఇది తన ఆకారాన్ని కోల్పోలేదని శాస్త్రవేత్తలు తెలిపారు. అయితే, భూమధ్య రేఖ వైపు పయనించి అక్కడి సముద్ర జలాల వేడికి త్వరలోనే అంతర్ధానం కానుందని అంటున్నారు. ఐస్‌బర్గ్‌లను సర్వసాధారణంగా బలమైన ఆర్కిటిక్ ప్రవాహాలు డ్రేక్ పాసేజ్ గుండా ముందుకు తోసేస్తాయి. అక్కడి నుంచి అవి ఉత్తర దిశగా భూమధ్య రేఖ వైపు పయనించి వేగంగా కరిగిపోతుంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఇది యుద్ధాల శకం కాదు

ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని రష్యా తక్షణమే ఆపేయాలి

- జీ 20 సదస్సు నోట మోదీ మాట
- సంయుక్త ప్రకటన విడుదల
- ముగిసిన రెండు రోజుల శిఖరాగ్రం



మడ చెట్ల విత్తనకేంద్రంలో పొలం పని చేస్తున్న బైడెన్, మోదీ ఇతర అగ్రనేతలు

బాలి: ఉక్రెయిన్‌పై యుద్ధానికి రష్యా తక్షణమే ముగింపు పలకాలని జీ-20 సదస్సు నాయకులు పిలుపునిచ్చారు. ఇది యుద్ధాలు చేసుకునే శకం కాదని నినదించారు. ఉజ్బెకిస్తాన్‌లో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సులో భాగంగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పిన మాటలే జీ-20 సదస్సులో కూడా ప్రతిధ్వనించాయి. ఇది యుద్ధాల శకం కాదంటూ నాడు పుతిన్‌తో మోదీ చెప్పిన హితవచనాలనే జీ-20 సదస్సు ముగింపు రోజు బుధవారం సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఇండోనేషియాలోని బాలిలో జరిగిన రెండు రోజుల సదస్సులో ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర, ప్రపంచ దేశాలపై దాని ప్రభావంపైనే ఎక్కువగా చర్చ జరిగింది. ''శాంతి స్థాపన, కాల్పుల విరమణ, ఉద్రిక్తతల నివారణకే జీ-20 దేశాలు పిలుపునిస్తున్నాయి. ఉక్రెయిన్‌లో అరాచకాలకు, యుద్ధానికి తెరపడాలి. ఈ యుద్ధం ఇంకా కొనసాగితే ఆహార, ఇంధన భద్రతలపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుంది'' అని ఆ డిక్లరేషన్ పేర్కొంది. ''ఘర్షణల శాంతియుత పరిష్కారం, సంక్షోభ నివారణకు కృషి, దౌత్యం, చర్చలు ఇవన్నీ ఇప్పుడు కీలకమే. ఇది యుద్ధాలు చేసుకునే శకం కాదు'' అని ఆ డిక్లరేషన్‌లో సభ్యదేశాలు ముక్తకంఠంతో నినదించాయి.

ఉక్రెయిన్ యుద్ధంపై భిన్నాభిప్రాయాలు

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై జీ-20 సదస్సులో సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ అంతర్జాతీయ చట్టాలను అందరూ కట్టుబడి ఉండాలని సదస్సు గట్టిగా చెప్పింది. సంక్షోభంలో చిక్కుకున్న పౌరుల రక్షణ కూడా అత్యంత ముఖ్యమైనదేనని స్పష్టం చేసింది. సదస్సులో పాల్గొన్న అత్యధిక సభ్య దేశాలు రష్యా యుద్ధాన్ని తీవ్రంగా ఖండించాయి. అంతర్జాతీయ చట్టాలను యదేచ్ఛగా ఉల్లంఘిస్తూ రష్యా చట్టవిరుద్ధంగా అన్యాయంగా చేస్తున్న యుద్ధం ఫలితంగా ప్రపంచం ఆర్థికంగా కోలుకోలేకుండా ఉందని ఆందోళన వ్యక్తం చేశాయి. శాంతి, స్థిరత్వాలను పరిరక్షించే అంతర్జాతీయ చట్టాలను అన్ని దేశాలు పాటించేలా చూడాలని పేర్కొన్నాయి. అణ్వాయుధాలను ప్రయోగిస్తామని రష్యా చేస్తున్న బెదిరింపులు ఆమోద యోగ్యం కాదని, ఈ యుద్ధంతో మానవీయ సంక్షోభంతో పాటు ఆర్థిక భారం కూడా ప్రపంచ దేశాలు మోయాల్సి ఉంటుందని వీలైనంత త్వరంగా యుద్ధానికి ముగింపు పలకాలని పేర్కొన్నాయి. కొన్ని దేశాలు మాత్రం అన్ని అంశాలను తులనాత్మకంగా బేరీజు వేసుకోవాలని తమ అభిప్రాయాన్ని వెల్లడించాయి.

భారత్‌ది కీలక పాత్ర

డిక్లరేషన్ రచనలో భారత్ ఇతర వర్ధమాన దేశాలతో కలిసి కీలకంగా వ్యవహరించింది. అన్ని దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరడానికి , ఒకే తాటిపై నిలబడడానికి భారత దౌత్య బృందానికి ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందిస్తూ ప్రధాని మోదీ ప్రముఖ పాత్ర పోషించారని భారత విదేశాంగ కార్యదర్శి వినయ్ క్వాత్రా చెప్పారు. ''భారత్ తనకున్న , సానుకూల, నిర్మాణాత్మక వైఖరితో నాయకత్వ లక్షణాలు పుష్కలంగా ఉన్న దేశంగా ఎదిగింది. పరిష్కార మార్గాలను చూపించడంలోనూ, అన్ని దేశాల మధ్య ఏకాభిప్రాయాలను సాధించడంలోనూ ముందుంది'' అని జీ-20 డిక్లరేషన్ భారత్‌ను కొనియాడింది.

ఉగ్రవాదులకు నిధులు అందకుండా చూడాలి

ఉగ్రవాదానికి నిధులందించే కార్యకలాపాల కట్టడికి దేశాలన్నీ కలిసి రావాలని జీ 20 సభ్య దేశాలు పిలుపునిచ్చాయి. మనీ లాండరింగ్‌ని నిరోధించడం, ఉగ్రవాద సంస్థలకి నిధులు అందకుండా వ్యూహాత్మక వ్యవహరించడంతో చిత్తశుద్ధి ప్రదర్శించాలని సంయుక్త ప్రకటన పేర్కొంది. ఉగ్రవాద ముప్పు లేకుండా అన్ని దేశాలు కృషి చేయాలని ఆ ప్రకటన స్పష్టం చేసింది. మరోవైపు కరోనాతో కుదేలైన పర్యాటక రంగానికి ఊతమిచ్చే చర్యలపై కూడా సమావేశం దృష్టి సారించింది.

భారత్‌కు జీ 20 అధ్యక్ష బాధ్యతలు

అందరినీ కలుపుకొనిపోతామన్న ప్రధాని మోదీ

ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన కూటమి జీ 20 అధ్యక్ష బాధ్యతల్ని భారత్ స్వీకరించింది. బాలిలో జరిగిన ముగింపు సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీకి ఇండొనేసియా అధ్యక్షుడు జోకో విడోడో లాంఛనంగా అధ్యక్ష బాధ్యతల్ని అప్పగించారు. వచ్చే ఏడాది సదస్సు భారత్ ఆధ్వర్యంలో జరగనుంది. జీ 20 అధ్యక్ష బాధ్యతలు నిర్వహించడం ప్రతి భారతీయుడికీ గర్వకారణమని మోదీ అన్నారు. ''ఇవి అత్యంత ప్రతిష్మాత్మక బాధ్యతలు. సభ్య దేశాల సహాయ సహకారాలతో




జీ 20 సారథ్యాన్ని మోదీకి అప్పగిస్తున్న విడొడొ

ప్రపంచ సంక్షేమానికి జీ 20 సదస్సును వేదికగా మారుస్తాం. ప్రపంచంలో పలు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు, ఆర్థిక సంక్షోభం, ఆహారం , ఇంధన ధరల పెరుగుదల వంటి సమస్యల నేపథ్యంలో కూటమి సారథ్య బాధ్యతలు స్వీకరిస్తున్నాం. అన్ని దేశాలు జీ 20 వైపే ఆశగా చూస్తాయి. భారత్ ఆధ్వర్యంలో జీ 20 అందరినీ కలుపుకొని పోతూ నిర్ణయాత్మకంగా, చర్యలు తీసుకునేలా ఉంటుంది. వచ్చే ఏడాదిలోగా జీ 20 కొత్త కొత్త ఆలోచనలు చేసి, సమష్టి నిర్ణయాలు తీసుకునేలా తీర్చిదిద్దుతాం'' అని అన్నారు. 2024లో బ్రెజిల్‌లోనూ, ఆ తర్వాత ఏడాది 2025లో దక్షిణాఫ్రికాలోనూ జీ 20 సదస్సు జరగనుంది.

బ్రిటన్‌లో మనోళ్లకు... మరింత వెల్‌కం!

ఏటా 3,000 ప్రొఫెషనల్ వీసాలు

- భారత్ నుంచి నాకు అపూర్వ మద్దతు
- మోదీతో ప్రస్తావించి థాంక్స్ చెప్పిన రిషి



బాలి: 18-30 ఏళ్ల మధ్య వయస్కులైన యువ నిపుణులకు ఉద్యోగాలు, ఉన్నత చదువుల నిమిత్తం ఏటా అదనంగా 3,000 వీసాలివ్వాలని బ్రిటన్ నిర్ణయించింది. ఈ యూకే-ఇండియా యంగ్ ప్రొఫెషనల్స్ స్కీమ్ కింద చదువుకోవడంతో పాటు రెండేళ్ల దాకా పని చేసేందుకు కూడా వారికి వెసులుబాటు కల్పించనుంది. జీ 20 సదస్సు సందర్భంగా ప్రధానులు నరేంద్ర మోదీ, రిషి సునాక్ బుధవారం అధికారికంగా సమావేశమయ్యాక బ్రిటన్ ఈ మేరకు ప్రకటించింది.

ఉక్రెయిన్ యుద్ధంతో పాటు పలు అంతర్జాతీయ, ద్వైపాక్షిక అంశాలపై మోదీ, సునాక్ లోతుగా చర్చించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ముఖ్యంగా చర్చ జరిగింది. 2030 కల్లా ద్వైపాక్షిక సంబంధాలను సుదృఢం చేసుకునే దిశగా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. తాను ప్రధాని అవడం పట్ల భారత్ నుంచి లభించిన అపూర్వ స్పందనను రిషి ప్రస్తావించారు. ఇందుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. బ్రిటన్‌తో సంబంధాలకు భారత్ అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని చర్చల అనంతరం మోదీ వెల్లడించారు. ''రిషితో భేటీ గొప్పగా సాగింది. వర్తకం, రక్షణ, భద్రత సహా పలు కీలక రంగాల్లో మరింత సన్నిహిత సంబంధాల దిశగా లోతుగా చర్చించాం'' అంటూ ట్వీట్ చేశారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, జర్మనీ చాన్సలర్ ఒలాఫ్ స్కోల్జ్ సహా పలువురు దేశాధినేతలతో కూడా మోదీ వరుసగా భేటీ అయ్యారు.

క్లుప్తంగా...

ఢిల్లీ హత్య కేసు... నిందితునికి నార్కో టెస్టు!

న్యూఢిల్లీ/ముంబై: సహజీవనం చేస్తున్న శ్రద్ధా వాకర్ అనే అమ్మాయిని కిరాతకంగా చంపి ముక్కలుగా కోసిన అఫ్తాబ్ అమీన్‌కు నార్కో పరీక్షలు చేసేందుకు పోలీసులు కోర్టును అనుమతి కోరనున్నారు. 'విచారణ సందర్భంగా అతని ముఖంలో లేశమాత్రం పశ్చాత్తాపం కూడా కన్పించడం లేదు. ప్రశ్నలన్నింటికీ చాలా ధీమాగా సమాధానాలు చెబుతున్నాడు. ఆ స్టేట్‌మెంట్లు పదేపదే మారుస్తున్నాడు. పైగా పొంతన లేని మాటలు చెబుతున్నాడు' అని వివరించారు. ఢిల్లీలో సేకరించిన 13 శరీర భాగాల తాలూకు అవశేషాలు శ్రద్ధవేనని నిర్ధారించేందుకు వాటిని ఆమె తండ్రి డీఎన్ఏ నమూనాతో సరిపోల్చనున్నారు. హత్యాయుధంతో పాటు శ్రద్ధ తల, మొబైల్ దొరకాల్సి ఉందని పోలీసులు చెప్పారు. మతం మారాల్సిందిగా ఆమెను బలవంతం చేసి ఉంటాడని శ్రద్ధ స్నేహితులు ఆరోపిస్తున్నారు. శ్రద్ధ అకౌంట్ నుంచి రూ. 55 వేలు అఫ్తాబ్ ఖాతాకు బదిలీ అయినట్లు కూడా తేలింది.


లిక్కర్ కుంభకోణంలో అప్రూవర్‌గా దినేశ్ అరోరా

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ వివాదం మరో మలుపు తిరిగింది. నిందితుడైన వ్యాపారవేత్త దినేశ్ అరోరా అప్రూవర్‌గా మారడానికి సిటీ కోర్టు అనుమతిచ్చింది. ఈయన ఢిల్లీ ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు సన్నిహితుడు. జరిగిందేమిటో పూర్తిగా వెల్లడిస్తానని విచారణ సందర్భంగా అరోరా ముందుకు రావడంతో స్పెషల్ జడ్జి ఎం.కె.నాగ్‌పాల్ ఆయన అభ్యర్థనను మన్నించారు. దినేశ్ అరోరాకు క్షమాభిక్ష పెడుతూ అప్రూవర్‌గా మారడానికి అనుమతిచ్చారు. గుజరాత్ ఎన్నికల వేళ ఇది ఆప్‌కు ఇబ్బందికర పరిణామంగా మారొచ్చని భావిస్తున్నారు. అరోరా ముందస్తు బెయిల్‌కు దరఖాస్తు చేసినపుడు కూడా సీబీఐ అభ్యంతరం చెప్పలేదు. ఆయనిచ్చే సమాచారం కేసు పురోగతికి ఉపయుక్తకరంగా ఉందని, విచారణకు దినేశ్ అరోరా సహకరిస్తున్నారని.. అందువల్ల ముందస్తు బెయిల్ ఇవ్వడానికి తమకు అభ్యంతరం లేదని కోర్టుకు తెలిపింది.

విమానాల్లో మాస్క్ తప్పనిసరి కాదు

న్యూఢిల్లీ: కరోనా ఉధృతి దేశంలో తగ్గిన ప్రస్తుత తరుణంలో విమాన ప్రయాణాల్లో ప్రయాణికులు మాస్కును తప్పకుండా ధరించాల్సిన అవసరం లేదని పౌర విమానయాన శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. కోవిడ్ విజృంభణ కాలం నుంచీ విమానాల్లో ప్రయాణికులు మాస్క్ ధరించడాన్ని తప్పనిసరి చేసిన విషయం తెల్సిందే. ' తప్పని పరిస్థితుల్లో మాస్క్ లేదా ముఖం కప్పుతూ వస్త్రం ధరిస్తే సరిపోతుంది. ఈ సూచన ఖచ్చితమైతే కాదు' అని అన్ని పౌర విమానయాన సంస్థలకు పౌర విమానయాన శాఖ పంపిన ఒక ప్రకటనలో పేర్కొంది. విమానాల్లో చేసే అనౌన్స్‌మెంట్‌లలో సైతం మాస్క్‌లేకుంటే జరిమానా/రుసుము వంటి ప్రకటనలు అవసరం లేదని స్పష్టంచేసింది. దేశవ్యాప్తంగా నమోదైన కరోనా పాజిటివ్ కేసుల్లో క్రియాశీలకంగా ఉన్న కేసుల సంఖ్య తగ్గడంతో విమానయాన శాఖ ఈ మేరకు ఉపశమన చర్యలు చేపట్టింది.

రైతుల నడ్డి విరిచారు



వాషిం (మహారాష్ట్ర): కేంద్రంలోని బీజేపీ సర్కారు తీసుకున్న నిర్ణయాలతో దేశ ఆర్థిక వ్యవస్థ దారుణంగా దెబ్బతినడమే కాకుండా.. అవి రైతుల నడ్డి విరిచాయని కాంగ్రెస్ నేత రాహుల్ అన్నారు. నోట్ల రద్దు, తర్వాత జీఎస్‌టీని అమలులోకి తేవడం ద్వారా చిన్న, మధ్యతరగతి పరిశ్రమలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడిందని పేర్కొన్నారు. చిన్న, మధ్యతరగతి పరిశ్రమలే అధిక ఉద్యోగాలు కలిప్రస్తాయని.. భారీ పరిశ్రమలు కాదని అన్నారు. నోట్ల రద్దు, రైతులు చట్టాలు.. రైతాంగం, పారిశ్రామికవర్గాలను దెబ్బతీయడానికి బీజేపీ వాడిన ఆయుధాలుగా అభివర్ణించారు. భారత్ జోడో యాత్రలో భాగంగా బుధవారం మహారాష్ట్రలోని వాషిం జిల్లాలో మాట్లాడారు.

పోలండ్‌పైకి క్షిపణులు... రష్యా దాడి కాదు

నాటో, పోలండ్ ప్రకటన

షెవాడో (పోలండ్): పోలండ్ సరిహద్దుల్లోని పంట పొలాల్లో మంగళవారం ఇద్దరిని బలిగొన్న క్షిపణి దాడులు రష్యా పనేనంటూ వచ్చిన వార్తలు తీవ్ర కలకలానికి దారితీశాయి. దీని ఫలితంగా ఉక్రెయిన్‌కు బాసటగా నాటో రంగంలోకి దిగొచ్చని, దాంతో రష్యా 9 నెలలుగా చేస్తున్న యుద్ధం రూపురేఖలే మారిపోవచ్చని ఒక దశలో ఆందోళనలు కూడా వ్యక్తమయ్యాయి. అయితే ఈ దాడితో రష్యాకు సంబంధం లేదని పోలండ్‌తో పాటు నాటో కూటమి కూడా బుధవారం ప్రకటించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ''అది ఉద్దేశపూర్వక దాడి ఎంతమాత్రమూ కాదనిపిస్తోంది. బహుశా తమ విద్యుత్ కేంద్రాలపై రష్యా సైన్యం చేస్తున్న భారీ దాడులను అడ్డుకునేందుకు ఉక్రెయిన్ ప్రయోగించిన క్షిపణులు దురదృష్టవశాత్తూ సరిహద్దులు దాటి ఉండొచ్చు'' అని పోలండ్ అధ్యక్షుడు ఆంద్రే డూడ అభిప్రాయపడ్డారు. నాటో సెక్రెటరీ జనరల్ జెన్స్ స్టోటెన్‌బర్గ్ కూడా బ్రసెల్స్‌లో జరిగిన నాటో భేటీలో అదే అన్నారు. అయితే, ''ఉక్రెయిన్‌ను తప్పుబట్టలేం. యుద్ధానికి కారణమైన రష్యాయే ఈ క్షిపణి దాడులకు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది'' అంటూ నిందించారు. ఈ ఉదంతంలో కచ్చితంగా ఏం జరిగిందో త్వరలోనే తేలుస్తామన్నారు. రష్యా క్షిపణిని అడ్డుకునేందుకు ఉక్రెయిన్ బలగాలు ఈ క్షిపణులను ప్రయోగించినట్టు ప్రాథమికంగా తేలిందని అమెరికా అధికారులు చెబుతున్నారు.

వంద కోట్ల యువతకు శబ్దపోటు

హెడ్‌ఫోన్లు, భారీ శబ్దంతో సంగీతం వినడంతో వినికిడి సమస్య ముప్పు



వాషింగ్టన్: నిరంతరం హెడ్‌ఫోన్లు పెట్టుకునే సంగీతం వింటున్నారా ? ప్రతి ఫోన్‌కాల్, ఆడియో, వీడియో శబ్దాలు నేరుగా కాకుండా కేవలం ఇయర్ బడ్స్ ద్వారానే వింటున్నారా ? చెవులు చిల్లులు పడే శబ్దమయ సంగీత విభావరిలకు హాజరవుతున్నారా ? అయితే వినికిడి సమస్య మిమ్మల్ని వెంటాడటం ఖాయమని ఒక తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. గ్యాడ్జెట్లకు అతుక్కుపోతున్న దాదాపు 100 కోట్ల మంది టీనేజీ వయసువారికి చెముడు సమస్య పొంచి ఉందని బీఎంజే గ్లోబల్ హెల్త్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనంలో వెల్లడైంది. ప్రపంచ దేశాలు తమ టీనేజర్ల కోసం అత్యవసరంగా శబ్ద సంబంధ చట్టాలకు పదునుపెట్టాలని అమెరికాలోని సౌత్ కరోలినా వైద్య విశ్వవిద్యాలయం పరిశోధకులతో కూడిన అంతర్జాతీయ అధ్యయన బృందం సూచనలు చేస్తోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 43 కోట్ల మంది వినికిడి సమస్యతో బాధపడుతున్నారని డబ్ల్యూహెచ్‌ఓ గణాంకాలు చెబుతున్నాయని పరిశోధకులు గుర్తుచేశారు. ''సొంత శబ్ద సాధనాలు(పర్సనల్ లిజనింగ్ డివైజెస్-పీఎల్‌డీ) స్మార్ట్‌ఫోన్, హెడ్‌ఫోన్, ఇయర్‌బడ్స్‌ల అతివాడకమే సమస్యకు కారణం. వాస్తవానికి వయోజనులు 80 డెసిబెల్స్, చిన్నారులు 75 డెసిబెల్స్ స్థాయిలోనే శబ్దాలు వినాలి. కానీ, పీఎల్‌డీ వినియోగదారులు అత్యధికంగా 105 డెసిబెల్స్ వాల్యూమ్స్‌లో శబ్దాలు వింటున్నారు. ఇక ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమాల్లో ఇది 112 డెసిబెల్స్‌కు చేరుతోంది. 2022 ఏడాదిలో 12-34 ఏళ్ల వయసువారిలో ఏకంగా 280 కోట్ల మంది వినికిడి సమస్యను ఎదుర్కొనే ప్రమాదముంది'' అని అంచనావేశారు.

కాంగ్రెస్‌కు 'మైనారిటీ' బెంగ!

ఆ వర్గం ఓట్లపై కన్నేసిన ఆప్, మజ్లిస్ • 25 స్థానాల్లో పెద్ద సంఖ్యలో ముస్లింలు

అహ్మదాబాద్: గుజరాత్‌లో కీలకమైన మైనారిటీల ఓట్లను ఒడిసిపట్టేందుకు బీజేపీ మినహా పార్టీలన్నీ ఈసారి సర్వ శక్తియుక్తులూ కేంద్రీకరిస్తున్నాయి. ముఖ్యంగా ఏళ్ల తరబడి వాళ్ల ఓట్లను గంపగుత్తగా పొందుతూ వచ్చిన కాంగ్రెస్‌కు ఈసారి ఆమ్ ఆద్మీ పార్టీ, మజ్లిస్ రూపంలో సెగ తగులుతోంది. కొత్తగా రాష్ట్ర బరిలో దిగిన ఆ రెండు పార్టీల నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటోంది. మరోవైపు ఈ రెండు పార్టీల రాకతో ఓటర్లకు కూడా చాయిస్ పెరిగిపోయడం ఆసక్తికరంగా మారింది...!

6.5 కోట్ల గుజరాత్ జనాభాలో ముస్లింలు దాదాపు 11 శాతం దాకా ఉంటారు. కనీసం 25 అసెంబ్లీ స్థానాల్లో వీరి ప్రాబల్యముంది. జమ్లాపూర్-ఖడియా అసెంబ్లీ స్థానంలో ముస్లిం ఓటర్లు ఏకంగా 65 శాతమున్నారు. మిగతా చోట్ల అంతగా కాకున్నా వీరి ఓట్లు పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి! రాష్ట్ర ముస్లింలు పాలక బీజేపీకి ఎప్పుడూ పెద్దగా ఓటేసింది లేదు. అందుకు తగ్గట్టే గత రెండు దశాబ్దాల పై చిలుకు కాలంలో ముస్లింలకు బీజేపీ ఒక్క టికెట్ కూడా ఇవ్వలేదు! 2017 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆరుగురు ముస్లింలకు టికెట్లివ్వగా కేవలం ముగ్గురే నెగ్గారు. 2012లో ఏడుగురికి టికెట్లిస్తే ఇద్దరే గెలిచారు! ఈసారి తన ముస్లిం ఓటు బ్యాంకుకు ఆప్, మజ్లిస్ గండి కొట్టేలా కన్పిస్తుండటంతో దీన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ పలు చర్యలు చేపట్టింది. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా



ఎమ్మెల్యే మొహమ్మద్ పిర్జాదాను నియమించింది. దేశ వనరులపై ముస్లింలకే మొదటి హక్కుండాలంటూ అప్పట్లో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర మైనారిటీల్లోకి పెద్ద ఎత్తున తీసుకెళ్లేందుకు పీసీసీ చీఫ్ జగదీశ్ ఠాకూర్ కొంతకాలంగా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇది కేవలం మైనారిటీ ఓట్లను కొల్లగొట్టే ఎత్తుగడేనంటూ ఇతర పార్టీలు ఎంతగా విమర్శించినా లెక్క చేయడం లేదు.

గుజరాత్ సమరం

కేజ్రీవాల్, అసద్ పర్యటనలు

మరోవైపు ముస్లిం ఓటర్లను ఆకట్టుకునేందుకు మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ తరచూ రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. ఈసారి 30 స్థానాల్లో పోటీ చేస్తామని పార్టీ ఇప్పటికే పేర్కొంది. ఆరు చోట్ల అభ్యర్థులను కూడా ప్రకటించింది. కాంగ్రెస్, మజ్లిస్‌లకు భిన్నంగా ఆప్ మాత్రం మైనారిటీల్లోకి చొచ్చుకుపోయేందుకు నిశ్శబ్దంగా ప్రయత్నాలు సాగిస్తోంది. ఇప్పటికే ముగ్గురు ముస్లింలకు టికెట్లిచ్చింది. ముస్లిం ప్రాబల్య ప్రాంతాల్లో కేజ్రీవాల్‌తో పాటు ఆప్ పాలనలోని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ తరచూ పర్యటిస్తూ వారి నమ్మకాన్ని చూరగొనేందుకు శ్రమిస్తున్నారు. ఇవన్నీ రాష్ట్ర మైనారిటీలకు మంచి శకునాలేనంటున్నారు మైనారిటీ కోఆర్డినేషన్ కమిటీ అనే ముస్లిం స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ ముజాహిద్ నఫీస్. ''గత ఎన్నికల దాకా గుజరాత్ ముస్లింలకు కాంగ్రెస్ మినహా పెద్దగా చాయిస్ ఉండేది కాదు. కానీ ఇప్పుడలా లేదు'' అని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే మజ్లిస్, ఆప్‌లను ముస్లిం ఓటర్లు పెద్దగా పట్టించుకోరని, ఎప్పట్లాగే కాంగ్రెస్‌కే దన్నుగా నిలుస్తారని ఆ పార్టీకి చెందిన దరియాపూర్ ఎమ్మెల్యే గయాజుద్దీన్ షేక్ ధీమా వెలిబుచ్చారు. ''ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ బీజేపీని మించిన హిందుత్వవాదినని పదేపదే రుజువు చేసుకుంటున్నారు. కనుక ముస్లింలు ఆయన్ను నమ్మే పరిస్థితి లేదు. మజ్లిస్‌కు రాష్ట్రంలో పెద్దగా ఆదరణే లేదు'' అని చెప్పుకొచ్చారు. ఆప్ నేతలు మాత్రం ఢిల్లీ, పంజాబ్ ప్రదర్శనను గుజరాత్‌లో పునరావృతం చేస్తామని, మైనారిటీలు కూడా తమనే నమ్ముతున్నారని చెబుతున్నారు.

పేదరికంపై సాంకేతికాస్త్రం: మోదీ

ఇన్వెస్టర్లకు రెడ్ కార్పెట్ • బీటీఎస్‌నుద్దేశించి ప్రసంగం

బెంగళూరు: పేదరిక నిర్మూలనకు సాంకేతికతను తిరుగులేని అస్త్రంగా భారత్ ఉపయోగిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆసియాలో అతిపెద్ద టెక్నాలజీ ఈవెంట్ అయిన 25వ బెంగళూరు టెక్ సమిట్ (బీటీఎస్)ను ఉద్దేశించి ఇండొనేసియాలోని బాలి నుంచి బుధవారం ఆయన వీడియో సందేశమిచ్చారు. భారత్‌లో చిరకాలం పాటు వేళ్లూనుకుని పోయిన అధికార అలసత్వాన్ని తమ హయాంలో నిర్మూలించామన్నారు. ''భారత ప్రగతి ప్రస్థానంలో కొన్నేళ్లుగా అన్ని అంశాలూ అద్భుతంగా కలిసొస్తున్నాయి. ఆరోగ్యం, మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ వంటి అన్ని రంగాల్లోనూ అంతర్జాతీయంగా భారతీయులు సారథ్య స్థానాల్లో రాణిస్తున్నారు. మాతో కలిసి పని చేసేకుందకు మీకిదే స్వాగతం'' అని ఇన్వెస్టర్లనుద్దేశించి వ్యాఖ్యానించారు. గ్లోబల్ ఇన్నొవేషన్ ఇండెక్స్‌లో 2015లో 81వ స్థానంలో ఉన్న భారత్ ఈ ఏడాది 40 స్థానానికి ఎగబాకిందన్నారు. 'భారత్‌లో గత ఎనిమిదేళ్లలో స్మార్ట్‌ఫోన్లు 15 కోట్ల నుంచి 75 కోట్లకు పెరిగాయి' అని చెప్పుకొచ్చారు.

మూడోసారీ అధ్యక్ష బరిలోకి: ట్రంప్



వాషింగ్టన్: డెమొక్రాట్ల నాయకుడు బైడెన్ నేతృత్వంలో అమెరికా పతనావస్థలోకి దిగజారిందని దేశ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దుయ్యబట్టారు. దేశాన్ని మళ్లీ అభివృద్ధి బాట పట్టించేందుకు తదుపరి అధ్యక్షుడిగా వస్తానని ప్రకటించారు. ''గ్రేట్ అమెరికా కోసం మళ్లీ అధ్యక్ష ఎన్నికల బరిలో దిగుతున్నా. మీ గొంతుకగా ఉంటా. బైడెన్ మళ్లీ ప్రెసిడెంట్ కాలేరు! ఆయన హయాంలో అన్నీ వైఫల్యాలే. అసలైన అభివృద్ధిని నేను చేసి చూపిస్తా. అందుకే వస్తున్నా. నేను సిద్ధం. మీరూ సిద్ధమేగా!'' అని ఫ్లోరిడాలోని మార్-ఎ-లాగో ఎస్టేట్‌లో మంగళవారం దాదాపు 400 మంది అతిథుల సమక్షంలో తన అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని ట్రంప్ అధికారికంగా ప్రకటించారు. 2016లో హిల్లరీ క్లింటన్‌ను ఓడించి అధ్యక్షుడయ్యాక నాలుగేళ్ల తన హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. అమెరికా ఫస్ట్ నినాదానికి మరోసారి జైకొడదామని కార్యకర్తలనుద్దేశించి వ్యాఖ్యానించారు. మాజీ అధ్యక్షుడు మళ్లీ పోటీ చేస్తానని ప్రకటించడం అమెరికా చరిత్రలో బహుశా ఇదే తొలిసారంటున్నారు. అధ్యక్షుడిగా ట్రంప్ రెండుసార్లు అభిశంసన అంచుల దాకా వెళ్లడం, తనను ఓడించి బైడెన్ అధ్యక్ష బాధ్యతలు చేపడుతున్న వేళ పార్లమెంట్ భవనంపై దాడికి రిపబ్లికన్ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టి అపకీర్తి మూటగట్టుకోవడం తెలిసిందే.

సాక్షి
విజయనగరం

గురువారం । 17 । నవంబర్ । 2022

గుర్రంపై పెళ్లికొడుకు



రాజాం పట్టణానికి చెందిన ఓ ముస్లిం వివాహ వేడుకలో గుర్రంపై పెళ్లికొడుకును బుధవారం ఊరేగించారు. దీనిని పట్టణ ప్రజలు ఆసక్తిగా తిలకించారు. – రాజాం



బిజీబిజీగా..

ఖరీఫ్ వరి పంట చేతికొచ్చిన వేళ పొలం పనుల్లో రైతులు బిజీ అయ్యారు. ఇంటిల్లి పాదీ ఉదయం నుంచి పొద్దుపోయే వరకు వరి కోతలు, ఓవులు పెట్టడం, మోత పనుల్లో నిమగ్నమవుతున్నారు. ధర్మపురి గ్రామ సమీపంలో 'సాక్షి'కి చిక్కిన ఈ చిత్రమే నిదర్శనం. – సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

విడిపోయిన ఒంటరి ఏనుగు



కొమరాడ: మండలంలోని నాగావళి నది అవల వైపు ఉన్న ఏడు గజరాజుల గుంపు నుంచి ఒక ఏనుగు బుధవారం విడిపోయింది. కుమ్మరిగుంట, కందివలస, రాజ్యలక్ష్మీపురం గ్రామాలకు వెళ్లే దారిలో సంచరిస్తోంది. ప్రజలు అప్రమంతా ఉండాలని ఎలిఫ్యాంట్ టేకర్స్ టీమ్ లీడర్ చంద్రశేఖర్ కోరారు. రైతులు రాత్రిపూట పొలాల్లోకి వెళ్లొద్దని సూచించారు.

న్యూస్‌రీల్

పక్కాగా పంట కోత ప్రయోగాలు

● జేడీఏ రామారావు



మరువాడ గ్రామంలో పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న జేడీఏ రామారావు

బొండపల్లి: ఖరీఫ్ సీజన్‌లో వరి పంట కోత ప్రయోగాలను పక్కాగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయశాఖ జేడీఏ వి.టి.రామారావు వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని మరువాడ రెవెన్యూ పరిధిలోని ఎం.కొత్తవలస గ్రామానికి చెందిన రైతు కర్రోతు శ్రీనివాసరావు వరి పొలంలో బుధవారం నిర్వహించిన పంటకోత ప్రయోగాన్ని పరిశీలించారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. ఎకరాకు 28 నుంచి 30 బస్తాల దిగుబడి వస్తోందన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ పీవీ మల్లికార్జునరావు, ఏఈఓ సంతోష్ కుమార్, వీఆర్వో దేవుడమ్మ, వీపీఏ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని సేవలో డిప్యూటీ స్పీకర్



తిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధిలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జిల్లా నాయకులు

విజయనగరం: తిరుపతి వేంకటేశ్వర స్వామివారిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి బుధవారం ఉదయం దర్శించుకున్నారు. కలియుగ వైకుంఠుడి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని ప్రార్థన చేసినట్టు ఫోన్‌లో స్థానిక విలేకరులకు తెలిపారు. ఆయన వెంట ఎమ్మెల్సీ డాక్టర్ పీవీ సూర్యనారాయణ రాజు, రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ బోర్డు చైర్మన్ గుబ్బ చంద్రశేఖర్, ఎస్.కోట నియోజకవర్గ పరిశీలకులు కేవీ సూర్యనారాయణరాజు, వ్యాపారవేత్త కేఏపీ రాజు తదితరులు ఉన్నారు.


షూటింగ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

కొత్తవలస: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్‌పోటీలకు పురుషుల (సీనియర్) జిల్లా జట్టును ఎంపిక చేసినట్టు షూటింగ్‌బాల్ జిల్లా కార్యదర్శి పులిబంటి ప్రసాద్ బుధవారం తెలిపారు. జామి మండలం అలమండ శ్రీరామస్ స్కూల్ వద్ద నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 12 మంది క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశామన్నారు. వీరు ఈ నెల 19, 20 తేదీల్లో విజయవాడలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరుతీసుకురావాలని క్రీడా సంఘం ప్రతినిధులు ఆకాంక్షించారు. ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన పీఈటీలు పాల్గొన్నారు.

డీఈఓగా లింగేశ్వర రెడ్డి



లింగేశ్వరరెడ్డి

విజయనగరం పూల్‌బాగ్: జిల్లా విద్యాశాఖాధికారిగా బి.లింగేశ్వరరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్టు విద్యాశాఖ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఆయన గతంలో డిప్యూటీ డీఈఓగా, సర్వశిక్షఅభియాన్ ఏపీసీగా, ఇన్‌చార్జి డీఈఓగా జిల్లాలో పనిచేశారు. ప్రస్తుతం అనకాపల్లి జిల్లా డీఈఓగా పనిచేస్తూ విజయనగరం జిల్లాకు బదిలీపై వస్తున్నారు. గతంలో డీఈఓగా పనిచేసిన డాక్టర్ ఏఎమ్ జయశ్రీ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జి డీఈఓగా కె.వెంకటేశ్వరరావు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన నుంచి పూర్తిస్థాయి జిల్లా విద్యాశాఖాధికారిగా లింగేశ్వరరెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నారు.

గంగపుత్రుల చింతతీర్చే
ఫ్లోటింగ్ జెట్టీ



ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి ఎంపిక చేసిన చింతపల్లి తీర ప్రాంతం



చింతపల్లి తీరంలో మత్స్యకారులు

మత్స్యకారుల దశాబ్దాల కలను జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నెరవేర్చింది. చింతపల్లిలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. మత్స్యకారుల ఉపాధికి ఊతమిచ్చేలా జెట్టీ నిర్మాణానికి రూ.25 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గంగపుత్రుల జీవనానికి మార్గం సుగమం చేసింది.

- చింతపల్లి తీరంలో నిర్మాణం
- ముక్కాంలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి ప్రతిపాదన
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పచ్చజెండా
- రూ.25 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు
- దాదాపు 20 వేల మంది మత్స్యకారులకు శుభవార్త

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

సముద్రమే వారికి ప్రపంచం. చేపల వేటే వారికి జీవనాధారం. వాటి వేటకు ఉపయోగించే బోటులే ఊపిరి. ప్రత్యక్షంగా, పరోక్షంగా మత్స్య ఉత్పత్తిపై ఆధారపడిన దాదాపు 20 వేల మంది వరకూ ఉన్న ఆ గంగపుత్రుల బెంగ తీర్చేవారే కరువయ్యారు ఇన్నాళ్లూ!. జిల్లా తీరంలో చేపల వేట కలిసిరాక, తుపాను వస్తే బోట్లకు రక్షణ లేక, అన్నివిధాలా నష్టపోతూనే ఉన్నారు. విధిలేని పరిస్థితుల్లో పదులు వందలు కాదు వేల సంఖ్యలో ఇతర రాష్ట్రాలకు పొట్ట చేతబట్టుకొని వలసపోతూనే ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి అండగా నిలబడుతున్నారు. వారి కష్టాలను గట్టెక్కించే ఫ్లోటింగ్ జెట్టీ, ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌ను చింతపల్లి తీరంలో రూ.25 కోట్ల వ్యయంతో నిర్మించడానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. అలాగే, ముక్కాం తీరంలో మరో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి సానుకూలంగా స్పందించారు. దశాబ్దాలుగా కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్న గంగపుత్రులకు ఇది శుభవార్తే!



నిర్మాణం కానున్న ఫ్లోటింగ్ జెట్టీ ఇలా...

మత్స్యకారుల కష్టాలు గట్టెక్కేలా...

సముద్రంలో చేపల వేటపై ఆధారపడి పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని 19 మత్స్యకార గ్రామాలకు 12 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. వారు వేటాడి తెచ్చిన చేపలను విక్రయిస్తూ పరోక్షంగా మరో 8 వేల మంది వరకూ జీవనం సాగిస్తున్నారు. వీరుగాక ఇప్పటివరకూ దాదాపు 2 వేల మంది వరకూ మత్స్యకారులు గుజరాత్, గోవా, కర్ణాటక, కేరళ తీర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. తుపానుల సమయంలో బోట్లు మరమ్మతులకు గురికావడం, వేట తర్వాత వాటిని ఒడ్డుకు చేర్చడానికి ప్రతిరోజూ వ్యయప్రయాసలకు గురికావడం, మరోవైపు సముద్రంలో మత్స్యరాశి తగ్గిపోతుండటం, బోట్ల నిర్వహణ అధికమవడం ఇవన్నీ వలసలకు కారణాలే. తమను ఈ కష్టాల నుంచి గట్టెక్కించాలని మత్స్యకారులు గత ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా అరణ్యరోదనే అయ్యింది. వారి సమస్యలను తీర్చుతానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు.



చింతపల్లి తీరంలో చేపలు విక్రయిస్తున్న మత్స్యకార మహిళ

6 ఎకరాల భూమి కేటాయింపు...

చింతపల్లి తీరంలో ఫ్లోటింగ్ జెట్టీతో పాటు మత్స్యకారుల సౌకర్యం కోసం కమ్యూనిటీ హాల్, వేలం కేంద్రం, వలలు మరమ్మతు చేసుకోవడానికి భవనం, కోల్డ్ స్టోరేజీ నిర్మించడానికి అధికారులు ప్రతిపాదించారు. అందుకోసం సర్వే నంబరు 104లోని ఆరు ఎకరాలను కేటాయించారు. ఆ భూమిని స్వాధీనం చేస్తూ పత్రాలను మత్స్యశాఖ డెప్యూటి డైరెక్టర్ నిర్మలాకుమారికి పూసపాటిరేగ తహసీల్దారు ఇ.భాస్కరరావు అందజేశారు.

సీఎం చొరవతో సాకారం...



ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇప్పటికే సాగరమాల ప్రాజెక్టు సాంకేతిక బృందం జిల్లాలోని తీర ప్రాంతంలో పర్యటించింది. క్రీక్ ఉన్న చింతపల్లి తీరం ఫ్లోటింగ్ జెట్టీ, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి ఎంపిక చేశారు. అలాగే ముక్కాం వద్ద ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి పరిశీలిస్తున్నారు. అందుకు సంబంధించి ఆటోక్యాడ్ మ్యాప్‌ను ప్రభుత్వానికి పంపించాం.

– ఎస్.నిర్మలాకుమారి, డిప్యూటీ డైరెక్టర్, జిల్లా మత్స్యశాఖ

చింతపల్లి తీరమే అనుకూలం...

బంగాళాఖాతంలో తరచుగా సంభవించే తుఫానుల ప్రభావంతో అలలు ఎగిసిపడుతూ ఉంటాయి. వాటి తాకిడితో సాధారణ జెట్టీ దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. అలాగాకుండా అలలతో పాటు కదులుతూ ఉండే ఫ్లోటింగ్ జెట్టీ నిర్మించాలని అధికారులు ప్రతిపాదించారు. నది లేదా గెడ్డ సముద్రంలో కలిసే మొగ ప్రాంతం ఫ్లోటింగ్ జెట్టీ అనుకూలంగా ఉంటుంది. ఈ దృష్ట్యా జిల్లా తీరంలో మూడు ప్రాంతాలను పరిశీలించిన నిపుణులు వాటిలో పూసపాటిరేగ మండలంలోని చింతపల్లి తీరాన్ని ఎంపిక చేశారు. అక్కడ క్రీక్ ఉండటంతో ఇప్పటికే అక్కడ నుంచి చేపల వేట సాగుతోంది. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని తీరంలో 420 వరకూ సంప్రదాయ బోట్లు, 623 మోటరైజ్డ్ బోట్లను మత్స్యకారులు ఉపయోగిస్తున్నారు. వాటన్నింటినీ లంగర్ వేసుకోవడానికి వీలుగా ఫ్లోటింగ్ జెట్టీతో పాటు ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌ను చింతపల్లి వద్ద నిర్మాణం చేయనున్నారు. అందుకు రూ.25 కోట్లను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, భోగాపురం మండలం ముక్కాంలో కూడా ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి పరిశీలిస్తున్నారు.

■ పులిని బంధించేందుకు...



పులిదాడి చేసిన ప్రాంతంలో ఏర్పాటు చేసిన బోను

పులిని బంధించేందుకు అటవీశాఖ అధికారులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. బొండపల్లి మండలంలోని గరుడుబిల్లి గ్రామంలో పులిదాడి చేసి ఆవును హతమార్చిన ప్రాంతంలో బుధవారం బోను అమర్చారు. ఈ ప్రాంతీయులందరూ అప్రమత్తంగా ఉండాలని, రాత్రివేళ ఆరుబయట తిరగొద్దని ఫారెస్టు రేంజ్ అధికారి కె.వి.ఎస్.రాజు సూచించారు. – బొండపల్లి

వెబ్‌సైట్‌లో టీటీసీ హాల్‌టిక్కెట్లు

విజయనగరం పూల్‌బాగ్: టీటీసీ(టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు) లోయర్ గ్రేడ్ థియరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టిక్కెట్స్‌ను www. bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈఓ కె వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4.30 వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. విశాఖపట్నం, కృష్ణ, గుంటూరు, వైఎస్సార్‌కడప, అనంతపురంలో మొత్తం 9 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్‌తో పాటు ఏదైనా గుర్తింపుకార్డును పరీక్షకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు.

చెరకు సాగు విస్తీర్ణం పెంచాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

పాలకొండ రూరల్: ఈఐడీ ప్యారీ ఇండియా లిమిటెడ్ (సంకిలి) సుగర్ కర్మాగార యాజమాన్యం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని చెరకు సాగు విస్తీర్ణం పెంచాలని సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వారెడ్డి రైతులను కోరారు. పాలకొండ మార్కెట్ కమిటీ సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 2022–23 సీజన్‌లో చెరకు సరఫరా చేసే రైతులకు టన్నుకు రూ.2,980 మద్దతు ధర చెల్లిస్తామన్నారు. రైతులకు కల్పిస్తున్న రాయితీలను వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో చెరకు పంట పెట్టుబడులు పెరుగుతున్నందున చెరకు మద్దతు ధర పెంచాలని కోరారు. చెరకు రైతుల సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. చెరకు కోత యంత్రాలను రాయితీపై రైతులకు అందజేయాలని విన్నవించామన్నారు. కార్యక్రమంలో వీరఘట్టం ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు, వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు, మండల వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు, చెక్కర ఖర్మాగారం డీజీఎం రమేష్‌రెడ్డి, ఏజీఎమ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ పింఛన్ అమలుకు వినతి



ఎంపీ బెల్లానకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్ఈసీఎస్ విశ్రాంత ఉద్యోగులు

చీపురుపల్లి:

గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్ఈసీఎస్) విశ్రాంత ఉద్యోగులకు ఈపీఎఫ్ పెన్షన్ అమలు విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించాలని ఆ సంస్థ విశ్రాంత ఉద్యోగులు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆర్ఈసీఎస్ విశ్రాంత ఉద్యోగుల నేతృత్వంలో చీపురుపల్లి పట్టణంలో వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి హాజరైన ఎంపీను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ ప్రస్తుతం ఈపీఎఫ్ పింఛన్ నెలకు రూ. వెయ్యి అందుతోందని, నెలకు రూ.7,500 ఇవ్వాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నాయని చెప్పారు. పెంచిన ఈపీఎఫ్ పింఛన్ రూ.7,500 అమలు కోసం పార్లమెంట్‌లో ప్రస్తావించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్ఆర్.మూర్తి, పి.భాస్కరరావు, టి.ప్రసాదరావు, వి.నాగేశ్వరరావు, గోవిందరాజులు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కోర్సులతో తక్షణ ఉపాధి

- ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్–2022 ప్రారంభోత్సవంలో కలెక్టర్ సూర్యకుమారి
- ఆలోచింపజేసిన విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శనలు, ప్రయోగాలు



వైజ్ఞానిక ప్రదర్శనలు తిలకిస్తున్న కలెక్టర్, మేయర్, డిప్యూటీ మేయర్లు

విజయనగరం రూరల్: పాలిటెక్నిక్ కోర్సులు అభ్యసించే వారికి చిన్న వయసులోనే ఉపాధి లభిస్తుందని, థియరీ కంటే ప్రాక్టికల్స్‌కు ఎక్కువ ప్రాధాన్యమివ్వడమే దీనికి కారణమని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్ఆర్‌జీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో రెండు రోజులపాటు నిర్వహించనున్న ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్–2022ను కార్పొరేషన్ మేయర్ విజయలక్ష్మి, ఉప మేయర్ కోలగట్ల శ్రావణిలతో కలిసి కలెక్టర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలలో నేర్పించే నైపుణ్యాలు జీవితంలో త్వరగా స్థిరపడేందుకు దోహదపడతాయన్నారు. సంప్రదాయ కోర్సులకు భిన్నంగా ఉండే కరిక్యులంతో నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు విద్యార్థులకు అవకాశం కలుగుతుందని తెలిపారు. పాలిటెక్నిక్ కోర్సులలో నేర్పించే అంశాలను మనసుపెట్టి నేర్చుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఉత్తమ ఇంజినీర్లుగా ఎదిగేందుకు పాలిటెక్నిక్ ఒక చక్కని వేదికగా పేర్కొన్నారు. జిల్లాలో ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్ ఏర్పాటుకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కృషి చేశారన్నారు. ఇటువంటి టెక్ ఫెస్ట్‌లను సద్వినియోగం చేసుకుని సమాజానికి ఉపయోగపడే మంచి మానవ వనరుగా రూపొందాలని విద్యార్థులకు సూచించారు. 18 ఏళ్లు నిండిన విద్యార్థులు ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలన్నారు. మేయర్ వి.విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఇటువంటి టెక్ ఫెస్ట్ ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి బొత్సకు కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ టెక్ ఫెస్ట్–2022లో వందలాది మంది విద్యార్థులు పాల్గొని ప్రాజెక్టులను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఉమ్మడి జిల్లాల పరిధిలోని 22 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో రెండో డివిజన్ కార్పొరేటర్ సత్యగౌరి, ప్రిన్సిపాల్ జె.ఆశారాణి, చినమేరంగి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.విజయలక్ష్మి, విద్యార్థి వ్యవహారాల సలహాదారు ఎస్వీ రమణ, ఫెస్ట్ కోఆర్డినేటర్ సీవీ రమణమూర్తి పాల్గొన్నారు.



ప్రాజెక్టుల పనితీరును వివరిస్తున్న విద్యార్థులు



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

క్లుప్తంగా

రెండు బైక్‌లు ఢీ: ముగ్గురికి తీవ్రగాయాలు



క్షతగాత్రుడు లక్కోను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

భామిని: మండలంలోని మనుమకొండ వద్ద బుధవారం రెండు బైక్‌లు ఢీకొనడంతో ఒక బైక్‌పై వస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో పాలవలసకు చెందిన ఆరిక లక్కో, నిమ్మల విశ్వనాథ, నిమ్మల మిన్నారావులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం మేరకు వచ్చిన 108 అంబులెన్స్ ఈఎంటీ సంగమేష్,పైలట్ దామోదర్‌లు ప్రాథమిక చికిత్స అందించి కొత్తూరు సీహెచ్‌ఎన్‌సీకి ఒకరిని, పాలకొండ ఏరియా ఆస్పత్రికి ఇద్దరిని తరలించారు. బత్తిలి ఎస్సై కె.సీతారాములు ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

గులివిందాడలో పులి కలకలం



మృతి చెందిన ఆవును పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

కొత్తవలస రూరల్: మండలంలోని గులివిందాడ గ్రామంలో మరోసారి పులి కలకలం సృష్టించింది. గ్రామానికి చెందిన గవర రమణమ్మ ఆవును పులి చంపినట్లుగా గుర్తించినట్లు అటవీశాఖ డీఆర్‌ఓ రవి ఈ సందర్భంగా తెలిపారు. అనకాపల్లి, గులివిందాడ మధ్య పులి సంచరిస్తున్నట్లు గుర్తించామని, అందువల్ల అడ్డుకొండ పరిసర ప్రాంతాలలో సాయంత్రం వేళ పశువులను మేపవద్దని గ్రామస్తులను కోరినట్లు చెప్పారు. గులివిందాడలో ట్రాకింగ్ కెమెరాలను ఏర్పాటు చేశామని, పులిని మళ్లీ గుర్తిస్తే బోను ఏర్పాటు చేసి పట్టుకుంటామన్నారు. చనిపోయిన ఆవుకు నష్టపరిహారం లభించేలా కృషి చేస్తామని అటవీశాఖ అధికారులు బాధితురాలికి హామీ ఇచ్చారు.

మూడు పశువులు శాలలు దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

దత్తిరాజేరు: మండలంలోని బలభద్రరాజపురంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మూడు పశువులు శాలలు బుధవారం రాత్రి దగ్ధమైనట్లు గజపతినగరం అగ్నిమాపక అధికారి రవిప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన బర్ల రామునాయుడు, రాము, లక్షునాయుడులకు చెందిన పశువుల శాలలు దగ్ధం కావడంతో రూ.60 వేల వరకు ఆస్తినష్టం జరిగినట్లు చెప్పారు. సమాచారం మేరకు సకాలంలో సిబ్బందితో గ్రామానికి చేరుకుని మంటలు అదుపు చేయడంతో భారీగా ఆస్తినష్టం జరగలేదన్నారు.

18న వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 18న నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి అట్టాడ లక్ష్మునాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు నెల్లిమర్ల మండలం కొండవెలగాడలో జరిగే ఎంపిక పోటీల్లో పాల్గొనబోయే క్రీడాకారులు ఇండియన్ వెయిట్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ కార్డ్, ఆధార్‌కార్డ్ వెంట తీసుకురావాలని స్పష్టం చేశారు. ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబరిచిన క్రీడాకారులను ఈనెల 26,27,28 తేదీల్లో గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ధాన్యం కొనుగోలుకు సిద్ధం

- ఏర్పాట్లు చేసిన అధికారులు
- విక్రయానికి సమాయత్తమవుతున్న రైతులు
- ఖరీఫ్‌లో వరిసాగు 1.77లక్షల ఎకరాలు



పొలాల్లో పెట్టిన కుప్పలు



పంట పొలాల్లో ఉన్న కోసిన చేను

బలిజిపేట: ఖరీఫ్ ధాన్యం విక్రయించేందుకు రైతులు సన్నద్ధం చేస్తుండగా అధికారులు కొనుగోలుకు సమాయత్తమవుతున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలుకు ముందస్తు జాగ్రత్త చర్యలను అధికారులు చేపడుతున్నారు. అవసరమైన బ్యాగులు, తూకం యంత్రాలు, రవాణా, మిల్లర్ల మ్యాపింగ్, బ్యాంక్ గ్యారంటీల ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నారు. కోతలు ప్రారంభమై ధాన్యాలను విక్రయించేందుకు రైతులు సన్నద్ధం చేస్తున్నారు. మరో 10రోజులలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటవుతాయని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మిల్లర్ల జోక్యం లేకుండా వలంటీర్లను రంగంలోకి దించి వారి పర్యవేక్షణలో కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తోంది.

3.18లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ

- జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో వరిసాగు విస్తీర్ణం 1.77లక్షల ఎకరాలు
- దిగుబడి అంచనా 3.19లక్షల మెట్రిక్ టన్నులు
- ధాన్యం కొనుగోలు లక్ష్యం 3.18లక్షల మెట్రిక్ టన్నులు
- లెవీ లక్ష్యం 2లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం
- మద్దతు ధర
- సాధారణ రకం క్వింటా రూ.2,040, గ్రేడ్-ఎ రకం క్వింటా రూ. 2,060గా ప్రభుత్వం నిర్ధారించింది.

కొనుగోలు కేంద్రాలు, సిబ్బంది వివరాలు

జిల్లాలో 306ఆర్బీకేలుండగా 200 ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు నిర్ధారించారు. ప్రతి ఆర్బీకే వద్ద వీఏఏ ఒకరు, టెక్నికల్ అసిస్టెంట్ ఒకరు, గ్రేడును బట్టి వలంటీర్లు ఉంటారు. ఎ-గ్రేడ్ సెంటర్‌కు నలుగురు, బీ, సీ గ్రేడ్లకు ముగ్గురేసి వంతున వలంటీర్లు ఉంటారు. మిల్లు దగ్గర ఇద్దరు కస్టోడియన్లు వంతున 190మంది కస్టోడియన్లను నియమించారు. 10లక్షల వరకు గన్నీలు సిద్ధంగా ఉన్నాయి. ఇంకా అవసరమైతే గన్నీలను తెప్పించి రైతులకు అందిస్తారు. రైతులు గన్నీలు కొనుక్కుంటే వారికి ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుంది.

సమస్యల నివారణకు నంబర్లు

రైతులకు ఎటువంటి సమస్యలు, సందేహాలు ఉన్నా టోల్‌ఫ్రీ 1902, కంట్రోల్ రూమ్ 8978975284 నంబర్లకు ఫోన్ చేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

క్లస్టర్ వ్యవస్థకు నాంది

- మిల్లర్ల ప్రమేయాన్ని నియంత్రించేందుకు ఆర్బీకేలను క్లస్టర్లుగా మార్చి ధాన్యం సేకరించనున్నారు.
- క్లస్టర్‌కు ముగ్గురు వలంటీర్లు, ఒక టెక్నికల్ అసిస్టెంట్ ఉంటారు
- మిల్లు వద్ద కస్టోడియన్‌ను నియమిస్తారు
- రైతుల వద్దకు వలంటీర్లు వెళ్లి కొనుగోలు చేసే ధాన్యాన్ని పరిశీలిస్తారు.
- ప్రభుత్వం సూచించిన ప్రమాణాలు సక్రమంగా ఉంటే టెక్నికల్ అధికారి సహాయంతో కొనుగోలు చేస్తారు.
- ధాన్యాన్ని ఎనాలసిస్ చేసే సమయంలో కొనుగోలు, అన్‌లోడ్ చేసే రైస్‌మిల్ ప్రాంతాల్లో ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి
- కొనుగోలు చేసిన ధాన్యాన్ని చివరగా మిల్లర్ల వద్ద ఉన్న కస్టోడియన్‌కు అప్పగిస్తారు.
- కస్టోడియన్ ఆ ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగిస్తారు.
- ధాన్యంకొనుగోలు ప్రక్రియలో వలంటీర్లతో పాటు టెక్నికల్ అధికారి, కస్టోడియన్‌కు శిక్షణ పూర్తి.

ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు

రైతులు పండించిన ధాన్యాన్ని నిర్ధారించిన ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తాం. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు. కొత్త విధానంలో వలంటీర్లు కొనుగోలు చేసిన ధాన్యాలను యాప్‌లో అప్‌లోడ్ చేసి పంపుతారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. వారి వద్దకు వెళ్లి వలంటీర్లు కొనుగోలు చేస్తారు.

ఎం.దేవులానాయక్, సివిల్ సప్లయిస్, డీఎం, పార్వతీపురం మన్యం జిల్లా

నైతిక విలువలతో కూడిన విద్యనభ్యసించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఉమ

- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు జి.ఉమ

సాలూరు: విద్యార్థులు నైతిక విలువలతో కూడిన విద్యనభ్యసించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు జి.ఉమ హితవు పలికారు. ఈ మేరకు పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలికల ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆమె పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని దానికి విద్యే సూత్రమని అన్నారు. లక్ష్యాలను ఏర్పాటుచేసుకుని ప్రణాళికాబద్ధంగా చదివి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు.గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ తదితర అంశాల గురించి విద్యార్థినులకు వివరించారు. అనంతరం పాఠశాలలో వసతులను పరిశీలించారు. తరువాత పట్టణంలోని రామాకాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి గర్భిణులు, బాలింతలు, చిన్నారులతో మాట్లాడారు. అలాగే వైటీసీని సందర్శించి గర్భిణులకు నిర్వహించిన సామూహిక సీమంతంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చైల్డ్‌రైట్స్ ప్రొటెక్షన్ జిల్లా అధికారి రమణ, డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీ, ఎంఈఓ మల్లేశ్వరరావు, ఐసీడీఎస్ పట్టణ, రూరల్ సీడీపీఓలు సత్యవతి, సుగుణ, ప్రిన్సిపాల్ పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో మెట్టవలస యువకుడి ప్రతిభ

- జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



మెడల్స్, సర్టిఫికెట్లతో బొబ్బిలి సతీష్

బొబ్బిలి రూరల్: 42వ ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలలో మండలంలోని మెట్టవలసకు చెందిన బొబ్బిలి సతీష్ విశేష ప్రతిభ కనబరిచాడు. ఇటీవల విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో 4గీ100 రిలే పోటీల్లో బంగారు పతకం సాధించాడు. అలాగే 100మీటర్ల పరుగుపోటీలో వెండిపతకం, 200మీటర్ల పరుగు పోటీలో వెండిపతకం, లాంగ్ జంప్‌లో కాంస్యపతకం సాధించి, సత్తా చాటాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12,13,14తేదీలలో వెస్ట్‌బెంగాల్‌లో జరగనున్న జాతీయస్థాయి క్రీడాపోటీలకు సతీష్ ఎంపికయ్యాడు. కోచ్ రావు శ్రీనివాసరావుతో పాటు సతీష్‌ను బుధవారం పలువురు ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయిలో విజేతగా నిలిచిన సతీష్, జాతీయస్థాయిలో కూడా విజేతగా నిలిచి, రాష్ట్రానికి, ఈ ప్రాంతానికి గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు.

కిలోన్నర గంజాయి పట్టివేత

విజయనగరం క్రైమ్: గంజాయి అమ్మకాలు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను టూటౌన్ పోలీసులు స్థానిక వైఎస్ఆర్ నగర్ జంక్షన్ సమీపంలో బుధవారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కొండకరకాం వైఎస్ఆర్ నగర్ జంక్షన్ వద్ద గంజాయి పట్టుకుని వెళ్తున్న వైఎస్ఆర్‌నగర్‌కు చెందిన చలుమూరు మోహనసాయి మారుతి, మల్లిబోయిన మురళీకృష్ణలను టూటౌన్ ఎస్సై షేక్ శంకర్, ఎమ్మార్వో బంగార్రాజులు పట్టుకుని అరెస్టు చేశారు. వారి నుంచి కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతగిరి మండలానికి చెందిన బిశాయి దేముడుబాబుకు ఫోన్‌పే ద్వారా రూ.9వేలు పంపిస్తే, ఆయన వచ్చి గంజాయి ఇచ్చినట్లు నిందితులు పేర్కొన్నారని చెప్పారు. అయితే అనంతగిరి మండలానికి చెందని దేముడు బాబు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ సీహెచ్ లక్ష్మణరావు తెలిపారు.

400 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న సారాతో ఎస్ఈబీ సిబ్బంది

పార్వతీపురం టౌన్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర పట్టణ సరిహద్దుల్లో బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టి 400 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు నిర్వహించిన దాడుల్లో పార్వతీపురం పట్టణానికి చెందిన పాలకొండ కార్తీక్, వెలగాడ చిన్నలు ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా సారా తరలిస్తుండగా వారి దగ్గర నుంచి 400 లీటర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారు ఒడిశా రాష్ట్రానికి చెందిన ముత్యాలు వద్ద సారా కొనుగోలు చేసి పార్వతీపురం పట్టణంలోని కొత్తవలసకు చెందిన బొమ్మలి సురేష్ కు అప్పగించేందుకు రవాణా చేస్తున్నట్లు తెలిపారు. కార్తీక్, చిన్నలపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం పార్వతీపురం జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచామన్నారు. మరో ఇద్దరు నిందితులు ముత్యాలు, బొమ్మాలి సురేష్‌లు పరారీలో ఉన్నారని వారిని సాధ్యమైనంత త్వరలో పట్టుకుంటామని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై శేఖరం, సిబ్బంది పాల్గొన్నారు.

బిందుసేద్యంతో రైతులకు అధిక ప్రయోజనాలు

- ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ



ఏఆర్ పేటలో రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ

జామి: బిందుసేద్యంతో రైతులకు అధికప్రయోజనాలు కలుగుతాయని ఏపీఎంఐపీ (ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్) పీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు బుధవారం మండలంలోని అన్నంరాజుపేట గ్రామంలో రైతులకు మైక్రో ఇరిగేషన్ వల్ల రైతులకు ప్రయోజనాలు, పంట దిగుబడులు తదితర అంశాలపై ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 4,500 హెక్టార్‌లలో సూక్ష్మబిందు సేద్యం అందించడానికి లక్ష్యమని చెప్పారు. జామి మండలంలో 160 ఎకరాలకు సంబంధించి ఈ పరికరాలు అందించడానికి లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఒక్కో రైతు భరోసా కేంద్రానికి 20ఎకరాలకు సంబంధించి అందించనున్నట్లు చెప్పారు.ఈ నెలాఖరులోగా రైతులు బిందుసేద్య పరికరాలకు సంబంధిత రైతు భరోసా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఐదు ఎకరాల లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై ఈ పరికరాలు అందిస్తున్నట్లు చెప్పారు. 5ఎకరాలు పైబడిన వారికి 50శాతం రాయితీ ఉంటుందన్నారు. నీటి సదుపాయం కలిగిన రైతులు మాత్రమే రాయితీకి అర్హులన్నారు. కార్యక్రమంలో ఏఓ కిరణ్ కుమార్, గ్రామ సర్పంచ్ సీహెచ్.సూరిబాబు, పలువురు వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయండి



వార్డు మహిళా పోలీసుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మోహనరావు

- డీఎస్పీ మోహనరావు

రాజాం సిటీ: ఇటీవల అధికమవుతున్న సైబర్ నేరాలు, లోన్‌యాప్‌లపై గ్రామాల్లో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని బొబ్బిలి డీఎస్పీ బి.మోహనరావు సూచించారు. ఈ మేరకు బుధవారం రాజాం టౌన్ సర్కిల్ కార్యాలయంలో వార్షిక తనిఖీ చేపట్టారు. స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించిన అనంతరం క్రైం రేటు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని, రాత్రి సమయాల్లో గస్తీ మరింత పెంచాలని, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని సీఐ కె.రవికుమార్, సిబ్బందికి డీఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా మండలంలోని సచివాలయ మహిళా పోలీసులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణమే తమకు తెలియజేయాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించకూడదని హితవు పలికారు. కార్యక్రమంలో రూరల్ సీఐ డి.నవీన్‌కుమార్, ఎస్సైలు వీబీ రామకృష్ణారావు, పి.నీలావతి, సిబ్బంది పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ. 519.00
శ్రీకాకుళం	రూ. 519.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	52,640-00
బంగారం(22సి. 10గ్రా.)	48,260-00
వెండి (కిలో)	67,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

పోలవరం ఎడమకాలువపై గ్రామసభలు



వేపాడ: కరకవలస గ్రామసభలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శన దొర



గజపతినగరం: రైతులతో సమావేశంలో పాల్గొన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మలత

వేపాడ: మండలంలోని కరకవలస, పెదకృష్ణరాజపురం గ్రామాల్లో పోలవరం ఎడమ కాలువ నిర్మాణంపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శన దొర బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణానికి సేకరించిన భూములకు సంబంధించి రైతుల అంగీకారం కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎస్.కోట నియోజకవర్గంలోని 3 గ్రామాల్లో 2,035 ఎకరాలకు కొత్తవలస, ఎల్.కోటలో గ్రామసభలు పూర్తి చేశామని, వేపాడలో గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఎస్‌కోట మండలంలో నిర్వహించాల్సి ఉందని చెప్పారు. వేపాడ మండలంలోని కరకవలసలో 60 మంది రైతుల నుంచి 46 ఎకరాలు సేకరించామని చెప్పారు. రైతులకు ఎటువంటి అనుమానాలున్నా గ్రామసభల్లో నివృత్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణంరాజు, ఆర్ఐ రామలక్ష్మి, ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు న్యాయం

గజపతినగరం: వ్యవసాయరంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రతి రైతు మూడురకాల పంటలు పండించేందుకు సాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందని దానికి రైతులు అంతా సహకరిస్తే పనులు ప్రారంభిస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మలత తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ముచ్చర్ల, జిన్నాం గ్రామాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. సుజలస్రవంతి కోసం రైతులు అంతా ముందుకు రావాలని కోరారు. ఇప్పటికే చాలా చోట్ల భూములు సేకరించామని త్వరలో పనులు చేపడతామన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం అన్యాయం చేయదని వారికి అక్కడి ప్రభుత్వ విలువను రెండున్నర రెట్లు పరిహారం అధికంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని, రైతులందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ముచ్చర్ల, జిన్నాం గ్రామాల సర్పంచ్‌లు గార సూర్యకుమారి, యిజ్జిరోతు కళావతిలతో పాటు యిజ్జిరోతు రామునాయుడు, యిజ్జిరోతు రమణ, వీఆర్‌ఓ రాఘవ, పలువురు రైతులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

తమిళనాడు ప్రమాదంలో మరో వ్యక్తి మృతి



సుతాపల్లి రామకృష్ణ (ఫైల్)

సాలూరు: తమిళనాడు రాష్ట్రంలో పొల్లూరు రైల్వే వంతెన వద్ద మంగళవారం వేకువజామున 3 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన మరో వ్యక్తి సుతాపల్లి రామకృష్ణ మరణించాడు. తొలుత ప్రమాదంలో తీవ్ర గాయాలై చెన్నై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన బుధవారం మరణించినట్లు సమాచారం వచ్చింది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా ఈ ప్రమాదంలో మంగళవారం మరణించిన బొన్నాడ శ్రీనివాసరావు మృతదేహం బుధవారం పట్టణానికి చేరుకుంది. కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు భారీగా తరలిరాగా వారి అశ్రునయనాల మధ్య శ్రీనివాసరావు అంత్యక్రియలు పూర్తిచేశారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని వృద్ధుడు..



సన్యాసిరావు మృతదేహం

గంట్యాడ: మండలంలోని కరకవలస గ్రామానికి చెందిన సన్యాసిరావు(65) మంగళవారం రాత్రి విజయనగరం నుంచి తన గ్రామానికి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వస్తుండగా ఎదురుగా రామవరం నుంచి విజయనగరం వైపు పల్సర్ బైక్‌పై వస్తున్న ఓ బాలుడు ఢీకొట్టడంతో కింద పడిన సన్యాసిరావు తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే 108 అంబులెన్సులో విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

క్లుప్తంగా

ఆర్థిక సాయం



బాధితులకు వంటసామగ్రి, నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: మండలంలోని ముంజేరు పంచాయతీ పిట్టపేట గ్రామానికి చెందిన అగ్ని ప్రమాద బాధితులు బైరెడ్డి సూరప్పన్న, రాములప్పడు కుటుంబ సభ్యులను ఎంపీపీ సలహాదారు, వైఎస్సార్‌సీపీ మండల కన్వనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి బుధవారం పరామర్శించారు. అనంతరం ఒక్కో బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం ప్యాకెట్లు, దుస్తులు, వంటపాత్రలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడిక నూకరాజు, పిగుడు రాంబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక రేపు

భోగాపురం: త్వరలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న సీఎం కప్ ప్రైజ్‌మనీ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలకు సంబంధించి నెల్లిమర్ల నియోజకవర్గ స్థాయి (బాలురు, బాలికలు) క్రీడాకారుల ఎంపికలను శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ వాలీబాల్ ఇన్‌చార్జ్ నాగన్న బుధవారం ఒక ప్రటనలో తెలిపారు. 17 సంవత్సరాలు దాటిన బాల, బాలికలు ఈ టోర్నమెంట్‌కు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు తీసుకు రావాలని సూచించారు.

అయ్యప్పభక్తులకు అల్పాహారం



అయ్యప్పస్వాములకు అల్పాహారం వడ్డిస్తున్న భక్తులు

విజయనగరం: నగరంలోని పూల్‌బాగ్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో కార్తీకమాసం సందర్భంగా ప్రతి బుధవారం ఆకుపూజ నిర్వహించడంతో పాటు దీక్షాపరులకు అల్పాహారం అందజేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కట్టమూరి శంకరరావు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వస్తున్న అయ్యప్ప భక్తులకు కోసం అల్పాహారం అందజేస్తున్నట్లు చెప్పారు. ఆలయ అభివృద్ధికి భక్తులు సహకరించాలని కోరారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

విజయనగరం టౌన్: క్రీస్తు బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమని 47వ డివిజన్ కార్పొరేటర్ పట్నాన పైడిరాజు అన్నారు. ఆల్ ఇండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐటీసీసీ) వ్యవస్థాపకుడు పీడీ సుందరరావు జన్మదిన వేడుకల్లో భాగంగా బుధవారం స్థానిక కంటోన్మెంట్ బాప్టిస్ట్ చర్చి కమ్యూనిటీ హాల్‌లో నిరుపేదలకు నిత్యావసర సరుకుల, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం కార్పొరేటర్‌ను కౌన్సిల్ సభ్యులు సత్కరించారు. ఏఐటీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు పి.జీవన్‌బాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ రవికుమార్, అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అప్పారావు, ప్రధానకార్యదర్శి రవిచంద్రదాస్, సహాయ కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు



మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ నరసింహరాజు

చీపురుపల్లి: పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్‌ఐ వి.నరసింహరాజు బుధవారం తనిఖీలు చేశారు. దుకాణాల్లో మద్యం నిల్వలు, రికార్డులను, విక్రయాల్లో నిబంధనలు పాటిస్తున్నారో లేదో పరిశీలించారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం కల్తీకి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని చెప్పారు. నిబంధనలు ప్రకారం విక్రయాలు సాగిస్తున్నారని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

సీఎం జగన్ అందరివాడు...

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



గొల్లపేటలో లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

డెంకాడ: అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరివాడని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని అక్కివరం పంచాయతీ గొల్లపేట, కందిబొర్రవాని కల్లాలు, తదిర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల ఎంతెంత లబ్ధి చేకూరినదీ వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అప్పలనాయుడు మాట్లాడుతూ, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్న ఆకాంక్షతో ఎన్ని విపత్కర పరిస్థితులు ఎదురైనా ముఖ్యమంత్రి జగనన్న సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాడని చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే డబ్బు జమ చేస్తున్నారని తెలిపారు. విడితలవారీగా డ్వాక్రా రుణమాఫీ డబ్బులు అందిస్తున్నారని చెప్పారు. రైతులకు రైతు భరోసా అందజేస్తూ అండగా నిలుస్తున్నాడన్నారు. ఇళ్లు లేని పేదలకు జగనన్న కాలనీల ద్వారా ఇంటి స్థలంతో పాటు ఇంటిని మంజూరు చేశారన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి గడప వద్దకే ప్రభుత్వ పాలన తీసుకువచ్చిన ధీశాలి జగనన్న అని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్ కంది కిరణ్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు బాలి సత్యనారాయణ, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పతివాడ సత్యనారాయణ, పలువురు నాయకులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ ప్రారంభించిన ఎమ్మెల్యే బడ్డుకొండ



విద్యుత్ లైన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ పతివాడవారి కళ్లాల వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్‌ను నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్ కంది కిరణ్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు బాలి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాల్సిందే..



విద్యార్థులకు సైబర్ మోసాల పట్ల అవగాహన కల్పిస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు

- వన్‌టౌన్ సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: ఇటీవల కాలంలో తరచూ సైబర్ మోసాలు చోటు చేసుకుంటున్నాయని.. వాటిని నిరోధించాలంటే అవగాహన ఏర్పరచుకోవాలని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అన్నారు. తోటపాలెంలోని ఓ ప్రైవేట్ పాఠశాలతో పాటు పద్మావతీనగర్ కాలనీలో బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెల్‌ఫోన్ ప్రతి ఒక్కరిచేతిలో అవసర వస్తువుగా మారిపోయిందన్నారు. చిన్నపాటి మెసెజ్‌లు వచ్చినా కనీసం ఆలోచన చేయకుండా వాటిని ఓపెన్ చేయడం వల్ల సైబర్ మోసగాళ్ల వలలో చిక్కుకుంటున్నామన్నారు. మోసపోయిన తర్వాత పోలీసులను ఆశ్రయించినా ఫలితం ఉండదని చెప్పారు. అదేవిధంగా దిశా యాప్, లోన్‌యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై విజయ్ , తదితరులు పాల్గొన్నారు.

సినీ నటుడు కృష్ణ మృతిపై సంతాపం

విజయనగరం లీగల్: సూపర్ స్టార్ ఘట్టమనేని కృష్ణ మృతిపై స్థానిక న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు. జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదుల సంఘ సభ్యులు ఐ .సురేష్, ధవళ శివరాం బుధవారం మాట్లాడుతూ, సినీ రంగానికి కృష్ణ అందించిన సేవలు మరువలేనివన్నారు. ఆ కుటుంబంలో ఒకే ఏడాది ముగ్గురు మరణించడం మహేష్‌కుటుంబానికి తీరని లోటన్నారు. పల్లా రవికుమార్‌యాదవ్, కూరెళ్ల శ్రీనివాస్, ఆకెళ్ల రాంమూర్తి, ప్రవీణ్ పాల్గొన్నారు.

తీరనిలోటు

విజయనగరం టౌన్: తెలుగు సినీ నటుడు కృష్ణ మృతి కళారంగానికి తీరని లోటని జిల్లా అక్కినేని ఫ్యామిలీ ఫ్యాన్స్ ప్రతినిధులు కంటుభుక్త దుర్గాప్రసాద్, అంకం కిరణ్, ధారా వెంకట్, నాగేష్ తదితరులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్కినేని కుటుంబానికి, కృష్ణ కుటుంబానికి మంచి సాన్నిహిత్యం ఉండేదని, తెలుగు సినీ పరిశ్రమకు కృష్ణ చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివన్నారు.

పథకాల మంజూరు బాధ్యత అధికారులదే..

గంట్యాడ: సంక్షేమ పథకాలను అర్హులందరికీ మంజూరు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేలా చూడాలని, సకాలంలో బిల్లులు చెల్లించాలని అన్నారు. సచివాలయాలను తరచూ సందర్శించి ప్రజలకు సేవలు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ పరిశీలించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలకు సిఫార్సు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని, రైతుల నుంచి ప్రతీ గింజా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశానికి ఐసీడీఎస్ పీఓ కాకుండా సూపర్ వైజర్ రావడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి సీడీపీఓ హాజరుకాకుంటే సహించేది లేదని హెచ్చరించారు. మండల ప్రత్యేక అధికారి మురళీకృష్ణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ భానోజీరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ పాల్గొన్నారు.

శ్మశానవాటిక నిర్మాణాల పరిశీలన



శ్మశానవాటిక నిర్మాణాలపై ఎం బుక్‌ను పరిశీలిస్తున్న సీఆర్‌డీ రాష్ట్ర కమిటీ సభ్యులు

పూసపాటిరేగ: మండలంలోని కుమిలిలో ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మిస్తున్న శ్మశానవాటికల్లో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు రాష్ట్ర గ్రామణాభివృద్ధి శాఖ కమిషనర్ నియమించిన కమిటీ బుధవారం గ్రామానికి చేరుకుని పనులు పరిశీలించారు. అమరావతి నుంచి వచ్చిన ప్రత్యేక కమిటీలో సీఆర్‌డీ వింగ్ సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి వైవీవీ వరప్రసాద్, సోషల్ ఆడిటర్ నాగరాజు, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు డి. కల్యాణచక్రవర్తి, బి.రాములు ఉన్నారు. పనులు పరిశీలించి, కొలతలు వేశారు. ఎం. బుక్ రికార్డు నిర్వహణపై ఏపీఓ కనకరాజును ప్రశ్నించారు. ఎక్కడా లేని సమస్య పూసపాటిరేగ మండలంలోనే ఎందుకు వచ్చింది.. పనులు పూర్తి చేయకుండా బిల్లులు ఎందుకు జనరేటర్ చేశారని ప్రశ్నిస్తూ, వివరాలు అడిగి తెలుసుకున్నారు. విచారణ నివేదికను సీఆర్‌డీ కమిషనర్‌కు అందజేస్తామన్నారు.

ఉన్నత లక్ష్యాలతో చదవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీకర్

- ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీకర్

విజయనగరం పూల్‌బాగ్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పి. శ్రీకర్ పిలుపునిచ్చారు. కలెక్టర్ సూర్యకుమారి ఆదేశాల మేరకు ఎస్‌బీసీసీ ఆధ్వర్యంలో స్థానిక గురుజాడ పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నతనం నుంచే లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని సూచించారు. తాను ఖరగ్‌పూర్ ఐఐటీలో కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ డిగ్రీ పూర్తి చేశానని, అనంతరం గ్రూప్ వన్ ఎగ్జామ్ రాసి డిప్యూటీ కలెక్టర్ పోస్టుకు ఎంపికైనట్లు తెలిపారు. పార్వతీపురం జిల్లా పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎంవీఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ, విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సామాజిక పరివర్తన, మార్పు, సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయకర్త బి.రామకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో సుస్థిర లక్ష్యాలు సాధించేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఈ లక్ష్యాల సాధనకు బాల్య వివాహాలు, రక్తహీనత వంటి అంశాలు అవరోధాలుగా ఉన్నాయని, వీటిని పారదోలేందుకు మనందరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ ఎం.స్వరూపారాణి, ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్, రమేష్, తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్ సుడిగాలి పర్యటన



మంగలవీధిలోని నగరపాలక ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం: స్థానిక పూల్‌బాగ్ ఏరియాలోని రెండు, నాలుగో డివిజన్ల పరిధిలో కలెక్టర్ ఎ. సూర్యకుమారి బుధవారం ఉదయం పర్యటించారు. ప్రభుత్వ సేవలు, ఓటు నమోదు ప్రక్రియ, ఇతర అంశాలపై స్థానికులతో మాట్లాడారు. పలువురి ఇళ్లకు స్వయంగా వెళ్లి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు, సచివాలయాల ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక మంగలవీధి కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. పర్యటనలో భాగంగా సచివాలయం –4 ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు.



సచివాలయాల ద్వారా సేవలు ఎలా అందుతున్నాయంటూ ప్రజలను అడుగుతున్న కలెక్టర్ సూర్యకుమారి

ఖాళీలు భర్తీ చేయాలి



డిమాండ్ల పత్రాన్ని అందజేస్తున్న సంఘ సభ్యులు

విజయనగరం అర్బన్: జిల్లాలో ఖాళీగా ఉన్న నాలుగో తరగతి ఉద్యోగాలను భర్తీ చేయాలని నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. స్థానిక నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ భవనంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో నాలుగో తరగతి ఉద్యోగుల సంఖ్య రోజురోజుకీ తగ్గిపోవడం వల్ల .. ఉన్నవాళ్లకు పని ఒత్తిడి పెరిగిపోతోందన్నారు. ఉద్యోగులకు సంక్షేమ సేవలను అందించాలంటే సభ్యత్వాలను పెంచాలని అభిప్రాయపడ్డారు.

సంఘ అధ్యక్షుడు మువ్వల గంగా ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీఎన్‌జీఓ జేఏసీ ఉపాధ్యక్షులు ఆనంద్‌కుమార్, బంగారునాయుడు పాల్గొన్నారు. సాధించాల్సిన డిమాండ్ల పత్రాన్ని ఎన్‌జీఓ నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి గంగి రమేష్, ఉపాధ్యక్షులు బి. జైబాబు, కోశాధికారి అప్పారావు, సహాయ కార్యదర్శి ఎం.మంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో పరిపూర్ణ వ్యక్తిత్వం

- జిల్లా ఉపాధి కల్పనాధికారిణి అరుణ



డెంకాడ: అక్కివరం మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య

విజయనగరం అర్బన్:

పరిపూర్ణ వ్యక్తిత్వానికి పుస్తక పఠనం దోహదపడుతుందని జిల్లా ఉపాధి కల్పనాధికారిణి డి.అరుణ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చూసి నేర్చుకునే దాని కన్నా పుస్తకాన్ని చదివి ఎక్కువ నేర్చుకోవచ్చని చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎన్.లలిత మాట్లాడుతూ, ఖాళీ సమయాల్లో గ్రంథాలయాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకపఠనంతో విజ్ఞానం

డెంకాడ: పుస్తక పఠనంలో విజ్ఞానం పెంపొందించుకోవచ్చని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య అన్నారు. అక్కివరం పంచాయతీలోని గొల్లపేట వద్ద ఉన్న మోడల్ స్కూల్‌లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ రచయిత్రి, రచయతల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంధ్య మాట్లాడుతూ, విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎం.ప్రమీలాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో:

డెంకాడ శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యోమ వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ వై. మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాలు చదవాలి..

విజయనగరం రూరల్: విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్ కోసం విజ్ఞానదాయకమైన పుస్తకాలను చదవాలని జిల్లా విద్యావిభాగం సమన్వయకర్త డోల మన్మథకుమార్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ద్వారపూడి గ్రామంలో జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు, భీమవరానికి చెందిన న్యాయవాది పి.ఉమాదేవి ఆర్థిక సహాయంతో పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంఘ అధ్యక్షుడు ఎస్ఎస్ఎస్ఎస్ రాజు, ప్రధాన కార్యదర్శి కె.దయానంద్, వ్యవస్థాపకుడు అబ్దుల్ రవూఫ్, మాజీ కార్యదర్శి ఆర్.బాలకృష్ణ, హెచ్ఎం రమేష్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ: శాఖా గ్రంథాలయంలో ప్రముఖులకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ మహేష్,విద్యార్థులు



విజయనగరం రూరల్: విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న మన్మథకుమార్

లక్ష్యాలు చేరుకునేందుకు సమష్టి కృషి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి

చీపురుపల్లి: ప్రభుత్వ లక్ష్యాల సాధనకు, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరువచేయడంలో అన్ని శాఖల అధికారులతో పాటు బ్యాంకర్లు సమష్టిగా కృషి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ పీడీ ఏ.కల్యాణ చక్రవర్తి అన్నారు. పట్టణంలోని స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల్లోని అన్ని బ్యాంకులు, వివిధ శాఖల అధికారులతో బుధవారం సాయంత్రం బ్యాంకర్ల కమిటీ(జేఎంఎల్‌బీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, జగనన్న తోడు, పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై వంటి పథకాల అమలులో బ్యాంకర్ల పాత్రపై చర్చించారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందజేయడంలో ముందుండాలని చెప్పారు. అధికారులు అంతా బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని, ప్రతీ శాఖ ప్రగతి చూపించు కోవాల్సిన అవసరం ఉంటుందన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ ఏ.శ్రీనివాసరావు, మైక్రో ఇరిగేషన్ పీడీ పి.లక్ష్మీనారాయణ, డీపీఎం బి.బంగారమ్మ, ఎస్‌బీఐ మేనేజర్ కె.బి.రాజేష్, వెలుగు ఏపీ జి.సీతారామయ్య, ఏపీఎం ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

సీఎం దృష్టికి ముంపు ఆలయాల సమస్య

ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ విజయరాజు వెల్లడి

దేవీపట్నం (అల్లూరి సీతారామరాజు జిల్లా): పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కారణంగా ముంపునకు గురవుతోన్న దేవాలయాల పునర్నిర్మాణం కోసం తగిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపినట్లు ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు తెలిపారు. బుధవారం ఆయన ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. తాడేపల్లిగూడెంలో మంత్రి కొట్టు సత్యనారాయణను బుధవారం కలిసినట్లు చెప్పారు. పోలవరం నిర్మాణం కారణంగా దేవీపట్నం మండలంలోని ప్రముఖ ఆలయం పోశమ్మగండితో పాటు విలీన మండలాల్లో 6 దేవాలయాలు ముంపునకు గురవుతున్నట్లు మంత్రి దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే పోశమ్మ ఆలయం సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. పోలవరం ముంపు ఆలయాల కోసం, గండిపోశమ్మ ఆలయం సంరక్షణ కోసం సీఎం దృష్టికి తీసుకువెళతామని మంత్రి చెప్పినట్లు తెలిపారు. విజయవాడలో రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మిని కూడా కలిసి పోలవరం ముంపులో ఆలయాల పరిస్థితిని వివరించినట్లు తెలిపారు. ఆలయాల పునర్నిర్మాణం కోసం మంత్రి, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఆర్బీకేలకు కంపెనీల నుంచే ఎరువుల సరఫరా

సాక్షి, అమరావతి: రైతులు కోరిన వెంటనే అందించేలా ఆర్బీకేల్లో ఎరువుల సరఫరాను పెంచాలని వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ ఎరువుల కంపెనీలకు చెప్పారు. ఆయన బుధవారం మంగళగిరిలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎరువుల కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆర్బీకేలకు కంపెనీలే నేరుగా ఎరువులు సరఫరా చేయాలని చెప్పారు. ఆర్బీకేలు ఏర్పాటు చేసిన మొదటి ఏడాదిలో 1.07 లక్షల టన్నుల ఎరువులను రైతులకు సరఫరా చేయగా, రెండో ఏడాది 3.82 లక్షల టన్నులు అందించినట్టు వివరించారు. మూడో ఏడాది 5 లక్షల టన్నుల సరఫరా లక్ష్యంగా నిర్దేశించామని, ఇప్పటికే 2 లక్షల టన్నులు రైతులకు అందించామని తెలిపారు. అన్ని ఆర్బీకేలకు రిటైల్ లైసెన్సులు మంజూరు చేసి మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువుల సరఫరాకు చర్యలు తీసుకున్నామన్నారు. సరఫరాలో ఆలస్యాన్ని నివారించేందుకు పోర్టు నుంచి లేదా కంపెనీల నుంచి నేరుగా పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు. ఈ ప్రతిపాదనకు కంపెనీల ప్రతినిధులు అంగీకరించారు.

ఎన్‌జీ రంగా వర్సిటీ సేవలు దేశానికి అవసరం

దేశంలో 11వ స్థానంలో ఎన్జీ రంగా వర్సిటీ
- కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్
- అధ్యాపకులు, విద్యార్థులతో చర్చాగోష్టి


కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి, మంత్రులు కాకాని గోవర్ధన్‌రెడ్డి, అంబటి రాంబాబు

తిరుపతి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్‌లో సాగయ్యే వివిధ పంటలకు నూతన వంగడాలు రూపొందించడం, కొత్త సాంకేతికతను అందించడం, దేశ ఆహార భద్రతను సాధించడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సేవలు దేశానికి ఎంతో అవసరమని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చెప్పారు. తిరుపతిలోని వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో బుధవారం వీసీ డాక్టర్ ఆదాల విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన అధ్యాపకులు, విద్యార్థులతో చర్చాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని 74 వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ 11వ స్థానంలో నిలవడంలో అధికారులు, శాస్త్రవేత్తలు, అధ్యాపకుల పాత్ర కీలకమని చెప్పారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, శాస్త్రవేత్తల కృషి ఫలితంగా దేశం ఆహారధాన్యాల ఉత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించడమేగాక ఆహారధాన్యాలు, వివిధ పంట ఉత్పత్తులను ఎగుమతి చేయగలుగుతోందన్నారు.

వరిసాగు విస్తీర్ణంలో సగం సాగు ఈ వర్సిటీ రూపొందించిన విత్తనాలే..

వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన వరి విత్తనాలు బి.పి.టి-5204 (సాంబమసూరి), స్వర్ణ, విజేత, వేరుసెనగ విత్తనాలు కె-6, ధరణి వంటి రకాలు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయని చెప్పారు. దేశంలో వరిసాగులో దాదాపు సగం విస్తీర్ణంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన విత్తన రకాలే సాగవుతున్నట్లు తెలిపారు. దేశంలో మొదటిసారిగా వ్యవసాయ విద్యలో గ్రామీణ అనుభవ పథకాన్ని ప్రవేశపెట్టడం, వ్యవసాయరంగంలో డ్రోన్ల వినియోగం వంటి ఆవిష్కరణలు, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను అమలు చేయడం ద్వారా వ్యవసాయ రంగంలో 14.5 శాతం వృద్ధి సాధించినట్లు చెప్పారు. ఇటీవల కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రకటించిన గౌరవ డాక్టరేట్‌ను మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అంబటి రాంబాబు, వర్సిటీ వీసీ డాక్టర్ ఆదాల విష్ణువర్ధన్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు పి.వి.మిథున్‌రెడ్డి, డాక్టర్ ఎం.గురుమూర్తి, ఎస్.రెడ్డప్ప, శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ వి.పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'పై ప్రత్యేక దృష్టి

- ట్రయిల్‌రన్ సమర్థంగా నిర్వహించండి
- క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు, సమస్యల్ని ఎప్పటికప్పుడు గుర్తించండి
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రజిని


విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న మంత్రి రజిని, ప్రభుత్వ సలహాదారు సజ్జల

సాక్షి, అమరావతి/లబ్బీపేట (విజయవాడ తూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ ట్రయిల్ రన్‌ను సమర్థంగా నిర్వహించి క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యలు, ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అధికారులను ఆదేశించారు. తద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు ఏం చేయాలనే దానిపై నిరంతరం కసరత్తు చేయాలన్నారు. మంగళగిరి ఏపీఐఐసీ టవర్స్‌లోని తన కార్యాలయంలో బుధవారం వైద్య శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. గత నెల 21 నుంచి ఫ్యామిలీ డాక్టర్ ట్రయిల్ రన్ ప్రారంభమైందని తెలిపారు. దీనికి ప్రజల నుంచి లభిస్తున్న స్పందన, వైద్యుల నుంచి వస్తున్న సూచనలు తదితర వివరాలను వివరించారు. మూడు వారాల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా 4,733 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు రెండుసార్లు 104 మొబైల్ మెడికల్ యూనిట్ (ఎంఎంయూ) వాహనాలు వెళ్లాయని, సిబ్బంది గ్రామాలకే వెళ్లి వైద్య పరీక్షల సేవలు అందించారని పేర్కొన్నారు. మరో 4,267 విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు 104 ఎంఎంయూ వాహనాలు ఒకసారి వెళ్లాయని వివరించారు.

గ్రామాలకే వైద్యులు వెళ్లడం గొప్ప విషయం

మంత్రి రజిని మాట్లాడుతూ.. ఫ్యామిలీ డాక్టర్ విధానానికి సంబంధించి తాను స్వయంగా ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నానని, వారి నుంచి అద్భుతమైన స్పందన కనిపిస్తోందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 97,011 మంది బీపీ బాధితులు, 66,046 మంది సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్టు చెప్పారు.

వైద్య విద్యార్థులకు రీసెర్చ్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ

వైద్య రంగానికి సీఎం జగన్ అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి రజిని, ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీలో బుధవారం అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు రీసెర్చ్ స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. మంత్రి రజిని మాట్లాడుతూ వైద్యశాఖలో ఒక్క ఖాళీ కూడా లేకుండా పెద్దఎత్తున పోస్టులు భర్తీ చేశామన్నారు. సజ్జల మాట్లాడుతూ.. వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అండర్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులను సైతం పరిశోధనల్లో ప్రోత్సహించడం ప్రశంసనీయమన్నారు. ఈ రీసెర్చ్ ఫలితాలు గ్రామీణ ప్రజలకు సైతం అందాలన్నారు.

కుట్రలతో అభివృద్ధిని అడ్డుకోలేరు

గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్



రాయచోటి: ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, జగనన్న ఇళ్ల నిర్మాణాల యజ్ఞాన్ని అడ్డుకోలేరని గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, నవాజ్ బాషా, ద్వారకనాథ్‌రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎవరు పడితే వారు పాదయాత్ర చేయడం సరికాదని, అందులో లోకేశ్ పాదయాత్ర చేస్తానంటూ ప్రకటించడం హాస్యాస్పదమన్నారు.

పట్టు పెంపకంలో రైతులకు 'ఉపాధి' ఊతం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పట్టు రైతులకు ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తోంది. ఉపాధి హామీ పథకం ద్వారా మల్బరీ తోటల పెంపకానికి ఎకరాకు రూ. 11,000, పట్టు పురుగుల పెంపకం షెడ్ల నిర్మాణానికి రూ. 3 లక్షల చొప్పున రైతులకు అందిస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 15 వేల ఎకరాల్లో మల్బరీ తోటల పెంపకంతో పాటు వివిధ జిల్లాల్లో 500 పట్టు పురుగుల పెంపకం షెడ్ల నిర్మాణానికి లబ్ధిదారు రైతుల గుర్తింపునకు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోన శశిధర్ జిల్లా కలెక్టర్లు, డ్వామా పీడీలకు ఆదేశాలు జారీ చేశారు.

అవినీతి దురుద్దేశాలపై
దర్యాప్తు చేయొద్దా?

- టీడీపీ నేత వర్ల న్యాయవాదికి 'సుప్రీం' సూటి ప్రశ్న
- విధాన నిర్ణయాల్లో ప్రజాధనం వృథా, దుర్వినియోగం లాంటివి ఉంటే దర్యాప్తు వద్దా?
- అమరావతి, ఫైబర్‌నెట్ స్కాంలపై రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం
- పక్షపాతం ఉండకూడదనే సీబీఐ దర్యాప్తు కోరుతున్నాం
- కొందరు వ్యక్తుల ఫిర్యాదు మేరకే ఎఫ్‌ఐఆర్‌లు
- గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించవచ్చు
- నిజ నిర్ధారణపై నిషేధం ఉండదు
- ధర్మాసనానికి నివేదించిన రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది సింఘ్వీ
- విచారణ నేటికి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ''అవినీతి చేయాలనే దురుద్దేశాలపై దర్యాప్తు చేయకూడదా? ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో ప్రజాధనం వృథా, దుర్వినియోగం లాంటివి ఉంటే దర్యాప్తు వద్దా..?'' అని టీడీపీ నేత వర్ల రామయ్య తరపు న్యాయవాదిని సుప్రీంకోర్టు సూటిగా ప్రశ్నించింది. అమరావతి భూ కుంభకోణం, ఫైబర్‌నెట్ కుంభకోణాలపై విచారణను నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎం.ఆర్. షా, జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు వినిపిస్తూ కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సుల మేరకు ఒక పోలీసు స్టేషన్‌లో సిట్‌ను ఏర్పాటు చేసినట్లు నివేదించారు. నిజ నిర్ధారణ పూర్తి చేశామని, పక్షపాతం ఉండకూడదనే సీబీఐ దర్యాప్తు కోరుతున్నామన్నారు. కొందరు వ్యక్తులు ఫిర్యాదు చేయడంతో ఎఫ్‌ఐఆర్‌లు దాఖలయ్యాయని, ప్రభుత్వం నేరుగా నమోదు చేయలేదని తెలిపారు. విధాన నిర్ణయాలు, టెండర్, కాంట్రాక్టులకు సంబంధించిన కేసుల్లో సారూప్యం చూడాలని కోరారు. కోర్టు సమీక్ష అధికారాలను ప్రభుత్వాల సమీక్ష అధికారాలతో పోల్చలేమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా జస్టిస్ ఎం.ఆర్. షా గతంలో ఇచ్చిన ఓ తీర్పులో కొంత భాగాన్ని సింఘ్వీ చదివి వినిపించారు.

గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించవచ్చు..

రాజకీయ శత్రుత్వంతో కమిషన్ల నియామకంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనాలు పలు తీర్పులు ఇచ్చాయని సింఘ్వీ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. అమరావతి భూ కుంభకోణం, ఫైబర్‌నెట్ కుంభకోణాలపై రాష్ట్ర ప్రభుత్వం క్రిమినల్ విచారణ కాకుండా నిజ నిర్ధారణ మాత్రమే చేసిందన్నారు. ప్రభుత్వం గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించవచ్చని, నిజ నిర్ధారణపై నిషేధం ఉండదని స్పష్టం చేస్తూ ఈ మేరకు తీర్పులను ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. జగన్నాథరావు కేసులో రాజ్యాంగ ధర్మాసనం తీర్పులో కొంత భాగాన్ని చదివి వినిపించారు. రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని స్టే ఇస్తే ఇక విచారణ అధికారం రాష్ట్రానికి ఎక్కడుంటుందని, ఇలా చేయడం దర్యాప్తును ప్రాథమిక దశలోనే అడ్డుకోవడమేనన్నారు. ఎఫ్‌ఐఆర్‌పై విచారణ చేయవద్దని అనడం అవగాహన లేకపోవడమేనని, ఇది జాతీయ దర్యాప్తు సంస్థ విచారించదగిన కేసు అని పేర్కొంటూ సింఘ్వీ వాదనలు ముగించారు. సీబీఐ విచారించాలా వద్దా? అనే అంశంపై చర్చిద్దామని ధర్మాసనం పేర్కొంది.

క్రిమినల్ కేసుల కోసమే..

టీడీపీ నేత వర్ల రామయ్య తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు వినిపిస్తూ ఇది పాలనా ప్రతీకార కేసుగా అభివర్ణించారు. సిట్ ఉద్దేశం నిజ నిర్ధారణ మాత్రమే కాదని, క్రిమినల్ కేసులతో అనుసంధానానికి మార్గాలను అన్వేషించేందుకేనని ఆరోపించారు. ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో ప్రజాధనం దుర్వినియోగం, వృథా ఉంటే దర్యాప్తు చేయకూడదా? అని ఈ సందర్భంగా ధర్మాసనం ప్రశ్నించింది. ఏవైనా లావాదేవీలు దురుద్దేశపూరితంగా జరిగాయని భావిస్తే అది విచారించదగినదే కదా? అని ప్రశ్నించింది. ఎక్కడ దుర్వినియోగం జరిగిందో చెప్పకుండా నోటిఫికేషన్ ఇచ్చి సిట్ ఏర్పాటు చేశారని దవే పేర్కొన్నారు. కార్యనిర్వాహక అధికారాన్ని ఉపయోగించడం ఏకపక్షంగా ఉందన్నారు. ఎలాంటి దర్యాప్తు నివేదిక రాకుండా అలా ఎలా అంటారని ధర్మాసనం ప్రశ్నించింది. ఎంపీలు విజయసాయిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మిథున్‌రెడ్డి కూడా కేబినెట్ సబ్‌కమిటీల సమావేశానికి హాజరయ్యేవారని దవే పేర్కొన్నారు. కొందరిపై క్రిమినల్ కేసులు పెట్టాలన్న ఉద్దేశంతోనే సిట్ ఏర్పాటైందన్నారు. పాలనా చర్యలంటూ క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అనంతరం విచారణను ధర్మాసనం గురువారానికి వాయిదా వేసింది.

బొల్లినేని మెడిస్కిల్స్‌లో ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆస్పత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్‌లో హెల్త్‌కేర్ బిల్లింగ్, పేషెంట్ కేర్ రిలేషన్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ, వసతి ఇవ్వనున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ సెంటర్ హెడ్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లో జరిగే ఈ శిక్షణకు 20 నుంచి 26 సంవత్సరాల వయస్సు గల డిగ్రీ పాసైన అభ్యర్థులు అర్హులన్నారు. అలాగే ఇంటర్ పాసైన విద్యార్థులకు బీఎస్సీ, ఎంఎల్‌టీ, పారా మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 76809 45357, 91219 99654 నంబర్లను సంప్రదించాలన్నారు.

పారదర్శకంగా పరిశీలన

- ఆర్డీఓ పి.శేషశైలజ

బొబ్బిలి రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆర్డీఓ పి. శేషశైలజ బీఎల్‌ఓలు, రెవెన్యూ, ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులపై బుధవారం సమీక్షించారు. బొబ్బిలి మండలంలో 1431 దరఖాస్తులు వచ్చాయని సిబ్బంది తెలియజేయగా.. వాటన్నింటినీ త్వరగా పరిశీలించి ఓటర్ల జాబితాలో నమోదు చేయాలని ఆర్డీఓ సూచించారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమీక్ష సమావేశంలో తహసీల్దార్ ఎస్.రాజారావు, ఎన్నికల డీటీ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గుర్తించిన సమస్యలకు సత్వర పరిష్కారం చూపించాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సచివాలయ సిబ్బందికి సూచించారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీలో సచివాలయం- 3, 5 పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' పూర్తయిన నేపథ్యంలో ఆ సచివాలయాల సిబ్బందితో ఎంపీ పట్టణంలోని తన నివాసంలో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయం- 3, 5 పరిధిలోని ప్రాంతాల్లో గుర్తించిన సమస్యలపై ఆరా తీశారు. అక్కడి ప్రజలు సూచించిన సమస్యలతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించిన సమస్యలపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. సంబంధిత పనులకు తక్షణమే ఎస్టిమేషన్లు తయారు చేయాలని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గిరడ రాందాసు, ముల్లు పైడిరాజు, ఆదిబాబు, ఉమ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం

- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సేవలు విస్తృతం
- ఆధునిక పరికరాలను సమకూర్చిన ప్రభుత్వం
- వైద్యులు, సిబ్బంది, ప్రొఫెసర్ల నియామకం
- సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్‌పద్మలీల వెల్లడి



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

విజయనగరం ఫోర్ట్: జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.పద్మలీల తెలిపారు. సేవలకు అనువైన సదుపాయాలను ప్రభుత్వం సమకూర్చుతోందన్నారు. జిల్లా ఆస్పత్రి సర్వజన ఆస్పత్రిగా మారిన తర్వాత రోగులకు ఆధునిక పరికరాల సాయంతో వైద్యసేవలు అందజేస్తున్నామన్నారు. ఆస్పత్రిలో సేవల తీరు, సదుపాయాలను 'సాక్షి'కి బుధవారం వివరించారు. ఆమె మాటల్లోనే...

☛ సర్వజన ఆస్పత్రిలో ఏర్పాటుచేసే వైద్యకళాశాల విద్యార్థుల బోధనకు కొత్తగా 34 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను ప్రభుత్వం నియమించింది. పెథాలజీ, ఫోరెన్సిక్, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, గైనిక్, ఈఎన్‌టీ, బయో కెమిస్ట్రీ, ఫిజియాలజీ తదితర విభాగాలకు చెందిన ప్రొఫెసర్లు నియామకమయ్యారు.

☛ పూర్తి స్థాయిలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు వచ్చిన తర్వాత వైద్య విధాన్ పరిషత్ వైద్యులను రిలీవ్ చేస్తాం. వైద్య సేవల్లో ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో రిలీవ్ చేయలేదు. ఇన్నాళ్లూ కోడ్ రాకపోవడంతో కొత్తగా నియామకమైన సిబ్బందికి జీతాల చెల్లింపులో ఇబ్బంది ఉండేదని, ఇప్పుడు కోడ్ రావడంతో ఆ సమస్య పరిష్కారమైనట్టే.

☛ ప్రస్తుతం ఆస్పత్రిలో ఓపీ చాంబర్లు సరిపోతున్నాయి. ఒకటి, రెండు విభాగాలకు మినహా మిగిలిన వాళ్లకు సరిపోతున్నాయి. ఎక్కువ మంది వైద్యులు ఉన్న చోట ఇద్దరు వైద్యులు సర్జరీలు చేయడానికి వెళితే మిగిలిన వారు ఓపీలు చూస్తున్నారు.


డాక్టర్ పద్మలీల

☛ గతంలో కంటే ఓపీ, ఇన్‌పేషెంట్ (ఐపీ) సేవలు 5 నుంచి 10 శాతం పెరిగాయి. శస్త్ర చికిత్సలు కూడా గతంలో కంటే 10 శాతం పెరిగాయి. క్యాజువాలటీలో వైద్య సేవలు అందించేందుకు సివిల్ అసిస్టెంట్ సర్జన్లు ఐదుగురుని ప్రభుత్వం నియమించింది. అంతకు ముందు నుంచి పనిచేస్తున్నవారు ఇద్దరు ఉన్నారు. వీరి క్యాజువాలటీ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ) షిఫ్టులు వారీగా సేవలు అందిస్తున్నారు.

☛ క్యాజువాలటీకి వచ్చిన వారికి ప్రాథమికంగా చికిత్స అందించి ఎమర్జెన్సీ, ఐసీయూ, జనరల్ వార్డులకు పంపిస్తారు. డ్యూటీ మెడికల్ ఆఫీసర్ (డీఎంఓ) వార్డులకు వచ్చిన వారికి చికిత్స అందిస్తారు.

☛ సర్వజన ఆస్పత్రి ఆధునీకీకరణ పనులు 70 నుంచి 80 శాతం వరకు పూర్తయ్యాయి. సెంట్రల్ ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్ భవనం నెలఖారులోగా పూర్తివుతుంది. మిగతా పనులు కూడ శరవేగంగా జరుగుతున్నాయి.

☛ ప్రస్తుతం ఆస్పత్రికి కొత్తగా అన్‌లైజర్లు వచ్చాయి. సాంకేతిక సిబ్బంది నియామకమయ్యారు. జనరల్ డ్యూటీ అటెండర్, స్టోర్ అటెండెంట్, ఫార్మసిస్టులు, లేబ్ టెక్నీషియన్లు, లేబ్ అటెండర్లు, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, ఆఫీస్ సబార్డినేట్ తదితర పారామెడికల్ పోస్టులు 105 మందిని నియమించారు. ఇంకా 10 ఖాళీలు ఉన్నాయి. వాటికి కూడా నోటిఫికేషన్ ఇచ్చాం.

☛ కేంద్రాస్పత్రి సూపర్ స్పెషాలటీ సేవలు అయినా న్యూరో, కార్డియాలజీ సేవలు అవసరమైన వారిని మాత్రమే రిఫర్ చేస్తున్నాం. చాలా వరకు రిఫరల్స్ తగ్గించాం.

☛ వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరూ ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు పనిచేయాల్సిందే. సమయ పాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటున్నాం. రోగులకు మెరుగైన సేవలు అందించాలన్న ఏకైక లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

అటవీ సంరక్షణ నియమాలు ఉపసంహరించాలి


కొత్తబట్టివలసలో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాలు

బొబ్బిలి రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న అటవీ సంరక్షణ నియమాలను (2022) తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని గోపాలరాయుడిపేట పంచాయతీ పరిధి కొత్తబట్టివలసలో అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలుపుతూ నియామకాల కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘ జిల్లా సహాయ కార్యదర్శి పిల్లా లక్ష్మణరావు మాట్లాడుతూ, ఆదివాసీల జీవితాలను నాశనం చేస్తూ, కార్పొరేట్ సంస్థలకు అటవీ సంపద దోచిపెట్టాలనుకోవడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం నియమాలను ఉపసంహరించుకోకపోతే ఉద్యమం తప్పదన్నారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘ జిల్లా కార్యవర్గ సభ్యులు వెన్నెల వేణు, రైతు, రైతుకూలీసంఘం, ఆదివాసీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శతశాతం అక్షరాస్యతే లక్ష్యం

- ఎర్నాకులంతో పోటీగా అక్షరాస్యత కార్యక్రమాలు
- సక్సెస్ దిశగా 'చిట్టి గురువులు'
- వయోజన విద్య డీడీ సుగుణాకరరావు

రాజాం: విజయనగరం జిల్లాలో శతశాతం అక్షరాస్యత సాధనే లక్ష్యంగా కృషి చేస్తున్నామని వయోజన విద్య జిల్లా డీడీ కోట్ల సుగుణాకరరావు తెలిపారు. పట్టణంలో నూతన అక్షరాస్యత విధానంలో భాగంగా చిట్టి గురువుల కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... దేశంలో కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులం జిల్లా వలే అక్షరాస్యత శాతంలో విజయనగరం జిల్లాను ఆ స్థానంలో నిలబెట్టేందుకు ఐక్యతతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో అక్షరాస్యత శాతంలో జిల్లా ప్రస్తుతం ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. ఇటీవల నిర్వహించిన చిట్టి గురువుల కార్యక్రమంలో 95 శాతం దాటి ముందుకు వెళ్లినట్టు వెల్లడించారు. మూడు నెలల కిందట 93 శాతం ఉన్న అక్షరాస్యత ఇటీవల చేపట్టిన నూతన అక్షరాస్యత విధానం సత్ఫలితాలిచ్చినట్టు వెల్లడించారు. జిల్లాలో చిట్టి గురువుల కార్యక్రమం జూలై 20న ప్రారంభించే నాటికి జిల్లాలో 1,02,345 మంది గ్రామీణ ప్రాంతంలో, 13,810 మంది పట్టణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులుగా ఉన్నట్టు గుర్తించామన్నారు. చిట్టి గురువులు ద్వారా వీరికి అక్షరాస్యులు తీర్చిదిద్దినట్టు వెల్లడించారు. రూరల్ ప్రాంతంలోని నిరక్షరాస్యులకు ఈ నెల 13న జిల్లా వ్యాప్తంగా అసెస్‌మెంట్ పరీక్ష నిర్వహించగా 74,694 మంది పరీక్ష రాశారని చెప్పారు. 87.6 శాతంగా హాజరు నమోదైందని, పట్టణంలోని 13,810 మందికి త్వరలో ఈ పరీక్షలు ఉంటాయన్నారు. జిల్లాలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులను గుర్తించామన్నారు.


కోట్ల సుగుణాకరరావు


మొత్తం 14 వేల మంది చిట్టి గురువులు కార్యక్రమంలో పాల్గొని తమ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులకు చదువు చెప్పి అక్షరాస్యులుగా మార్చుతున్నారని చెప్పారు. 18 అక్షరాల చిట్టి గురువుల పుస్తకంతో ప్రాథమిక సాక్షరతా కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇందులో చదువుకున్న వారికి లెవెల్ 1 అసెస్‌మెంట్ పరీక్ష జరుగుతుందన్నారు. ఇందులో ఉత్తీర్ణత చెందితే లెవెల్ 2 ఉంటుందని చెప్పారు. అనంతరం లెవెల్ 3, లెవెల్ 4 పరీక్షలు ఉంటాయని చెప్పారు. వీటన్నింటిలో ఉత్తీర్ణత చెందితే ఓపెన్ టెన్త్‌కు వారిచే దరఖాస్తు చేయించి పరీక్ష పాసయ్యేలా చేస్తామన్నారు. కలెక్టర్ సూర్యకుమారి జిల్లాలో నూతన అక్షరాస్యత విధానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని చెప్పారు. ఆర్థిక అక్షరాస్యత ఉంటే డిజిటల్ విధానంలో ఆర్థిక లావాదేవీలు సులభంగా జరుపుకోవచ్చన్నారు. జిల్లాలో సాదాసీదాగా అక్షరాస్యత నమోదు చేయకుండా, ప్రతీ ఒక్కరు పూర్తిగా చదవడం, రాయడం నేర్చేలా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.

కోటదుర్గమ్మ హుండీల ఆదాయం లెక్కింపు


కానుకలు లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ హుండీల ద్వారా రూ.4లక్షల 21వేల 161 ఆదాయం సమకూరినట్టు ఈఓ వి.రాధాకృష్ణ తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ లెక్కింపు అధికారి ఎస్.రామారావు నేతృత్వంలో బుధవారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. గత నెల 10వ తేదీ నుంచి ఈ నెల 16 వరకు భక్తులు ఈ మొత్తాలను కానుకల రూపంలో అందించారని అధికారులు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ, ఇతర అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలం పట్టి కవితలు రాసిన అమ్మాయి రణక్షేత్రంలోకి అడుగుపెట్టింది.
పియానోతో సుస్వరాలు వినిపించిన అమ్మాయి ఫిరంగి ధ్వనులు వినిపించే చోట పనిచేసింది.
నూర్ ఇనాయత్‌ఖాన్ అనేది నామం కాదు నాజీలను వణికించిన శబ్దం. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో బ్రిటిష్-ఇండియా తొలి మహిళా గూఢచారి నూర్ గురించి...


నూర్ ఇనాయత్ ఖాన్

సందర్భం

స్పై ప్రిన్సెస్

● నాజీలకు చెమటలు పట్టించిన వీరనారి

నూర్ ఇనాయత్ ఖాన్ అనే పేరు చాలామందికి తెలియకపోవచ్చు. ఆమె గురించి ఈ తరానికి తెలియజేయడానికి నాటక రూపంలో ఒక ప్రయత్నం జరుగుతోంది. రెండో ప్రపంచ యుద్ధకాలంలో బ్రిటిష్ ఇండియా తరఫున నియామకం అయిన తొలి మహిళా గూఢచారి నూర్ ఇనాయత్ ఖాన్. ఆమె సాహసిక జీవితంపై రూపొందించిన 'నూర్' నాటకాన్ని ఈ నెలలో లండన్‌లోని సౌత్‌వార్క్ ప్లే హౌజ్‌లో ప్రదర్శించబోతున్నారు.

'ఒక వ్యక్తి జీవితంలో ఇన్ని మలుపులు ఉంటాయా అని ఆశ్చర్యపోయేంత జీవితం ఆమెది' అంటారు 'నూర్' నాటక రచయిత్రి అజ్మా దార్.

నూర్ వ్యక్తిగత వివరాల విషయానికి వస్తే....

తండ్రి పేరు ఇనాయత్‌ఖాన్. బాంబే ప్రెసిడెన్సీలో జన్మించాడు. పూర్వీకులు టిప్పు సుల్తాన్ వంశస్థులు. ఇనాయత్‌ఖాన్ సూఫీ గురువు. సంగీతకారుడు. 'ది సూఫీ ఆర్డర్ ఇన్ ది వెస్ట్' అనే అంతర్జాతీయ సంస్థ ద్వారా సూఫీ భావజాలాన్ని పాశ్చాత్య సమాజానికి పరిచయం చేశాడు. నూర్ తల్లి అమెరికన్. రే బేకర్ అనే ఆమె పేరు పెళ్లి తరువాత అమీనా బేగంగా మారింది.

చిన్న వయసులోనే రచయిత్రిగా తన కెరీర్ మొదలుపెట్టింది నూర్. ఇంగ్లీష్, ఫ్రెంచ్ భాషల్లో కవిత్వంతోబాటు, పిల్లల కథల పుస్తకాలను ప్రచురించింది. బుద్ధిస్ట్ జాతక కథల స్ఫూర్తితో 'ట్వంటీ జాతక టేల్స్' అనే పుస్తకాన్ని రాసింది. పిల్లల పత్రికలకు రెగ్యులర్‌గా రచనలు చేస్తుండేది. ఫ్రెంచ్ రేడియో కోసం రచనలు చేసేది.

'చైల్డ్ సైకాలజీ' చదువుకున్న నూర్ సంగీతంలో ప్రావీణ్యం సంపాదించింది. పియానో అద్భుతంగా వాయించేది.

రెండో ప్రపంచ యుద్ధం నాటి కల్లోల కాలం అది.

ఎటు చూసినా భయం రాజ్యమేలుతున్న ఆ కాలంలో కుటుంబాన్ని తీసుకొని ఇంగ్లాండ్‌కు వెళ్లాడు ఇనాయత్‌ఖాన్. మొదట పోర్ట్ సిటీ సౌత్ హాంప్టన్‌లో ఒక తత్వవేత్త దగ్గర ఆశ్రయం పొందారు.

తండ్రి చనిపోయే నాటికి నూర్ వయసు పదమూడు సంవత్సరాలు. సున్నిత స్వభావి. కొత్త వాళ్ల దగ్గరికి వెళ్లేది కాదు. చాలా తక్కువగా మాట్లాడేది. అలాంటి నూర్‌లో అనూహ్యంగా మార్పు వచ్చింది. తల్లి తరువాత ఇంటికి తానే పెద్ద. ఒకవిధంగా చెప్పాలంటే చిన్న వయసులోనే తన కుటుంబానికి పెద్ద అండగా నిలబడింది.

> శాంతివచనాలు వినపడే ఇంటి నుంచి వచ్చిన అమ్మాయి, రచయిత్రిగా గుర్తింపు పొందిన అమ్మాయి రణక్షేత్రంలో ఎందుకు పనిచేయాలనుకుంది? రెండో ప్రపంచ యుద్ధకాలంలో గూఢచారిగా ఆమె పాత్ర, ప్రాధాన్యత ఏమిటి? ఎలాంటి ప్రమాదకరమైన పరిస్థితులను ఎదుర్కొంది? ఎన్ని కష్టాలు పడింది? ఏ పరిస్థితులలో నాజీలకు చిక్కింది? ఎంత దారుణమైన చిత్రహింసలకు గురైంది?



కుమార్తెలో వచ్చిన మార్పు చూసి తల్లి ఆశ్చర్యపోయేది!

నవంబర్, 1940లో ఉమెన్స్ ఆగ్జిలరీ ఎయిర్ ఫోర్స్ (డబ్ల్యూ ఎఎఎఫ్)లో చేరి వైర్‌లెస్ ఆపరేటర్‌గా శిక్షణ పొందింది. ఆ తరువాత 'బాంబర్ ట్రైనింగ్ స్కూల్'లో చేరింది. సీక్రెట్ బ్రిటిష్ వరల్డ్ వార్-2 ఆర్గనైజేషన్ స్పెషల్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ (ఎస్‌వోయి)లో నియామకం అయింది. ప్రత్యేక శిక్షణ తీసుకొని నాజీ ఆక్రమిత ఫ్రాన్స్‌లో అండర్ కవర్ వైర్‌లెస్ ఆపరేటర్‌గా పనిచేసింది. ఈ విధులు నిర్వహించిన తొలి మహిళగా గుర్తింపు పొందింది.

నాజీ ఆక్రమిత ఫ్రాన్స్‌లో వైర్‌లెస్ ఆపరేటర్‌గా పని చేయడం అంటే చావుకు చాలా సమీపానికి వెళ్లడం. ఒళ్లు జలదరించే ఎన్నో భయానక అనుభవాలు కళ్ల ముందున్నాయి. అయినా భయపడింది లేదు.

దురదృష్టకరమైన పరిస్థితులలో నాజీలకు చిక్కి, కాన్సంట్రేషన్ క్యాంపుల్లో చిత్రహింసలకు గురై చనిపోయింది.

ధైర్యసాహసాలకు ఇచ్చే జార్జ్ క్రాస్ పురస్కారాన్ని నూర్ మరణానంతరం బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించింది.

శాంతివచనాలు వినపడే ఇంటి నుంచి వచ్చిన అమ్మాయి, రచయిత్రిగా గుర్తింపు పొందిన అమ్మాయి రణక్షేత్రంలో ఎందుకు పనిచేయాలనుకుంది? రెండో ప్రపంచయుద్ధకాలంలో గూఢచారిగా ఆమె పాత్ర, ప్రాధాన్యత ఏమిటి? ఎలాంటి ప్రమాదకరమైన పరిస్థితులను ఎదుర్కొంది? ఎన్ని కష్టాలు పడింది? ఏ పరిస్థితులలో నాజీలకు చిక్కింది? ఎంత దారుణమైన చిత్రహింసలకు గురైంది?...

ఇలాంటి సందేహాలకు 'స్పై ప్రిన్సెస్ -ది లైఫ్ ఆఫ్ నూర్ ఇనాయత్ ఖాన్' లాంటి రచనలు సవివరంగా సమాధానాలు ఇచ్చాయి. ఈ క్రమంలో తాజా నాటకం 'నూర్' అనేది మరో ముందడుగుగా చెప్పుకోవచ్చు.

బ్యూటిప్స్



- జుట్టు నిగనిగలాడుతూ మెరవాలంటే కోడిగుడ్డు సొనను, అరటి పండును బాగా కలిపి, ఆ పేస్టును తలకు పట్టించి పావుగంట ఆగి శుభ్రంగా తలస్నానం చేయాలి.
- జుట్టు బిరుసుగా ఉండి వెనకకు దువ్వడానికి వీలులేకుండా ఉంటే నీళ్ళలో కొంచం నిమ్మరసం కలిపి తలకి రాసి దువ్వండి.

సైబర్ టాక్



ప్రతీకాత్మక చిత్రం

డిజిటల్ మాధ్యమం ద్వారా ఖాతాలలోని డబ్బును దొంగిలించడానికి ఎస్సెమ్మెస్ ఫార్వర్డింగ్ యాప్‌లను ఉపయోగిస్తున్నారు మోసగాళ్లు. ఎస్సెమ్మెస్ ల ద్వారా మీ ఖాతాలో లక్షల రూపాయలు బదిలీ అవుతున్నాయనో, ఎలక్ట్రిసిటీ బిల్లు, పాన్ కార్డ్, క్రెడిట్‌కార్డ్ .. వంటివి అప్‌డేట్ చేసుకోవడానికి వివరాలను పూరింపమని వచ్చే సంక్షిప్త సందేశాల పట్ల జాగ్రత్త పడటం మంచిది.

డిజిటల్‌గా చెల్లింపుల వల్ల ప్రయోజనాలు ఉన్నాయి. అయితే ఇది ఆన్‌లైన్ మోసానికి మరింత హాని చేస్తుంది. ఆన్‌లైన్ చెల్లింపులు, డిజిటల్ లావాదేవీలు గత కొన్నేళ్లుగా జీవితాలను సులభతరం చేశాయి. మెజారిటీ కస్టమర్‌లు, చిల్లర దుకాణాలు, బడ్డీకొట్ల వాళ్లు కూడా ఈ చెల్లింపు పద్ధతులను ఇష్టపడుతున్నారు.

స్కామర్‌లు మనదేశంలోని వ్యక్తులను మోసం చేయడానికి ఎస్సెమ్మెస్ ఫార్వార్డింగ్ యాప్‌లను ఉపయోగిస్తారు. వాటిలో చాలా వరకు స్కామ్‌లు ఫిషింగ్ మోసాలకు దారితీస్తున్నాయి. అంతేకాకుండా స్కామర్‌లు అందించిన షార్ట్ లింక్‌లను బాధితులు క్లిక్ చేసిన తర్వాత మాల్వేర్ ఇన్‌స్టాల్ అయిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

స్కామర్లు ఉపయోగించేవి:
బాధితుడి నమ్మకం, అజ్ఞానం, భయం, దురాశ, అత్యవసరం.. ఇవే మోసగాళ్లకు పెట్టుబడి.

మోడల్ 1: డబ్బు క్రెడిట్
ఉదాహరణకు: మీ అకౌంట్‌లోకి రూ. 3,3000 క్రెడిట్ అవుతుంది. మీ వివరాలను తక్షణమే నమోదు చేయండి. అందుకు వెంటనే తనిఖీ చేయండి... అంటూ ఓ లింక్ ఇస్తారు. మీరు అలాంటి మెసేజ్ చదివినా కానీ, అక్కడ ఇచ్చిన లింక్‌పై క్లిక్ చేయకూడదని గుర్తు పెట్టుకోండి. ఎందుకంటే ఆ లింక్ మీ డబ్బును దోచుకోవడానికి ఒక మార్గం కావచ్చు.

మోడల్ 2: విద్యుత్ బిల్లు
నోటిఫికేషన్ ప్రియమైన కస్టమర్, మీ మునుపటి నెల బిల్లు అప్‌డేట్ కానందున ఈ రాత్రి 8:30 లకు ఎలక్ట్రిసిటీ ఆఫీస్ నుండి మీ ఎలక్ట్రిసిటీ పవర్ డిస్‌కనెక్ట్ చేయబడుతుంది. దయచేసి వెంటనే అధికారిని సంప్రదించండి 8240471159.. ధన్యవాదాలు అనే మెసేజ్ వస్తుంది.

మోడల్ 3: పాన్‌కార్డ్ అప్‌డేట్
ప్రియమైన వినియోగదారు మీ యోనో ఎస్‌బిఐ నెట్ బ్యాంకింగ్ ఖాతా ఈరోజు సస్పెండ్ చేయబడుతుంది. దయచేసి మీ పాన్ కార్డ్‌ని అప్‌డేట్ చేయండి. అందుకు ఇక్కడ లింక్ క్లిక్ చేయండి http://bit y.wr/wkx822222 అని ఉంటుంది.

మోడల్ 4: క్రెడిట్ కార్డ్ బకాయి
"ప్రియమైన కస్టమర్, దయచేసి మీ కార్డ్ బకాయి మొత్తాన్ని చెల్లించండి. మా పోర్టల్‌లో డిజిటల్ మోడ్‌లను ఉపయోగించి 0003తో ముగిసే మీ బ్యాంక్ క్రెడిట్ కార్డ్‌పై 27 86.74 లేదా కనీస మొత్తం రూ. 140/- చెల్లించండి. అందుకు http://nmc.rf /kojkBGGGG. ఇప్పటికే చెల్లించినట్లయితే ఈ సందేశాన్ని మర్చిపోండి. UPI చెల్లింపు వీడియోను bit.y/2qKYXb88888లో, VPA ID వీడియోను bit.ly.2JJQr9KKKKKలో చూడండి" అనే మెసేజ్ ఉంటుంది.

మోడల్ 5: రొమాన్స్ ఫ్రాడ్
'మీరు మీ జీవితంలో ఒంటరిగా ఉన్నారని భావిస్తున్నారా, ఒక మధురమైన కాల్ మీ కలలను సాకారం చేయగలదు, స్నేహం డేటింగ్ భాగస్వామి మీ కోసం వేచి ఉన్నారు. కాల్ చేయండి' అంటూ నెంబర్ ఇస్తారు.

మోడల్ 6: డిపాజిట్ మోసం
'అనుకోకుండా మీ ఖాతాలో డబ్బు డిపాజిట్ చేయబడింది, దయచేసి తిరిగి చెల్లించండి' అని మెసేజ్‌లో ఉంటుంది.

మోడల్ 7: లాటరీ మోసాలు
'మీ మొబైల్ నంబర్ లాటరీలో రూ. గెలుచుకున్నమొత్తం 1.85 కోట్లు, అమెరికా నుంచి కారును పంపుతున్నాం, క్లెయిమ్ చేయడానికి మీ పేర్లు, మొబైల్ నంబర్, చిరునామా.. వివరాలతో ప్రత్యుత్తరం పంపండి'
claim4222837@gmail.com
అని మెసేజ్‌లో ఉంటుంది. గమనించగలరు.

చిట్కాలు

1. తెలిసిన మూలాల ద్వారా పంపబడినప్పటికీ, www.unshorten.it ఉపయోగించి సంక్షిప్త URL / లింక్‌లను ధ్రువీకరించండి.
2. క్లిక్ చేసే ముందు వెబ్‌లింక్‌ను ఒకటికి రెండుసార్లు తనిఖీ చేయండి. దాని ఫిషింగ్ లింక్ కాదని నిర్ధారించడానికి www.isitphishing.org లేదా www.urlvoid.comని ఉపయోగించి అన్ని లింక్‌లను ధ్రువీకరించండి.
3. ఇ-మెయిల్ ద్వారా సున్నితమైన, వ్యక్తిగత లేదా యాజమాన్య సమాచారాన్ని ఎవరు అడుగుతున్నారో దానితో సంబంధం లేకుండా ఎప్పుడూ పంపకండి.
4. https://dnschecker.org/email-header-analyzer.php లేదా httpr://dnrchecker.orf/emai headerana yzer.phpని ఉపయోగించి ఇమెయిల్ యొక్క పూర్తి సారాంశాన్ని తనిఖీ చేయండి
5. మీ ఇ-మెయిల్ లేదా ఎస్సెమ్మెస్ మొత్తం తప్పులతో కూడిన స్పెల్లింగ్స్, సరైన విధంగా లేని వ్యాకరణాన్ని గమనించవచ్చు.
6. వ్యక్తిగత సమాచారం కోసం అడిగే లింక్‌లు / ఫారమ్‌లు (పాస్‌వర్డ్‌లు - బ్యాంక్ సమాచారం) ఉంటాయి.
7. సెర్చ్ ఇంజిన్‌లలో కస్టమర్ కేర్ నంబర్‌ల కోసం ఎప్పుడూ వెతకవద్దు. సరైన కస్టమర్ కేర్ నంబర్ కోసం సంబంధిత యాప్ లేదా సంబంధిత అప్లికేషన్ వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వండి.
8. క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయడం లేదా OTP, UPIN, బ్యాంక్ కార్డ్, CVV నంబర్‌లను ఇవ్వడం అంటే మీరు మీ ఖాతా నుండి డబ్బు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారని, మీకు రావడం లేదని అర్థం.
9. అన్ని సోషల్ మీడియా, బ్యాంకింగ్, ఇ-మెయిల్ ఖాతాల కోసం టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ (2FA)ని ప్రారంభించండి.
10. బ్యాంకింగ్ లావాదేవీలు చేస్తున్నప్పుడు లేదా సోషల్, ఇ-మెయిల్ ఖాతాలకు లాగిన్ చేస్తున్నప్పుడు మీ స్క్రీన్‌ను ఎప్పుడూ షేర్ చేయవద్దు.

ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



కిచెన్‌టిప్స్

- కిచెన్‌లో చేపల వాసనను పోగట్టడానికి నిమ్మకాయ చాలా బాగా పనిచేస్తుంది. గిన్నెలో వేడి నీరు తీసుకుని.. దానిలో నిమ్మరసం పిండండి. మిగిలిన తొక్కలను కూడా నీటిలోనే వేయండి. దీన్ని ఒక స్ప్రే డబ్బాలో పోసి వంటగదిలో స్ప్రే చేస్తే వాసన పోతుంది.
- మీ వంట గదిలో ఏదైనా ఘాటైన వాసన వస్తుంటే. నీటిలో నిమ్మకాయను సగం కట్ చేసి వేయండి. దీన్ని పది నిమిషాలు మరగనివ్వండి. తర్వతా గ్యాస్ కట్టేసి అలా వదిలేయండి. ఇలా చేస్తే మీ వంట గదిలోని ఘాటైన వాసన నుంచి మీకు ఉపశమనం లభిస్తుంది. దానిలో టేబుల్ స్పూన్ బేకింగ్ సోడా వేస్తే ఇంకా మంచి రిజల్ట్స్ వస్తాయి.









సుగంధ ద్రవ్యాలతో..

- యాలకులు, లవంగాలు, దాల్చినచెక్క.. లాంటి సువాసన వెదజల్లే మసాలా దినుసులను తీసుకొని వాటిని నీటిలో వేసి బాగా వేడిచేయాలి. ఇవి నీటిలో వేసి వేడి చేస్తే వంటగదిలో సువాసనలు వ్యాపిస్తాయి. వంటగదిలోని దుర్వాసన పోతుంది. చల్లారిన తర్వాత ఈ మిశ్రమాన్ని స్ప్రే బాటిల్‌లో వేసి మీ ఇంట్లో స్ప్రే చేస్తే మంచి వాసన వస్తుంది. ఇది రూమ్ ఫ్రెషనర్‌గా కూడా పనికొస్తుంది.

వెనిగర్



- ఇంట్లో నాన్ వెజ్ వండినప్పుడు వచ్చే నీచు వాసనను వెనిగర్ ఈజీగా పోగొడుతుంది. దీనికోసం మూడు గిన్నెల్లో వెనిగర్‌ని పోసి కిచెన్‌లో మూడు చోట్ల ఉంచాలి. 10 నుంచి 15 నిమిషాల్లో మీకు మంచి రిజల్ట్స్ వస్తాయి. అయితే ఈ వాసన మరీ ఎక్కువగా ఉంటే.. వెడల్పాటి గిన్నెలో నీరు, వెనిగర్ తీసుకుని, దానిలో నిమ్మతొక్కలు వేయాలి. తర్వాత ఈ నీటిని గ్యాస్ ఉంచి సువాసనలు వెదజల్లేంత వరకు సిమ్‌లో పెట్టి వేడి చేయాలి. తర్వాత స్టౌ ఆఫ్ చేసి అలా ఉంచేస్తే కాసేపటికి కిచెన్‌లో దుర్వాసన పోతుంది.

కమలా తొక్కలతో..

- డస్ట్బిన్‌లోని చెత్త కారణంగా కొన్ని సార్లు వంట గదిలో దుర్వాసన వస్తుంది. ఈ సమయంలో ఒక గిన్నెలో నీరు పోసి దానిలో కాస్త దాల్చినచెక్క, కొన్ని కమలా తొక్కలు వేసి సన్నని సెగపై ఐదు నిమిషాలు మరిగించండి. గిన్నెను అలాగే ఉంచేస్తే.. దుర్వాసన పోయి.. సువాసన వస్తుంది.
- మీ వంటగదిలో కూర మాడిన వాసనలు పోగొట్టుకోవాలంటే... వంట గది తలుపులు, కిటికీలు తెరిచి ఉంచితే సరి!

5 ఏఎం క్లబ్

● పొద్దుటే నిద్రలేస్తే పొయ్యేదేమీ లేదు.. బద్ధకం తప్ప

యూత్ పల్స్


ప్రతీకాత్మక చిత్రం

> యూత్‌లో చాలామందికి ఉదయాన్నే నిద్ర లేవడం అనేది వరుసగా ఏడు యుద్ధాలు చేసి గెలవాల్సినంత పెద్ద సవాలు! అయినప్పటికీ కొందరు వార్‌కు సై అంటూ రంగంలోకి దిగుతున్నారు. పాత అలవాటుకు చరమగీతం పాడి ఉదయగీతం పాడుతున్నారు...

చెన్నైకి చెందిన అఖిల ఇంజనీరింగ్ స్టూడెంట్. తాను నిద్రలేచే టైమ్ ఉదయం ఎనిమిది లేదా తొమ్మిది. అలాంటి అఖిల తన కుటుంబసభ్యులు ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. గత రెండు సంవత్సరాలుగా అఖిల ఉదయం అయిదుగంటలకే ఠంచనుగా నిద్రలేస్తోంది.

ఆమె కుటుంబసభ్యులు ఎంత సంతోషిస్తున్నారో!

ఇప్పుడు చెన్నై నుంచి మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌కు వెళదాం. టీనేజ్ కుర్రాడు ధీరజ్ నిద్రపోయే సమయం తెల్లవారుజామున దగ్గరలో ఉంటుంది. ఉదయం పదకొండు గంటల తరువాత నిద్ర లేస్తుంటాడు. అలాంటి ధీరజ్ మారిపోయాడు. పొద్దున అయిదు గంటలకు ముందే నిద్ర లేచి కసరత్తులు చేస్తున్నాడు.

ధీరజ్‌కు ఏమైంది?

హైదరాబాద్‌కు చెందిన భవ్యశ్రీ రాత్రి ఒంటిగంట దాకా ఫేస్‌బుక్ నుంచి ఇన్‌స్టాగ్రామ్ వరకు రకరకాల సామాజికమాధ్యమాలలో గడుపుతుంటుంది. అలాంటి భవ్యశ్రీ ఈమధ్య కాలంలో అయిదుకు ముందే నిద్రలేస్తోంది. పేరేంట్స్ చేత 'శభాష్' అనిపించుకుంటోంది.

ఒక వ్యక్తి అలవాట్లులో మార్పు రావడానికి అనూహ్యామైన సంఘటనలేవీ జరగనక్కర్లేదు. కొన్ని వాక్యాలు చాలు. కొన్ని దృశ్యాలు చాలు.

ఆరోజు ఏం జరిగిందంటే...

పుస్తకాలు చదివే అలవాటు ఉన్న అఖిల కాలేజి లైబ్రరీ నుంచి తెచ్చుకున్న రాబిన్ శర్మ '5 ఏఎం క్లబ్' పుస్తకం చదివింది. పొద్దున అయిదు గంటలకే నిద్ర లేచే ప్రపంచ ప్రసిద్ధ ఎంటర్‌ప్రెన్యూర్‌ల గురించి చెప్పే పుస్తకం ఇది. 'ఉన్నట్టుండి ఒక అలవాటును మార్చుకోవడం అనేది మీకే కాదు. ఎవరికైనా కష్టమే. ఫెయిలయితే కావచ్చు. అయితేనేం, ప్రయత్నించి చూడడంలో తప్పేమీ లేదు కదా అనుకొని రంగంలోకి దిగండి' అనే ఈ పుస్తకంలోని వాక్యాలు ఆమెను ఆకట్టుకున్నాయి. 'నేను కూడా ఒక ప్రయత్నం చేస్తాను' అనుకొని '5ఏఎం క్లబ్' చెప్పిన మెథడ్స్‌ను ఫాలో అయింది.

రెండు వారాలు కఠినంగా గడిచాయి. కానీ తన ప్రయత్నంలో విఫలం కాలేదు. ఇక ఇప్పుడు అలారమ్ అవసరం లేకుండానే తనకు తానుగా నిద్ర లేస్తోంది. 'అసలు టైమే సరిపోవడం లేదు' అనే మాట అఖిల గొంతు నుంచి తరచుగా వినబడేది. ఇప్పుడు మాత్రం తనకు బోలెడు టైమ్ దొరుకుతుంది.

ధీరజ్‌కు సినిమాలు, హీరోల ఇంటర్వ్యూలు చూడడం అంటే ఇష్టం. ఒకరోజు బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్ ఇంటర్వ్యూను టీవీలో చూశాడు. అది తనపై బాగా ప్రభావం చూపించింది. ఫిఫ్టీ ప్లస్‌లోనూ అక్షయ్ సూపర్ ఫిట్‌నెస్‌తో ఉండడానికి కారణం పర్‌ఫెక్ట్ స్లీప్‌సైకిల్‌ను ఫాలో కావడం. రాత్రి తొమ్మిది గంటలకే నిద్ర పోయే అక్షయ్ ఉదయం నాలుగు గంటలకే నిద్ర లేస్తాడు. ఆ తరువాత రకరకాల కసరత్తులు మొదలుపెడతాడు.

ఆ ఇంటర్వ్యూ చూసినప్పటి నుంచి 'హెల్తీ ఫిట్‌నెస్' అనే మాట ధీరజ్ బుర్రలో తిరుగుతూనే ఉంది.

'ఒక ప్రయత్నం చేసి చూద్దాం' అని గట్టిగా అనుకున్నాడు. రాత్రి పదిగంటలకే పడుకునేలా ప్రయత్నం మొదలుపెట్టాడు. అది ఎంత కష్టమో తెలిసొచ్చింది. అయినప్పటికీ తన ప్రయత్నానికి విరామం ఇవ్వలేదు. కొన్ని వారాల తరువాత సఫలం అయ్యాడు. ఉదయం అయిదు గంటలకే నిద్ర లేవడం మొదలుపెట్టాడు. రోజూ క్రమం తప్పకుండా జిమ్‌కు వెళుతున్నాడు. ఎందరి నోటి నుంచో విన్న 'ఆరోగ్యకరమైన జీవనశైలి' అనే మాట ఇప్పుడు తన అనుభవంలోకి వస్తోంది. సంతోషమే కదా!

భవ్యశ్రీలాంటి టెక్ ప్రేమికులు స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా తమ 'స్లీప్ క్వాలిటీ'ను తెలుసుకోడానికి ఆసక్తి చూపడమే కాదు, తమ పాత అలవాటును మార్చుకొని ఉదయాన్నే లేస్తున్నారు. 'హెల్త్ యాప్' 'వేకప్' 'అలారం'... మొదలైన యాప్‌ల ద్వారా 'బెడ్ టైమ్' 'వేకప్ టైమ్'ను పక్కాగా సెట్ చేసుకుంటున్నారు.



అగ్రస్థానంలోనే సూర్యకుమార్ యాదవ్

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టి20 బ్యాటింగ్ తాజా ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాడు సూర్య కుమార్ యాదవ్ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. 859 రేటింగ్ పాయింట్లతో అతను నంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు. పాకిస్తాన్‌కు చెందిన రిజ్వాన్, బాబర్ ఆజమ్ వరుసగా రెండు, మూడో స్థానాల్లో ఉన్నారు. భారత్‌పై వరల్డ్‌కప్ సెమీస్ మ్యాచ్‌లో చెలరేగిన హేల్స్ 22 స్థానాలు మెరుగుపర్చుకొని 12వ స్థానానికి చేరడం విశేషం. టాప్–10 బౌలర్ల జాబితాలో భారత్ నుంచి ఎవరూ లేకపోగా, హసరంగ నంబర్‌వన్‌గా నిలిచాడు.

అర్జున్‌కు రెండో పరాజయం

మెల్ట్‌వాటర్ చాంపియన్స్ టూర్ ఫైనల్స్ చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేశి అర్జున్, ప్రజ్ఞానందలకు వరుసగా రెండో పరాజయం ఎదురైంది. శాన్‌ఫ్రాన్సిస్కోలో జరుగుతున్న ఈ టోర్నీలో బుధవారం జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో తెలంగాణ ప్లేయర్ అర్జున్ 0.5–2.5తో ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) చేతిలో... చెన్నై కుర్రాడు ప్రజ్ఞానంద 2.5–3.5తో అనీశ్ గిరి (నెదర్లాండ్స్) చేతిలో ఓడిపోయారు.



ఆశల పల్లకిలో...

బెల్జియంపై భారీ అంచనాలు • టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి

గత నాలుగు ప్రపంచకప్‌లలో యూరోప్ జట్లే విశ్వవిజేతగా నిలిచాయి. ఈసారీ యూరోప్ నుంచే మళ్లీ ప్రపంచ చాంపియన్ వచ్చే అవకాశాలున్నాయి. గత వరల్డ్‌కప్‌లో విశేషంగా రాణించి కీలకమైన సెమీఫైనల్లో ఓటమి చవిచూసిన బెల్జియం మరోసారి టైటిల్ ఫేవరెట్‌గా ఖతర్‌లో అడుగు పెట్టింది. కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడికి తడబడకుండా ఆడితే ఈసారి ఆ జట్టుకు గొప్ప ఫలితం లభిస్తుంది.

–సాక్షి క్రీడా విభాగం


బెల్జియం జట్టు

బెల్జియం

ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రదర్శన: మూడో స్థానం (2018). **'ఫిఫా' ర్యాంక్:** 2. **అర్హత ఎలా:** యూరోపియన్ క్వాలిఫయింగ్ గ్రూప్ 'ఇ' విన్నర్.

ఎంతో మంది స్టార్ ఆటగాళ్లతో నిండిన బెల్జియం జట్టును కచ్చితంగా టైటిల్ ఫేవరెట్స్‌లో ఒక జట్టుగా పరిగణించాలి. 14వ సారి ప్రపంచకప్‌లో ఆడుతున్న బెల్జియం క్వాలిఫయింగ్ టోర్నీలో అజేయంగా నిలిచింది. ఆరు విజయాలు సాధించి, రెండు మ్యాచ్‌లను 'డ్రా' చేసుకుంది. సమకాలీన ఫుట్‌బాల్‌లో మేటి గోల్‌కీపర్‌గా పేరొందిన థిబాట్ కుర్టియస్, ఉత్తమ మిడ్‌ఫీల్డర్ కెవిన్ డి బ్రుయిన్, స్టార్ ఫార్వర్డ్స్ లుకాకు, హెజార్డ్‌లతో బెల్జియం పటిష్టంగా కనిపిస్తోంది. తమ గ్రూప్‌లో క్రొయేషియాతో మ్యాచ్ మినహా మొరాకో, కెనడా జట్ల నుంచి బెల్జియంకు పెద్దగా ప్రతిఘటన ఉండకపోవచ్చు.

మొరాకో

ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రదర్శన: ప్రిక్వార్టర్ ఫైనల్ (1986). **'ఫిఫా' ర్యాంక్:** 22. **అర్హత ఎలా:** ఆఫ్రికా క్వాలిఫయింగ్ మూడో రౌండ్ విన్నర్.

ఆఫ్రికా క్వాలిఫయింగ్ టోర్నీలో అజేయంగా నిలిచిన మొరాకో ప్రపంచకప్ ప్రధాన టోర్నీలోనూ అదే జోరు కొనసాగించాలని పట్టుదలతో ఉంది. అయితే బెల్జియం, క్రొయేషియాలాంటి రెండు పటిష్ట జట్లను నిలువరించాలంటే మొరాకో అద్భుతంగా ఆడాల్సి ఉంటుంది. హకీమ్ జియచ్, హకీమీ కీలక ఆటగాళ్లు.

కెనడా

ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రదర్శన: గ్రూప్ దశ (1986). **'ఫిఫా' ర్యాంక్:** 41. **అర్హత ఎలా:** ఉత్తర, మధ్య అమెరికా కరీబియన్ క్వాలిఫయింగ్ మూడో రౌండ్ విన్నర్.

మూడున్నర దశాబ్దాల తర్వాత మళ్లీ ప్రపంచకప్‌కు అర్హత పొందిన కెనడా జట్టులో అల్ఫోన్సో డేవిస్, డేవిడ్‌ల రూపంలో ఇద్దరు స్టార్ ఆటగాళ్లు ఉన్నారు. రెండోసారి ప్రపంచకప్‌లో ఆడుతున్న కెనడా 1986లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది. గ్రూప్‌లో బెల్జియం, క్రొయేషియా లాంటి పటిష్ట జట్లు ఉండటంతో కెనడా ఈసారైనా పాయింట్ల ఖాతా తెరుస్తుందో లేదో వేచి చూడాలి.



క్రొయేషియా

ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రదర్శన: రన్నరప్ (2018). **'ఫిఫా' ర్యాంక్:** 12. **అర్హత ఎలా:** యూరోపియన్ క్వాలిఫయింగ్ గ్రూప్ 'హెచ్' విన్నర్.

నాలుగేళ్ల క్రితం సంచలన ప్రదర్శనతో క్రొయేషియా తొలిసారి ఫైనల్‌కు చేరింది. ఆ తర్వాత పలువురు సీనియర్ ఆటగాళ్లు రిటైర్ కావడంతో కొంత బలహీన పడ్డా యూరోపియన్ క్వాలిఫయింగ్‌లో పూర్తి ఆధిపత్యం చలాయించి తొలి అవకాశంలోనే ప్రపంచకప్ బెర్త్ సాధించింది. తాజా జట్టులో అనుభవం లేని యువ ఆటగాళ్లు ఎక్కువగా ఉండటంతో స్టార్ మిడ్ ఫీల్డర్లు లుకా మోడ్రిచ్, బ్రొజోవిచ్, కొవాచిచ్‌ల ఆటతీరుపైనే క్రొయేషియా విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. గత ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన జట్టు తదుపరి వరల్డ్‌కప్‌లోనూ ఫైనల్‌కు చేరడం చివరిసారి 2002లో జరిగింది. 1998 ప్రపంచకప్ రన్నరప్ బ్రెజిల్ 2002లో ఫైనల్ చేరడంతోపాటు విజేతగా నిలిచింది.



మోడ్రిచ్

అల్‌కరాజ్ కొత్త చరిత్ర

- ఏడాదిని నంబర్‌వన్ ర్యాంక్‌తో ముగించనున్న స్పెయిన్ టెన్నిస్ స్టార్
- ఈ ఘనత సాధించిన పిన్న వయస్కుడిగా రికార్డు

ట్యూరిన్ (ఇటలీ): అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) ప్రపంచ ర్యాంకింగ్స్‌లో స్పెయిన్ టీనేజర్ కార్లోస్ అల్‌కరాజ్ కొత్త చరిత్ర లిఖించాడు. 1973లో అధికారికంగా ర్యాంకింగ్స్ మొదలయ్యాక నంబర్‌వన్ ర్యాంక్‌తో ఏడాదిని ముగించనున్న పిన్న వయస్కుడిగా 19 ఏళ్ల అల్‌కరాజ్ గుర్తింపు పొందాడు. ఇప్పటి వరకు లీటన్ హెవిట్ (ఆస్ట్రేలియా; 2001లో 20 ఏళ్ల 214 రోజులు) పేరిట ఉన్న ఈ రికార్డును అల్‌కరాజ్ తిరగరాశాడు.

- గాయం కారణంగా అల్‌కరాజ్ సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్‌కు దూరమయ్యాడు. మరోవైపు ఈ టోర్నీలో టైటిల్ సాధిస్తే స్పెయిన్ దిగ్గజం, ప్రపంచ రెండో ర్యాంకర్ రాఫెల్ నాదల్ మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్ అందుకోవడంతోపాటు సీజన్‌ను టాప్ ర్యాంక్‌తో ముగించేవాడు. కానీ నాదల్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోవడంతో ప్రస్తుతం నంబర్‌వన్‌గా ఉన్న అల్‌కరాజ్ (6,820 పాయింట్లు) డిసెంబర్ 5న ముగిసే టెన్నిస్ సీజన్‌ను టాప్ ర్యాంక్‌తో ముగించడం ఖరారైంది.
- ఈ ఏడాదిని 32వ ర్యాంక్‌తో ప్రారంభించిన అతను సెప్టెంబర్ 12న నంబర్‌వన్ ర్యాంకర్‌గా ఎదిగాడు. పిన్న వయస్కులో టాప్ ర్యాంక్ అందుకున్న టెన్నిస్ ప్లేయర్‌గా కొత్త రికార్డు నెలకొల్పాడు.



- ఈ సంవత్సరం అల్‌కరాజ్ ఐదు సింగిల్స్ టైటిల్స్ (రియోఓపెన్, మయామి మాస్టర్స్, బార్సిలోనా ఓపెన్, మాడ్రిడ్ మాస్టర్స్, యూఎస్ ఓపెన్) సాధించాడు. మొత్తం 57 మ్యాచ్‌ల్లో గెలిచి, 13 మ్యాచ్‌ల్లో ఓడిపోయాడు. 76 లక్షల 27 వేల 613 డాలర్ల (రూ. 62 కోట్లు) ప్రైజ్‌మనీ సంపాదించాడు.
- ఏటీపీ ర్యాంకింగ్స్ చరిత్రలో సీజన్‌ను నంబర్‌వన్ ర్యాంక్‌తో ముగించనున్న 18వ ప్లేయర్ అల్‌కరాజ్. 2003 తర్వాత బిగ్–4 ప్లేయర్లు (ఫెడరర్, నాదల్, జొకోవిచ్, ఆండీ ముర్రే) కాకుండా మరో ప్లేయర్ టాప్ ర్యాంక్‌తో ముగించడం ఇదే ప్రథమం. నాదల్ తర్వాత స్పెయిన్ నుంచి ఈ ఘనత సాధించిన రెండో ప్లేయర్‌గా అల్‌కరాజ్ నిలిచాడు.

'ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి'

వచ్చే టి20 ప్రపంచకప్‌పై హార్దిక్

వెల్లింగ్టన్: టి20 ప్రపంచకప్ ముగిసి వారం రోజులు కూడా కాలేదు. గత గురువారమే సెమీస్‌లో ఇంగ్లండ్ చేతిలో ఓడి భారత్ నిష్క్రమించింది. అయితే 2024లో జరిగే టి20 ప్రపంచకప్ కోసం ఇప్పటి నుంచే జట్టు సన్నాహాలు మొదలు పెట్టినట్లు, అందుకు తగిన ప్రణాళికలు తమ వద్ద ఉన్నట్లు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా వ్యాఖ్యానించాడు. రోహిత్, కోహ్లి, కేఎల్ రాహుల్ విశ్రాంతి తీసుకోవడంతో శుక్రవారం నుంచి విలియమ్సన్ సారథ్యంలోని న్యూజిలాండ్‌తో జరిగే టి20 సిరీస్‌కు పాండ్యా భారత కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. 'మా ప్రపంచకప్ నిరాశాజనకంగా ముగిసిందనేది వాస్తవం. అయితే ప్రొఫెషనల్ క్రీడాకారులుగా మేం దానిని అధిగమించి ముందుకు సాగాలి. మా వద్ద ఇప్పుడు తగినంత సమయం ఉంది. వచ్చే రెండేళ్లలో ఎంతో మంది ప్రతిభావంతులు వెలుగులోకి వస్తారు. చాలా మ్యాచ్‌లు ఆడతాం కాబట్టి చాలా మందికి తగిన అవకాశాలు కూడా లభిస్తాయి. సరిగ్గా చెప్పాలంటే దాని కోసం మా వద్ద ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి' అని హార్దిక్ పేర్కొన్నాడు.


టి20 సిరీస్ ట్రోఫీతో విలియమ్సన్, హార్దిక్ పాండ్యా

శరత్ కమల్‌కు అరుదైన గౌరవం

ఐటీటీఎఫ్ అథ్లెట్స్ కమిషన్‌లో చోటు

న్యూఢిల్లీ: భారత అగ్రశ్రేణి టేబుల్ టెన్నిస్ (టీటీ) ఆటగాడు, ఖేల్‌రత్న అవార్డీ ఆచంట శరత్ కమల్‌ను అంతర్జాతీయ టీటీ సమాఖ్య (ఐటీటీఎఫ్) సముచిత రీతిలో గౌరవించింది. ప్రతిష్టాత్మక ఐటీటీఎఫ్ అథ్లెట్స్ కమిషన్‌లో శరత్ కమల్‌కు చోటు దక్కింది. ఈ ఘనత సాధించిన తొలి భారత ఆటగాడు శరత్ కావడం విశేషం. 2022–2026 మధ్య నాలుగేళ్ల కాలానికిగాను వేర్వేరు ఖండాల నుంచి ఎనిమిది మందిని (నలుగురు పురుషులు, నలుగురు మహిళలు) ఇందులోకి ఎంపిక చేశారు. మొత్తం 283 మంది అథ్లెట్లు ఓటింగ్‌లో పాల్గొనగా, ఆసియా ఖండం ప్రతినిధిగా శరత్‌కు 187 ఓట్లు లభించాయి. మహిళల కేటగిరీలో ఎంపికైన చైనా ప్యాడ్లర్ ల్యూ షీవెన్‌కు 153 ఓట్లు మాత్రమే వచ్చాయి. తనకు లభించిన ఈ అవకాశం పట్ల సంతోషం వ్యక్తం చేసిన శరత్ కమల్... ఆసియా ఖండం నుంచి తనకు ఓటు వేసిన వారందరికీ కృతజ్ఞతలు చెప్పాడు. ఇటీవల జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో శరత్ 3 స్వర్ణాలు నెగ్గాడు.



నేటి నుంచి ఏషియన్ కప్...

బ్యాంకాక్ వేదికగా నేటినుంచి ఐటీటీఎఫ్–ఏటీటీయూ ఏషియన్ కప్ టోర్నీలో శరత్ కమల్‌తో పాటు మరో భారత టాప్ ఆటగాడు సత్యన్ పాల్గొంటున్నారు. అయితే వీరిద్దరికీ కఠిన 'డ్రా' ఎదురైంది. తొలి పోరులో తమకంటే మెరుగైన ర్యాంక్‌ల్లో ఉన్న చువాంగ్ చి యువానా (చైనీస్ తైపీ)తో శరత్ తలపడనుండగా, యుకియా ఉడా (జపాన్)ను సత్యన్ ఎదుర్కొంటాడు.

భారత్ ఖాతాలో మరో నాలుగు స్వర్ణాలు

దేగూ (కొరియా): ఆసియా ఎయిర్‌గన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల పతకాల వేట కొనసాగుతోంది. బుధవారం జరిగిన నాలుగు ఈవెంట్స్‌లోనూ భారత షూటర్లు స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్నారు. జూనియర్ మహిళల 10 ఎయిర్ పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో తెలంగాణ అమ్మాయి ఇషా సింగ్ 15–17తో భారత్‌కే చెందిన మనూ భాకర్ చేతిలో ఓడిపోయి రజతం దక్కించుకుంది. సీనియర్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో రిథమ్ సాంగ్వాన్ 16–8తో భారత్‌కే చెందిన పలక్‌పై గెలిచి పసిడి పతకం సొంతం చేసుకుంది. సీనియర్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఫైనల్లో శివ నర్వాల్, నవీన్, విజయ్‌వీర్‌లతో కూడిన భారత జట్టు 16–14తో కొరియా జట్టును ఓడించి బంగారు పతకం సాధించింది. జూనియర్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఫైనల్లో సాగర్, సామ్రాట్ రాణా, వరుణ్ తోమర్‌లతో కూడిన భారత జట్టు 16–2తో ఉజ్బెకిస్తాన్ జట్టుపై గెలిచి స్వర్ణం కైవసం చేసుకుంది. మరో రెండు రోజులు ఉన్న ఈ ఈవెంట్‌లో ఇప్పటి వరకు భారత్‌కు 21 స్వర్ణ పతకాలు లభించాయి.


ఇషా సింగ్


రిథమ్ సాంగ్వాన్

సినిమా


• గౌతమ్, సితార, నమ్రత

మిస్ యూ...

మహేశ్‌బాబు తనయుడు గౌతమ్ లండన్‌లో చదువుకుంటున్నాడు. దాంతో మంగళవారం హైదరాబాద్ చేరుకోలేకపోయాడు. బుధవారం గౌతమ్ హైదరాబాద్ చేరుకున్నాడు. చెల్లెలు సితారతో కలసి తాతకు నివాళి అర్పించాడు. మనవడు, మనవరాలు తాత కృష్ణను ఉద్దేశించి సోషల్ మీడియాలో భావోద్వేగమైన పోస్ట్‌లను షేర్ చేశారు.

''మీరెక్కడ ఉన్నా మిమ్మల్ని ప్రేమిస్తూనే ఉంటాను. మీరు కూడా నన్ను ప్రేమిస్తూనే ఉంటారని నాకు తెలుసు. తాతగారూ... మిమ్మల్ని నేనెంతగానో మిస్ అవుతున్నాను'' అని గౌతమ్ పేర్కొన్నాడు.

''ఇక వారాంతపు భోజన సమయాలు ఎప్పటికీ మునుపటిలా ఉండవు. మీరు నాకు ఎన్నో విలువైన విషయాలను నేర్పించారు. నన్నెప్పుడూ నవ్వించేవారు. ఇవన్నీ ఇకపై మీ జ్ఞాపకాలుగా నాకు గుర్తుండిపోతాయి. మీరే నా హీరో. ఏదో ఒక రోజు మీరు గర్వపడే స్థాయికి చేరుకుంటాననే నమ్మకం ఉంది. తాతగారూ... మిమ్మల్ని నేను ఎంతగానో మిస్ అవుతున్నాను'' అని సితార పేర్కొంది.



కన్నీటి వీడ్కోలు


సూపర్ స్టార్ కృష్ణ అంత్యక్రియలు బుధవారం ముగిశాయి. హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లోని మహాప్రస్థానంలో తెలంగాణ ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. కృష్ణ తనయుడు, హీరో మహేశ్‌బాబు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. తమ అభిమాన హీరోని కడసారి చూసేందుకు సూపర్‌స్టార్ అభిమానులు భారీ సంఖ్యలో పద్మాలయ స్టూడియోకు తరలివచ్చారు. కృష్ణ కుటుంబ సభ్యులు, అశేష అభిమానులు, ప్రజలు కన్నీటి పర్యంతమవుతూ సూపర్‌స్టార్‌కి కడసారి వీడ్కోలు పలికారు.


• కోట శ్రీనివాసరావు, మహేశ్‌బాబు


• భార్య వసుంధర, కుమార్తె బ్రాహ్మణితో బాలకృష్ణ

పది కోట్ల పాట?

దర్శకుడు శంకర్ సినిమాల్లో సాంగ్స్ విజువల్స్ పరంగా, లొకేషన్స్ పరంగా చాలా గ్రాండియర్‌గా ఉంటాయన్న సంగతి తెలిసిందే. తాజాగా శంకర్ మరో గ్రాండియర్ సాంగ్‌ను తీసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా కోసమే శంకర్ పది కోట్ల బడ్జెట్‌తో పాట ప్లాన్ చేశారట. ఈ సినిమా కొత్త షెడ్యూల్ షూటింగ్ న్యూజిల్యాండ్‌లో జరగనున్న సంగతి తెలిసిందే. ఈ షెడ్యూల్ ఈ నెల 20 నుంచి డిసెంబరు 2 వరకు జరుగుతుందట. హీరో రామ్‌చరణ్, హీరోయిన్ కియారా అద్వానీలపై గ్రాండ్‌గా డ్యూయట్ సాంగ్ చిత్రీకరించనున్నారని సమాచారం. వార్తల్లో ఉన్న ప్రకారం ఈ పాటకు దాదాపు పదికోట్ల రూపాయలకు పైనే బడ్జెట్‌ను కేటాయించారట. బాలీవుడ్ కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిస్ ఈ పాటకు నృత్యరీతులు సమకూర్చుతారని సమాచారం. పొలిటికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాకు తమన్ సంగీతదర్శకుడు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమాను వచ్చే ఏడాది చివర్లో రిలీజ్ చేయాలనుకుంటున్నారు.


• రామ్‌చరణ్

బ్రేక్ టైమ్

బాలీవుడ్ అగ్రహీరోల్లో ఒకరైన ఆమిర్ ఖాన్ ఓ షాకింగ్ నిర్ణయం తీసుకున్నారు. దాదాపు ఏడాదిన్నర పాటు యాక్టర్‌గా కెమెరా ముందుకు రానని పేర్కొన్నారు. ఈ విషయం గురించి ఆమిర్ ఖాన్ మాట్లాడుతూ– ''ముప్పైఐదు సంవత్సరాలుగా పని గురించే ఆలోచిస్తున్నాను. యాక్టర్‌గా సినిమాలు చేస్తూనే ఉన్నాను. నన్ను ఎంతగానో ప్రేమించే నా కుటుంబసభ్యులకు సమయాన్ని కేటాయించలేకపోయాను. వారి గురించి నేను సరిగా ఆలోచించలేదేమో అని ఫీల్ అవుతున్నాను. ఇప్పుడు కొంత బ్రేక్ తీసుకుని వారితో టైమ్ స్పెండ్ చేయాలని అనుకుంటున్నాను. ఇక దాదాపు ఏడాదిన్నర పాటు నేను యాక్టర్‌గా పని చేయను. కుటుంబంతో విలువైన సమయాన్ని గడుపుతాను'' అని చెప్పుకొచ్చారు . అలాగే నిర్మాతగా స్పానిష్ ఫిల్మ్ 'చాంపియన్స్'ను హిందీలో రీమేక్ చేయాలనుకుంటున్నానని ఆమిర్ వెల్లడించారు. ఇక ఆమిర్ ఖాన్ హీరోగా నటించిన 'లాల్‌సింగ్ చడ్డా' ఈ ఏడాది విడుదలైన విషయం తెలిసిందే. సో.. ఆమిర్ ఏడాదిన్నర బ్రేక్ తీసుకుంటానని అంటున్నారు కాబట్టి.. నటుడిగా 2024లోనే ఆయన వెండితెరపై కనిపించే అవకాశం ఉంది.


• ఆమిర్ ఖాన్



నేను సినిమాలు తీయడానికి వచ్చినప్పటి నుంచి కృష్ణగారిని పరిశీలిస్తున్నాను. అంత గొప్ప వ్యక్తి చనిపోయాడనిపించినప్పుడు ఒక విషయం గుర్తుకొస్తోంది. కృష్ణగారితో సినిమా తీసిన ఇద్దరు ముగ్గురు నిర్మాతలు ఆయనకు పారితోషికం ఇవ్వాల్సి ఉంది. అయితే కృష్ణగారు వారిని పిలిచి, 'మీరు కష్టాల్లో ఉన్నారట.. నన్నేమైనా సాయం చేయమంటారా?' అని అడిగి, తన పారితోషికం వదిలేయడంతో పాటు తిరిగి డబ్బులు ఇచ్చి మరీ సినిమాలు విడుదల చేయించారు. ఆ నిర్మాతలెవరో నాకు తెలుసు.. కానీ, వారి పేర్లు ఇప్పుడు చెప్పడం అనవసరం. ఆ స్థాయి హీరోల్లో నిర్మాతలు బాగుండాలని కోరుకునే వారు ఎవరున్నారు? అటువంటి వ్యక్తి మనకు ఇవాళ లేరు.. అది మన దురదృష్టం. ఆయనకి నివాళులర్పించేందుకు కుటుంబ సభ్యులు, సినీ ప్రముఖులతో పాటు లక్షలాది మంది అభిమానులు రావడం నిజంగా విశేషం.. ఆయన అభిమానులందరికీ నా సానుభూతి వ్యక్తం చేస్తున్నాను.

– అల్లు అరవింద్


• కృష్ణ పెద్ద కుమారుడు రమేశ్ భార్య మృదుల, కుమార్తె భారతి


• కృష్ణ రెండో కుమార్తె మంజుల, మనవరాలు జాన్వీ

తెలుగు చిత్ర పరిశ్రమ చెన్నై నుంచి హైదరాబాద్ రావడానికి కారణమైన వ్యక్తుల్లో కృష్ణగారు ముఖ్య పాత్ర పోషించారు. ఈ రోజు నేను ఈ స్థాయిలో ఉన్నానంటే ఇండస్ట్రీలో కృష్ణగారు నాకు ఇచ్చిన సపోర్టే కారణం. ఆయన ఒక మంచి వ్యక్తిగా, ప్రజల మనిషిగా ఎప్పుడూ ఇండస్ట్రీ కోసం, ప్రజల కోసం పని చేశారు. సినిమాల్లోనూ, రాజకీయాల్లోనూ మంచి పేరు తెచ్చుకున్న ఆయన ఇండస్ట్రీలో ఒక లెజెండ్‌గా ఉన్నారు. తండ్రి మరణాన్ని మహేశ్‌బాబు తట్టుకోలేరేమో అనిపిస్తోంది. వరుస విషాదాలు (ఈ ఏడాది మహేశ్ సోదరుడు రమేశ్‌బాబు, తల్లి ఇందిరా దేవి కన్నుమూశారు) జరగడం వల్ల ఆయనకి ఆ భగవంతుడు ధైర్యం ఇవ్వాలని కోరుకుంటున్నాను. కృష్ణగారితో నేను 47 అద్భుతమైన సినిమాల్లో పని చేశాను. మంచి సినిమాలకు ఆయన దర్శకత్వం వహించారు. సూపర్ స్టార్‌గారు లేరు అనుకోవడం కంటే మనతోనే ఉన్నారనుకుంటున్నాను. ఆయన ఎప్పుడూ చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరించేవారు. ప్రజల కోసం ఎలాంటి సాహసం అయినా పట్టుదలతో చేసే వ్యక్తి ఆయన. అలాంటి మంచి వ్యక్తితో కొన్నేళ్ల పాటు కలిసి పని చేయడం నా అదృష్టం.

– జయప్రద



స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	108	61,981
నిఫ్టీ ▲	6	18,410

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	11,233	▽	125
డోజోన్స్	33,614	▲	21
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,351	▽	18
డాక్స్	14,234	▽	144
షాంఘై	3,120	▽	14
నికాయ్	28,028	▲	38

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	53,094	▲	271
బంగారం (99.5 స్వచ్ఛత)	52,881	▲	2701
వెండి (కేజీ)	62,594	▲	324

29 నుంచి మళ్లీ బ్లూ టిక్ సర్వీసులు

ట్విటర్ చీఫ్ ఎలాన్ మస్క్ వెల్లడి



న్యూయార్క్: వెరిఫైడ్ ఖాతాల కోసం ఉద్దేశించిన 8 డాలర్ల సబ్‌స్క్రిప్షన్ ఆధారిత బ్లూ టిక్ సర్వీసులను నవంబర్ 29 నుండి మళ్లీ అందుబాటులోకి తెస్తున్నట్లు ట్విటర్ చీఫ్ ఎలాన్ మస్క్ వెల్లడించారు. దీన్ని ప్రవేశపెట్టాక.. ఎవరైనా తమ వెరిఫైడ్ పేరును (ట్విటర్ ధృవీకరించినది) మార్చుకుంటే బ్లూ టిక్ కోల్పోతారు. తిరిగి ట్విటర్ ధ్రువీకరించే వరకు మళ్లీ దాన్ని వాడలేరు. ఆదాయాన్ని పెంచుకునే క్రమంలో బ్లూ టిక్ కోసం నెలకు 8 డాలర్ల సబ్‌స్క్రిప్షన్ సర్వీసును నవంబర్ 6నే ప్రారంభించినప్పటికీ నకిలీ ఖాతాలు వెల్లువెత్తడంతో తాత్కాలికంగా నిలిపివేశారు.

ఉద్యోగులకు డెడ్‌లైన్ ..

ట్విటర్‌ను టేకోవర్ చేసిన తర్వాత చాలా మంది సిబ్బందిని తొలగించిన మస్క్ తాజాగా మిగిలిన ఉద్యోగులకు కూడా డెడ్‌లైన్ పెట్టారు. ట్విటర్ 2.0ను తీర్చిదిద్దడానికి గంటల తరబడి తీవ్రంగా కష్టపడాల్సి వస్తుందని, అందుకు సిద్ధంగా ఉన్న వారు కొనసాగవచ్చని లేకపోతే తప్పుకోవచ్చని స్పష్టం చేశారు. ఏ విషయమూ గురువారం సాయంత్రం 5 గంటల కల్లా (అమెరికా కాలమానం ప్రకారం) తేల్చుకోవాలని ఈమెయిల్ ద్వారా అల్టిమేటం ఇచ్చారు. అవును, కాదు అనే రెండు ఆప్షన్లతో లింకును పంపించారు. దీనికి సమాధానం ఇవ్వని ఉద్యోగులకు మూడు నెలల పరిహారం ఇచ్చి, పంపించేస్తామని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో 8% పెరిగిన ఇళ్ల ధరలు

- ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో 14 శాతం అప్
- సెప్టెంబర్ క్వార్టర్‌పై క్రెడాయ్–కొలియర్స్ నివేదిక



న్యూఢిల్లీ: హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్లో ఇళ్ల ధరలు సెప్టెంబర్ త్రైమాసికంలో 8 శాతం పెరిగాయి. చదరపు అడుగు ధర రూ.9,266కు చేరుకుంది. దేశంలో అత్యధికంగా ఢిల్లీ–ఎన్‌సీఆర్ మార్కెట్లో ఇళ్ల ధరలు 14 శాతం పెరిగాయి. ఇక్కడ చదరపు అడుగు ధర రూ.7,741గా ఉంది. దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రధాన పట్టణాల రియల్టీ ధరల వివరాలతో క్రెడాయ్–కొలియర్స్, లియాసెస్ ఫొరాస్ నివేదిక విడుదలైంది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూసినప్పుడు దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రధాన పట్టణాల్లో ఇళ్ల ధరలు సగటున 6 శాతం పెరిగాయి.

- ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో అత్యధికంగా గోల్ఫ్ కోర్స్ రోడ్డులో ఇళ్ల ధరలు 21 శాతం పెరిగాయి.
- కోల్‌కతాలో సగటున 12 శాతం అధికమై, చదరపు అడుగు ధర రూ.6,954గా ఉంది.
- అహ్మదాబాద్ పట్టణంలో 11 శాతం పెరిగి చదరపు అడుగు ధర రూ.6,077గా ఉంది.
- పుణెలో 9 శాతం వృద్ధితో చదరపు అడుగు ధర రూ.8,013కు చేరింది.
- బెంగళూరులో 6% పెరిగి రూ.8,035గా ఉంది.
- చెన్నై, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్)లో ధరల్లో పెద్ద మార్పు లేదు. చెన్నైలో చదరపు అడుగు రూ.7,222గా, ఎంఎంఆర్‌లో రూ.19,485 చొప్పున ఉంది.
- 2022 ఆరంభం నుంచి డిమాండ్ బలంగా ఉండడం, నిర్మాణ వ్యయాలు అధికం కావడంతో ఇళ్ల ధరలు పెరుగుతూ వచ్చినట్టు ఈ నివేదిక తెలిపింది.

'కే' షేప్డ్ రికవరీ

''దేశవ్యాప్తంగా రియల్‌ఎస్టేట్ మార్కెట్ ధరల పరంగా 'కే' ఆకారపు రికవరీ తీసుకుంది. వినియోగదారుల కొనుగోలు సెంటిమెంట్ బలంగా కొనసాగింది. అద్దె ఇంటి కంటే సొంతిల్లు అవసరమనే ప్రాధాన్యత కరోనా తర్వాత ఏర్పడింది''అని క్రెడాయ్ నేషనల్ ప్రెసిడెంట్ హర్ష వర్ధన్ పటోడియా చెప్పారు. డిమాండ్ ఉన్నందున అమ్ముడుపోని మిగులు ఇళ్ల నిల్వలు ఇక ముందు తగ్గుతాయని అంచనా వేశారు. ఇళ్ల ధరల పెరుగుదల అంతర్జాతీయంగా నెలకొన్న ద్రవ్యోల్బణ ధోరణలకు అనుగుణంగానే ఉందన్నారు. డిమాండ్ బలంగా ఉండడంతో ఇళ్ల ధరల పెరుగుదల ఇంక ముందూ కొనసాగొచ్చని అంచనా వేశారు.

మొబైల్ ఏదైనా.. చార్జర్ ఒక్కటే!

ఒకేరకం చార్జర్ అమలుకు పరిశ్రమ సమ్మతి

న్యూఢిల్లీ: త్వరలో మొబైల్ ఫోన్ చార్జర్ల కష్టాలకు తెరపడనుంది. ఉన్నట్టుండి చార్జింగ్ అయిపోతే, మరొకరి ఫోన్ చార్జర్‌తో అవసరం గట్టెక్కవచ్చు. ఇందుకు వీలుగా ఒకేరకమైన చార్జింగ్ పోర్ట్‌ను దశలవారీగా అమలు చేయడానికి మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ కంపెనీలు అంగీకారం తెలిపాయి.



ఈ విషయాన్ని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ ప్రకటించింది. ఏకరూప చార్జింగ్ పోర్ట్ సాధ్యా సాధ్యాలను పరిశీలించడానికి ఉప కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది. వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి రోహిత్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలోని అంతర్గత మంత్రిత్వశాఖల టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎంఏఐటీ, ఫిక్కీ, సీఐఐ, ఐఐటీ కాన్పూర్, ఐఐటీ భువనేశ్వర్, ఐఐటీ వారణాసి విద్యా సంస్థల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు, ల్యాప్‌టాప్‌లు తదితర ఎలక్ట్రానిక్ డివైజ్‌లను యూఎస్‌బీ టైప్–సీ చార్జింగ్ పోర్ట్‌తో తీసుకొచ్చేందుకు పరిశ్రమ ప్రతినిధులు సమ్మతి తెలిపారు.

కొత్త గరిష్టాల వద్ద ముగింపు

- సెన్సెక్స్ 108 పాయింట్లు ప్లస్
- నిఫ్టీకి ఆరు పాయింట్ల లాభం



ముంబై: ట్రేడింగ్‌లో పరిమిత శ్రేణిలో కదలాడిన సూచీలు బుధవారం కొత్త గరిష్టాల వద్ద ముగిశాయి. బ్యాంకింగ్, ఐటీ, ఫైనాన్స్ షేర్లు రాణించడంతో ఇంట్రాడేలోనూ తాజా ఏడాది గరిష్టాలను నమోదుచేశాయి. సెన్సెక్స్ ఉదయం 164 నష్టంతో 61,709 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 180 పాయింట్లు బలపడి 62,053 వద్ద కొత్త ఏడాది గరిష్టాన్ని తాకింది. అలాగే 61,709 పాయింట్ల వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 108 పాయింట్లు పెరిగి కొత్త జీవితకాల గరిష్టం 61,981 వద్ద స్థిరపడింది. నిఫ్టీ రోజంతా 98 పాయింట్ల పరిధిలో కదలాడి 18,442 వద్ద 52 వారాల గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 6 పాయింట్ల అతి స్వల్ప లాభంతో 18,410 వద్ద ముగిసింది. ఆటో, మీడియా, మెటల్, ఫార్మా, రియల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.386 కోట్లను షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1437 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియా, యూరప్ మార్కెట్లు, యూఎస్ స్టాక్ ఫ్యూచర్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 35 పైసలు బలహీనపడి 81.26 స్థాయి వద్ద స్థిరపడింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- మేదాంత బ్రాండ్ పేరుతో హాస్పిటల్స్ చైన్ నిర్వహిస్తున్న గ్లోబల్ హెల్త్ ఐపీవో లిస్టింగ్ మెప్పించింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర రూ.336తో పోలిస్తే 18% ప్రీమియంతో రూ.398 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 26% ర్యాలీ చేసి రూ.425 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. మార్కెట్ ముగిసేసరికి 23 శాతం బలపడి రూ.416 వద్ద స్థిరపడింది.
- బికాజీ ఫుడ్స్ ఇంటర్నేషనల్ ఐపీవో సైతం విజయవంతమైంది. ఇష్యూ ధర రూ.300తో పోలిస్తే 7% ప్రీమియంతో రూ.321 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 12% రూ.335 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 6% పెరిగి రూ.317 వద్ద స్థిరపడింది.

యాక్సిస్ వాటాకు రూ. 3,839 కోట్లు

ఎస్‌యూయూటీఐ ద్వారా ప్రయివేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్‌లోగల 1.5 శాతం వాటాను ప్రభుత్వం విక్రయించింది. షేరుకి రూ. 830.63 ఫ్లోర్ ధరలో గత వారం ప్రభుత్వం 4.65 కోట్లకుపైగా యాక్సిస్ షేర్లను విక్రయించింది. వెరసి రూ. 3,839 కోట్లు అందుకున్నట్లు దీపమ్ కార్యదర్శి తుహిన్ కాంత పాండే తాజాగా ట్వీట్ చేశారు. దీంతో డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ రూ. 28,383 కోట్లను సమకూర్చుకున్నట్లు వెల్లడించారు.

మీడియా @ 65 బిలియన్ డాలర్లు!

- 2030 నాటికి అంచనా
- సీఐఐ, బీసీజీ తాజా నివేదిక



న్యూఢిల్లీ: దేశీ మీడియా, వినోద (ఎంఅండ్‌ఈ) పరిశ్రమ 2030 నాటికి 55–65 బిలియన్ డాలర్లకు చేరనుంది. ఓటీటీ, గేమింగ్ విభాగాలు ఇందుకు ఊతంగా ఉండనున్నాయి. పరిశ్రమల సమాఖ్య సీఐఐ, కన్సల్టెన్సీ సంస్థ బీసీజీ సంయుక్తంగా రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ప్రస్తుతం ఎంఅండ్‌ఈ రంగం 2022లో 27–29 బిలియన్ డాలర్లుగా ఉండనుంది. 'పటిష్టమైన వృద్ధి చోదకాలు ఉన్నందున 2030 నాటికి పరిశ్రమ 55–65 బిలియన్ డాలర్లకు చేరవచ్చు. 65–70 బిలియన్ డాలర్లకు కూడా చేరే సామర్థ్యాలు ఉన్నాయి. ఓటీటీ, గేమింగ్ విభాగాల వృద్ధి ఇందుకు తోడ్పడనుంది' అని నివేదిక పేర్కొంది. టెక్నాలజీ పురోగతి, వినియోగదారుల ధోరణుల్లో మార్పులతో మీడియాలోని కొన్ని విభాగాల్లో వేగంగా మార్పులు చోటు చేసుకున్నాయని.. ముఖ్యంగా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ఇది ఎక్కువగా ఉందని తెలిపింది. పరిశ్రమ 'బూమ్'కు డిజిటల్ వీడియో, గేమింగ్ సెగ్మెంట్‌లు దోహదపడుతున్నాయని నివేదిక వివరించింది. దీని ప్రకారం ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ల జోరుతో 2022లో మొత్తం మీడియా వినియోగంలో వీటి వాటా 40%గా ఉంది.

డిజిటల్.. డిజిటల్..

మిగతా సెగ్మెంట్ల కన్నా ఎక్కువగా డిజిటల్ వినియోగం వృద్ధి చెందుతోంది. 2020–2022 మధ్య కాలంలో భారత ఎంఅండ్‌ఈ పరిశ్రమ దాదాపు 6 బిలియన్ డాలర్ల మేర వృద్ధి చెందగా, ఇందులో మూడింట రెండొంతుల వాటా డిజిటల్‌దే కావడం గమనార్హం. నివేదిక ప్రకారం సబ్‌స్క్రిప్షన్ వీడియో ఆన్ డిమాండ్ (ఎస్‌వీవోడీ) చందాలు 2022లో 8–9 కోట్ల మేర పెరగవచ్చు. ప్రస్తుతం ప్రీమియం, ప్రత్యేకమైన కంటెంట్ కోసం చెల్లించడానికి యూజర్లలో మరింత సుముఖత పెరుగుతోంది. 2030 నాటికి మొత్తం ఓటీటీ ఆదాయంలో ఎస్‌వీవోడీ వాటా 55–60%గా ఉండనుంది. పరిశ్రమపై కొత్త ధోరణులు దీర్ఘకాలిక ప్రభావాలు చూపనున్నాయి. మెటావర్స్ మొదలైన టెక్నాలజీల వినియోగం .. గేమింగ్‌కు మాత్రమే పరిమితం కాకుండా మిగతా రంగాల్లోకి గణనీయంగా విస్తరించనుంది.

సాఫ్ట్‌బ్యాంక్.. పేటీఎం వాటా విక్రయం

4.5 శాతం వాటాకు రూ. 1,627 కోట్లు!

న్యూఢిల్లీ: డిజిటల్ పేమెంట్స్ దిగ్గజం వన్97 కమ్యూనికేషన్స్(పేటీఎమ్)లో 4.5 శాతం వాటా విక్రయానికి సాఫ్ట్‌బ్యాంక్ సన్నాహాలు చేస్తోంది. బ్లాక్‌డీల్ ద్వారా ఈ వాటాను 20 కోట్ల డాలర్లకు(సుమారు రూ. 1,627 కోట్లు) విక్రయించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఎస్‌వీఎఫ్ ఇండియా హోల్డింగ్స్ ద్వారా పేటీఎంలో సాఫ్ట్‌బ్యాంక్ 17.5 శాతం వాటాను కలిగి ఉంది. తద్వారా అతిపెద్ద వాటాదారుగా నిలుస్తోంది. షేరుకి రూ. 555–601.55 ధరల శ్రేణిలో వాటాను విక్రయించే వీలున్నట్లు సంబంధిత వర్గాలు తెలియజేశాయి. పేటీఎమ్ ఐపీవో తదుపరి లాకిన్ గడువు ముగియడంతో సాఫ్ట్‌బ్యాంక్ వాటా విక్రయ సన్నాహాలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

షేరు పతనం

బీఎస్‌ఈలో పేటీఎం షేరు బుధవారం(16న) 4 శాతం పతనమై రూ. 601.55 వద్ద ముగిసింది. ఈ ధరలో షేర్లను విక్రయిస్తే సాఫ్ట్‌బ్యాంక్‌కు 21.5 కోట్ల డాలర్లు లభిస్తాయి. 2017 చివరి త్రైమాసికంలో సాఫ్ట్‌బ్యాంక్ 160 కోట్ల డాలర్లు ఇన్వెస్ట్ చేసింది. తదుపరి ఐపీవోలో 22 కోట్ల డాలర్ల విలువైన ఈక్విటీని విక్రయించింది. పేటీఎమ్‌లో ప్రస్తుత సాఫ్ట్‌బ్యాంక్ వాటా విలువ 83.5 కోట్ల డాలర్లుగా లెక్కతేలుతోంది!

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

17-11-2022	
విశాఖ	520–00
చిత్తూరు	558–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	517–00
విజయవాడ	517–00
రిటైల్ ధర (డజను)	78.00
16-11-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	507–00
వరంగల్	509–00
రిటైల్ ధర	5.65

భవిత

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగాల ప్రత్యేకం-2022
ప్రముఖ సబ్జెక్ట్ నిపుణులు ప్రిపేర్ చేసిన 'తెలంగాణ హిస్టరీ ప్రాక్టీస్ టెస్టులు'

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

సీఐఎస్‌ఎఫ్‌లో 787 కానిస్టేబుల్/ట్రేడ్స్‌మెన్ పోస్టులు

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్‌ఎఫ్).. దేశవ్యాప్తంగా వివిధ సెక్టార్ల వారీగా పారిశ్రామిక యూనిట్లకు రక్షణ కల్పిస్తోంది. యూనిట్లకు రక్షణ కోసం కానిస్టేబుల్/ట్రేడ్స్‌మెన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 787
» **సెక్టార్లు:** నార్తెర్న్, ఎన్‌సీఆర్, వెస్ట్రన్, సెంట్రల్, ఈస్ట్రన్,సదరన్, సౌత్ ఈస్ట్రన్, నార్తెర్న్ ఈస్ట్రన్.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ శిక్షణ పొందిన వారికి ప్రాధాన్యం ఉంటుంది.
» **వయసు:** 01.08.2022నాటికి 18నుంచి 23ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** రూ.21,700 నుంచి రూ.69,100 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఫిజికల్ స్టాండర్డ్స్‌టెస్ట్(పీఎస్‌టీ),ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్(పీఈటీ),డాక్యుమెంటేషన్, ట్రేడ్ టెస్ట్, ఓఎంఆర్ టెస్ట్/కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ), మెడికల్ ఎగ్జామినేషన్, రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** పీఎస్‌టీ,పీఈటీ,డాక్యుమెంటేషన్,ట్రేడ్ టెస్టులో అర్హత సాధించిన అభ్యర్థులు రాతపరీక్షకు ఎంపికవుతారు. 100 ప్రశ్నలకు 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. జనరల్ అవేర్‌నెస్/జనరల్ నాలెడ్జ్,ఎలిమెంటరీ మ్యాథమేటిక్స్ నాలెడ్జ్, అనలిటికల్ ఆప్టిట్యూడ్, హిందీ/ఇంగ్లిష్‌లో ప్రాథమిక పరిజ్ఞానాన్ని పరీక్షించే సామర్థ్యం తదితరాలపై ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లిష్/హిందీ మాధ్యమాల్లో ప్రశ్నపత్రం ఉంటుంది. నెగిటివ్ మార్కింగ్ లేదు. పరీక్ష సమయం 2 గంటలు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 21.11.2022
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**20.12.2022
» **వెబ్‌సైట్:** www.cisfrectt.in

ఐఐటీ హైదరాబాద్‌లో జేఆర్‌ఎఫ్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్.. హెరిటేజ్ సైన్స్–టెక్నాలజీ విభాగంలో జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్‌ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01
» **అర్హత:**బీఈ,బీటెక్(సీఎస్/ఈసీఈ/ఈఈ/ఐటీ) ఎంటెక్ లేదా ఎంఎస్సీ(మ్యాథ్స్/ఫిజిక్స్) ఉత్తీర్ణులవ్వాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.11.2022
» **వెబ్‌సైట్:** iith.ac.in

ఎయిమ్స్, న్యూఢిల్లీలో 254 పోస్టులు

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) ఢిల్లీ/ఎన్‌సీఐ ఝజ్జర్(హర్యానా)లో.. గ్రూప్ ఎ(నాన్ ఫ్యాకల్టీ) బి, సి ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 254
» **పోస్టులు:** సైంటిస్ట్–2, సైంటిస్ట్–1, క్లినికల్ సైకాలజిస్ట్, మెడికల్ ఫిజిసిస్ట్, ప్రోగ్రామర్, పెర్‌ఫ్యూమిస్ట్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 12వ తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు. » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 19.11.2022
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.12.2022
» **వెబ్‌సైట్:** www.aiimsexams.ac.in

నర్సింగ్ ఆఫీసర్

- జిప్‌మర్‌లో 433 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- ఎంపికైతే నెలకు రూ.45వేల వరకూ వేతనం

జాబ్స్

భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వశాఖకు చెందిన పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (జిప్‌మర్)..నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతుంది. ఈ పోస్టులకు ఎంపికైన వారికి రూ.45వేల వరకు వేతనంగా లభిస్తుంది. 80శాతం పోస్టులను మహిళ అభ్యర్థులకు కేటాయించారు. అర్హత గల వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

» **పోస్టులు:** నర్సింగ్ ఆఫీసర్ » **మొత్తం పోస్టుల సంఖ్య:** 433

అర్హతలు

» బీఎస్సీ(ఆనర్స్) నర్సింగ్/బీఎస్సీ నర్సింగ్ లేదా బీఎస్సీ(పోస్ట్–సర్టిఫికేట్) లేదా పోస్ట్ బేసిక్ నర్సింగ్. లేదా డిప్లొమా(జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ)తోపాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి. » **వయసు:** 18–35 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాలకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

రాత పరీక్ష ఇలా

» రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ)లో 100 ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయిస్తారు. ఇలా మొత్తం 400 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం 90 నిమిషాలు. ఇందులో ప్రొఫెషనల్, జనరల్ అవేర్‌నెస్, లాంగ్వేజ్, మ్యాథమెటికల్ ప్రొఫిషియన్సీ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇందులో 70శాతం వెయిటేజీ సబ్జెక్టు నాలెడ్జ్ నుంచి, అలాగే 30శాతం జనరల్ అవేర్‌నెస్(జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఇంగ్లిష్, జనరల్ మ్యాథమెటిక్స్) నుంచి అడుగుతారు.

» **స్టేజ్–2:** ఈ దశలో దరఖాస్తు చేసుకున్న పోస్టుకు సంబంధించి స్కిల్ టెస్ట్‌ను నిర్వహిస్తారు.

కనీస అర్హత మార్కులు

సీబీటీ పరీక్షకు సంబంధించి జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు కనీసం 50శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ వారు 40శాతం మార్కులు సాధిస్తే సరిపోతుంది. అన్ని కేటగిరీల అభ్యర్థులు ప్రాక్టికల్ స్కిల్ టెస్ట్‌లో 50 శాతం కనీస మార్కులుగా సాధించాలి. » **వేతనాలు:** 7వ పే స్కేల్‌కు అనుగుణంగా ప్రతి నెల రూ.44,900 వరకు వేతనం అందుతుంది.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరి తేదీ:** 01.12.2022
» **పరీక్ష తేదీ:** 18.12.2022
» **వెబ్‌సైట్:** https://jipmer.edu.in

డిగ్రీతోనే పీహెచ్‌డీలో చేరేలా..

యువర్ ఎడ్యుకేషన్



» యూజీసీ సరికొత్త మార్గదర్శకాలు విడుదల
» పీహెచ్‌డీ ప్రవేశాలకు కనీస అర్హతలపై నూతన విధానం
» గెజిట్ నోటిఫికేషన్ సైతం విడుదల చేసిన యూజీసీ
» ప్రవేశ అర్హతలు, పీహెచ్‌డీ వ్యవధిపైనా స్పష్టత

పీహెచ్‌డీ అభ్యర్థులకు యూజీసీ శుభవార్త చెప్పింది. బ్యాచిలర్ డిగ్రీ అర్హతతోనే.. పీహెచ్‌డీలో చేరేందుకు అవకాశం కల్పిస్తూ.. నూతన మార్గదర్శకాలు విడుదల చేసింది. డిగ్రీ సర్టిఫికెట్‌తోనే..ఆరేళ్ల వ్యవధిలో పీహెచ్‌డీ పూర్తి చేసుకునే వెసులుబాటు కల్పించింది. దేశంలోని అన్ని యూనివర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థలు.. ఈ మార్గదర్శకాలను పాటించాలని నిర్దేశించింది!! దీనికి సంబంధించి యూజీసీ (మినిమమ్ స్టాండర్డ్స్ అండ్ ప్రొసీజర్ ఫర్ అవార్డ్ ఆఫ్ పీహెచ్‌డీ డిగ్రీ) రెగ్యులేషన్స్-2022 పేరుతో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. పీహెచ్‌డీకి యూజీసీ తాజా మార్గదర్శకాలు, అర్హతలు, ప్రవేశ మార్గాలు, ఫెలోషిప్స్, స్కాలర్‌షిప్స్ తదితర అంశాలపై విశ్లేషణ..

నాలుగేళ్ల వ్యవధి లేదా ఎనిమిది సెమిస్టర్ల బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు.. నేరుగా పీహెచ్‌డీలో ప్రవేశం పొందొచ్చని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ).. తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. తమ బ్యాచిలర్ డిగ్రీ కోర్సు 75శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. కొత్త విధానంతో విద్యార్థులకు కెరీర్ పరంగా ఎంతో విలువైన సమయం ఆదా అవనుంది. ఇంతకాలం అమల్లో ఉన్న విధానం ప్రకారం–డిగ్రీ తర్వాత పీజీ పూర్తి చేసి.. ఆ అర్హతతో యూజీసీ–నెట్, సీఎస్ఐఆర్–యూజీసీ నెట్, గేట్, సీడ్ వంటి పరీక్షల్లోనూ మంచి స్కోర్ సాధిస్తేనే పీహెచ్‌డీలో ప్రవేశం లభించేది.

పీజీ, ఎంఫిల్ విద్యార్థులు

- పీహెచ్‌డీ ప్రవేశాలకు సంబంధించి పీజీ, ఎం.ఫిల్ విద్యార్థుల అర్హతల విషయంలోనూ యూజీసీ స్పష్టమైన మార్గదర్శకాలు పేర్కొంది.
- వీరు నాలుగేళ్ల డిగ్రీ తర్వాత ఏడాది లేదా రెండు సెమిస్టర్ల వ్యవధిలోని పీజీని 55 శాతం మార్కులతో పూర్తి చేసుకుని ఉండాలి.
- మూడేళ్ల డిగ్రీ తర్వాత రెండేళ్లు లేదా నాలుగు సెమిస్టర్ల వ్యవధిలోని పీజీ కోర్సులో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. 55 శాతం మార్కులతో ఎం.ఫిల్ పూర్తి చేసుకున్న వారు కూడా ప్రవేశాలకు అర్హులే.
- నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీతోపాటు పైన పేర్కొన్న అర్హత లున్న వారందరూ పీహెచ్‌డీ ప్రవేశాలకు అర్హులేనని యూజీసీ స్పష్టం చేసింది.

ఆరేళ్లలో పీహెచ్‌డీ

పీహెచ్‌డీ పూర్తి చేసేందుకు కనిష్టంగా మూడేళ్లు, గరిష్టంగా ఆరేళ్లను వ్యవధిగా యూజీసీ పేర్కొంది. కోర్స్ వర్క్, ప్రాజెక్ట్ వర్క్‌కు ఈ వ్యవధిని నిర్దేశించింది. ప్రవేశాలు కల్పించిన ఇన్‌స్టిట్యూట్‌ల నిబంధనలకు అనుగుణంగా అదనంగా మరో రెండేళ్ల గడువు పొడిగించే అవకాశం కల్పించింది. మొత్తంగా చూస్తే అన్ని సడలింపులు, పొడగింపులతో కలిపి ఎనిమిదేళ్ల వ్యవధిలో పీహెచ్‌డీ పూర్తి చేయాల్సి ఉంటుందని తాజా మార్గదర్శకాల్లో యూజీసీ స్పష్టం చేసింది.

ప్రవేశాలు ఇలా

- పీహెచ్‌డీ ప్రవేశాలకు విద్యార్థులను ఎంపిక చేసే విషయంలో యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లు అనుసరించాల్సిన విధి విధానాలను కూడా యూజీసీ వెల్లడించింది.
- జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న యూజీసీ నెట్ స్కోర్ లేదా ఆయా యూనివర్సిటీలు స్వయంగా నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్‌లలో ఉత్తీర్ణత ఆధారంగా ఇంటర్వ్యూలు నిర్వహించి, ప్రవేశాలు కల్పించాలని పేర్కొంది.
- ఇన్‌స్టిట్యూట్‌లు స్వయంగా నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్‌లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారినే ఇంటర్వ్యూకు ఎంపిక చేసి.. అందులోనూ ప్రతిభ చూపిన వారికే పీహెచ్‌డీ ప్రవేశం ఖరారు చేయాల్సి ఉంటుంది.
- యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లు నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్‌లో 50 శాతం సబ్జెక్ట్ సంబంధిత అంశాలు, మరో 50 శాతం రీసెర్చ్ మెథడాలజీ సంబంధిత సిలబస్ ఉండాలని సూచించింది.
- ఎంట్రన్స్ టెస్ట్‌లో మార్కులకు 70 శాతం వెయిటేజీ, ఇంటర్వ్యూలో పొందిన మార్కులకు 30 శాతం వెయిటేజీ కల్పిస్తూ ప్రవేశాలు ఖరారు చేయాల్సి ఉంటుంది.

కనీస క్రెడిట్స్ విధానం

- పీహెచ్‌డీలో ప్రవేశం పొందిన తర్వాత అభ్యర్థులు కచ్చితంగా ఆరు నుంచి ఎనిమిది క్రెడిట్ కోర్సులను తీసుకోవాలని.. వాటిలో రీసెర్చ్ టెక్నిక్స్, డొమైన్ సంబంధిత సబ్జెక్ట్ ఉండాలని పేర్కొంది.
- సదరు కోర్సు సమయంలో కనీసం 12 క్రెడిట్స్‌ను.. గరిష్టంగా 16 క్రెడిట్స్‌ను సొంతం చేసుకోవాలి.
- రీసెర్చ్ మెథడాలజీకి కనీసం నాలుగు క్రెడిట్స్ విధానాన్ని అమలు చేయాలని.. అవి కూడా క్వాంటిటేటివ్ మెథడ్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, రీసెర్చ్ ఎథిక్స్, సంబంధిత రంగంలో పబ్లిష్ అయిన రీసెర్చ్ సమీక్ష, ఫీల్డ్ వర్క్ తదితర అంశాలకు కేటాయించాలని యూనివర్సిటీలకు స్పష్టం చేసింది.
- కోర్స్ వర్క్‌లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని.. అప్పుడే సర్టిఫికెట్ పొందేందుకు అర్హులవుతారని స్పష్టం చేసింది.

నిరంతర సమీక్ష

పీహెచ్‌డీలో ప్రవేశం పొందిన తర్వాత అభ్యర్థుల పనితీరును నిరంతరం సమీక్షించాలని యూజీసీ పేర్కొంది. ఇన్‌స్టిట్యూట్ లేదా యూనివర్సిటీ స్థాయిలో రీసెర్చ్ అడ్వయిజరీ కమిటీని ఏర్పాటు చేయాలి. ప్రతి సెమిస్టర్‌లో రీసెర్చ్ విద్యార్థులు రీసెర్చ్ అడ్వైయిజరీ కమిటీ ముందు తమ కోర్స్ వర్క్‌కు సంబంధించి ప్రజెంటేషన్, నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది.

ప్రమాణాలు పాటించాలి

- పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించే ఇన్‌స్టిట్యూట్‌లు నిర్దిష్ట ప్రమాణాలు పాటించాలని యూజీసీ స్పష్టం చేసింది.
- నాలుగేళ్ల డిగ్రీ కోర్సును అందిస్తున్న పీజీ కళాశాలలు; కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని కళాశాలలు, పరిశోధన సంస్థలు పీహెచ్‌డీ కోర్సు నిర్వహించొచ్చు.
- వీటిలో నిర్దిష్ట సంఖ్యలో పీహెచ్‌డీ అర్హత కలిగిన ఫ్యాకల్టీ ఉండాలి.

ఫెలోషిప్

పీహెచ్‌డీలో ప్రవేశం పొందిన వారికి ప్రస్తుతం ఫెలోషిప్ పేరిట ఆర్థిక ప్రోత్సాహకం లభిస్తోంది. పీహెచ్‌డీలో అడుగుపెట్టాక తొలి రెండేళ్లు జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్‌ఎఫ్) పేరుతో నెలకు రూ.31వేలు, ఆ తర్వాత మూడేళ్లపాటు సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(ఎస్‌ఆర్‌ఎఫ్) పేరుతో నెలకు రూ.35 వేలు చొప్పున అందిస్తారు. వీటికి అదనంగా జేఆర్‌ఎఫ్ సమయంలో ఏడాదికి రూ.12 వేలు, ఎస్‌ఆర్‌ఎఫ్ సమయంలో ఏడాదికి రూ.25 వేలు కాంటిజెన్సీ గ్రాంట్ అందిస్తారు.

పీహెచ్‌డీతో ప్రయోజనాలివే

- పీహెచ్‌డీ పూర్తి చేయడం వల్ల సదరు స్కాలర్స్‌కు విస్తృత అవకాశాలు అందుబాటులోకి వస్తాయి.
- ప్రతిష్టాత్మక పరిశోధన సంస్థలు ఐఐసీటీ, సీఎస్ఐఆర్, ఐసీఏఆర్, ఎన్‌జీఐఆర్ఐ, ఇక్రిశాట్ తదితరాల్లో జూనియర్ సైంటిస్ట్‌లుగా ఉద్యోగం లభిస్తుంది.
- బోధన రంగంలో పీహెచ్‌డీ ఫ్యాకల్టీగా కెరీర్ ప్రారంభించే వీలుంది. ▪ ప్రైవేటు సంస్థల ఆర్ అండ్ డీ విభాగాల్లో సైంటిస్ట్‌లుగా ప్రారంభంలోనే నెలకు రూ. 2 లక్షల వేతనం అందుకోవచ్చు.
- పీహెచ్‌డీ పూర్తి చేసిన తర్వాత సొంత రీసెర్చ్ ప్రాజెక్ట్‌లను చేపట్టేందుకు సైతం అవకాశం లభిస్తుంది. ఇలాంటి అభ్యర్థులకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డ్.. ఎక్స్‌ట్రా మ్యూరల్ రీసెర్చ్ ఫండింగ్, ఎర్లీ కెరీర్ రీసెర్చ్ అవార్డ్, నేషనల్ పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ పేరుతో పలు పథకాలు అందుబాటులో ఉంచింది. ఏడాదికి రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు రీసెర్చ్ గ్రాంట్, నెలకు రూ.55 వేల ఫెలోషిప్, ఇతర రీసెర్చ్ ఖర్చుల కోసం ఓవర్‌హెడ్స్ పేరుతో ఏడాదికి రూ.లక్ష వరకూ ఆర్థిక ప్రోత్సాహకాలు లభిస్తాయి.

యూజీసీ.. తాజా మార్గదర్శకాలు

- నాలుగేళ్ల వ్యవధిలోని బ్యాచిలర్ డిగ్రీ అర్హతగా పీహెచ్‌డీలో ప్రవేశం. ▪ యూజీసీ–నెట్,సీఎస్ఐఆర్,గేట్, తదితర ప్రవేశ పరీక్షల ద్వారా ఎంపిక చేయాలనే నిబంధన.
- ఇన్‌స్టిట్యూట్‌లు స్వీయ ఎంట్రన్స్‌లు నిర్వహించే అవకాశం. ▪ రాత పరీక్షతోపాటు ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులు ఎంపిక. ▪ కనిష్టంగా మూడేళ్లు, గరిష్టంగా ఆరేళ్ల వ్యవధిలో పీహెచ్‌డీ పూర్తి చేసుకునేలా మార్గదర్శకాలు
- 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తేనే పీహెచ్‌డీ పట్టా.

క్లుప్తంగా

రెండు సంస్థలతో ఉన్నత విద్యా మండలి ఒప్పందాలు

సాక్షి, అమరావతి: ఏపీలోని ఉన్నత విద్యాసంస్థల్లోని ఫ్యాకల్టీలో నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు కామన్‌వెల్త్ ఎడ్యుకేషనల్ మీడియా సెంటర్ ఫర్ ఆసియా (సీఈఎంసీఏ)తో రాష్ట్ర ఉన్నత విద్యామండలి బుధవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఏపీ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, సీఈఎంసీఏ డైరెక్టర్ బి.శద్రాచ్ ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. అలాగే, డిగ్రీ కాలేజీల్లో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసేందుకు వీలుగా మేనేజ్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రొఫెషనల్ స్కిల్స్ కౌన్సిల్‌తో ఉన్నత విద్యామండలి మరో ఒప్పందం కుదుర్చుకుంది.

మార్కెట్లోకి అపే క్లాసిక్ ఆటో



అపే ఆటో క్లాసిక్‌ను విడుదల చేస్తున్న ఆ సంస్థ ఛైర్మన్ - ఎండీ డిగో గ్రాఫీ

సాక్షి, అమరావతి: అధిక లోడ్, అత్యధిక మైలేజ్ ఇచ్చే అపే క్లాసిక్ ఆటోలను తిరిగి ప్రవేశపెడుతున్నట్లు పియాజియో వెహికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రకటించింది. విజయవాడలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో అపే క్లాసిక్ డీజిల్ ఆటోలను జాతీయ విపణిలోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా పియాజియో వెహికల్స్ ఎండీ డిగో గ్రాఫీ మాట్లాడుతూ వినియోగదారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని 435 సీసీ ఇంజన్, 10 లీటర్ల ఇంధన ట్యాంక్ సామర్థ్యంతో క్లాసిక్ ఆటోలను తిరిగి మార్కెట్లోకి ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఇప్పటికే 30 లక్షలకు పైగా క్లాసిక్ ఆటోలను దేశవ్యాప్తంగా విక్రయించామని, ఆధునీకరించిన ఈ మోడల్‌ను కూడా వినియోగదారులు ఆదరిస్తారన్న నమ్మకం ఆయన వ్యక్తం చేశారు. ఆటోమొబైల్‌కు విజయవాడ కీలక మార్కెట్ కావడంతో నూతన శ్రేణి వాహనాలను ఇక్కడ విడుదల చేస్తున్నామని, ప్రారంభ పరిచయ ధరను రూ.2,28,722గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ వాహనం 42 నెలల సూపర్ వారెంటీతో వస్తుండటంతో అతి సులభంగా సర్వీసింగ్, అందుబాటు ధరలలో విడిభాగాలు ఉండటం వల్ల నిర్వహణ వ్యయం తగ్గుతుందన్నారు.

శుక్రవారం సాయంత్రంలోగా ఫ్రీ ఎగ్జిట్‌కు అవకాశం

ఎంబీబీఎస్ కన్వీనర్ కోటాపై హెల్త్ వర్సిటీ ఆదేశాలు

సాక్షి, అమరావతి: 2022–23 విద్యా సంవత్సరం ఎంబీబీఎస్‌లో ప్రవేశానికి కన్వీనర్ కోటా తొలి దశ కౌన్సెలింగ్‌లో సీట్లు పొంది, కళాశాలల్లో రిపోర్ట్ చేసిన విద్యార్థులు శుక్రవారం సాయంత్రం 4 గంటల్లోగా ఫ్రీ ఎగ్జిట్‌కు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అవకాశం కల్పించింది. ఈ మేరకు రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గడువు ముగిసిన అనంతరం ఎగ్జిట్ అవ్వడానికి వీలుండదని స్పష్టంచేశారు. ఎగ్జిట్ అయ్యే విద్యార్థులు సంబంధిత కళాశాల ప్రిన్సిపాళ్లకు వినతి ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాళ్లు విద్యార్థుల ఒరిజినల్ ధ్రువపత్రాలు, ట్యూషన్, ఇతర ఫీజులను వెంటనే తిరిగి ఇచ్చేయాలని తెలిపారు. ఇందుకు శుక్రవారం సాయంత్రం ఐదు గంటలు తుది గడువుగా నిర్ధారించారు. ఒక వేళ గడువు ముగిశాక, అకడమిక్ ఇయర్ మధ్యలో ఎగ్జిట్ అవ్వాలనుకుంటే 2019 జీవో ఎంస్ నెంబర్ 72 ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ జీవో ప్రకారం డిస్కంటిన్యూ అయ్యే విద్యార్థి రూ.3 లక్షలు, జీఎస్టీని కలిపి విశ్వవిద్యాలయానికి చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.3 లక్షల డిమాండ్ డ్రాఫ్ట్‌తో డిస్కంటిన్యూ దరఖాస్తు విశ్వవిద్యాలయానికి సమర్పించాలని తెలిపారు.

మాజీ మంత్రి నారాయణను ఆయన ఇంటి వద్దే విచారించండి

సీఐడీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ డిజైన్ల మార్పు ముసుగులో సాగిన భూ దోపిడీపై నమోదు చేసిన కేసులో మాజీ మంత్రి పొంగూరు నారాయణను ఆయన ఇంటి వద్దే న్యాయవాది సమక్షంలో విచారించాలని సీఐడీకి హైకోర్టు స్పష్టం చేసింది. ఎప్పుడు విచారించాలనుకుంటున్నారో నిర్ణయించాక 24 గంటల ముందు ఆ విషయాన్ని నారాయణకు తెలియచేయాలంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నారాయణ అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో న్యాయమూర్తి ఈ ఆదేశాలిచ్చారు. ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ డిజైన్ల మార్పు ముసుగులో సాగిన భూ దోపిడీపై సీఐడీ ఇటీవల కేసు నమోదు చేసింది. సీఐడీ ఆయనకు సీఆర్‌పీసీ సెక్షన్ 160 కింద నోటీసు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆయన ఆ నోటీసును రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నారాయణ తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ, పిటిషనర్ శస్త్ర చికిత్స చేయించుకున్నారని, వైద్యుల సూచన మేర మూడు నెలల పాటు విశ్రాంతి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిబంధనల ప్రకారం 60 ఏళ్లు నిండిన వారిని వారి ఇంటి వద్దే విచారించాల్సి ఉంటుందని తెలిపారు.



నంద్యాల జిల్లా గుండాలనట్టు గ్రామంలో మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



అనకాపల్లి జిల్లా త్రిపురవాణిపాలెంలో ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్





తూర్పు గోదావరి జిల్లా దొడ్డిగుంట గ్రామంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



అన్నమయ్య జిల్లా మాలేమర్రూరంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

ఏపీ బాలల బడ్జెట్ బహుబాగు

నీపా వర్క్‌షాప్‌లో ప్రశంసలు

- విద్యార్థులకోసం ఏపీ చేపడుతున్న పథకాలకు పలు రాష్ట్రాల కితాబు
- బాలల పథకాల కోసం భారీగా నిధులు వెచ్చిస్తున్న ఆంధ్రప్రదేశ్
- 2021–22లో రూ.16,748 కోట్లు, 2022–23లో రూ.16,903 కోట్లు



2022-23లో మొదటి విభాగంలో కొన్నింటికి వెచ్చిస్తున్న నిధులు (రూ.కోట్లలో)

స్త్రీ శిశుసంక్షేమ శాఖ	పాఠశాల విద్యాశాఖ	ఉన్నత విద్యాశాఖ	
2,355.90	8,795.55	683.22	
సాంఘిక సంక్షేమ శాఖ	గిరిజన సంక్షేమ శాఖ	బీసీ సంక్షేమ శాఖ	మైనార్టీ సంక్షేమ శాఖ
702.15	265.00	314.59	1.30

2022-23లో రెండవ విభాగంలో కొన్నింటికి వెచ్చిస్తున్న నిధులు (రూ.కోట్లలో)

వైద్యారోగ్యశాఖ	స్త్రీ శిశుసంక్షేమ శాఖ	క్రీడలు, యువజన సర్వీసులు
1,250.44	1,297.14	38.19
పౌరసరఫరాలు	పాఠశాల విద్య	హోం శాఖ
730.36	235.38	18.5

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దేలా వారికి ఆంగ్ల మాధ్యమంలో మంచి చదువులు అందిస్తూ వారి సమగ్ర వికాసానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వంతో పాటు పలు రాష్ట్రాల నుంచి కూడా ప్రశంసలు అందుతున్నాయి. బాలల కేంద్రంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ రూపొందించి నిధులు కేటాయించడం అద్భుతమని మెచ్చుకుంటున్నాయి. జాతీయ విద్యా ప్రణాళిక, పరిపాలన సంస్థ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్ఐఈపీఏ–నీపా)) బుధవారం నిర్వహించిన వర్చువల్ వర్క్‌షాప్‌లో రాష్ట్రం తరఫున ఇచ్చిన ప్రజెంటేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'స్టూడెంట్ బేస్డ్ ఫైనాన్సియల్ సపోర్టు సిస్టమ్ ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్' అంశంపై నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు డి.దేవానందరెడ్డి రాష్ట్రం అమలు చేస్తున్న పలు కార్యక్రమాల గురించి వివరించారు. అమ్మ ఒడి, నాడు–నేడు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక వంటి కార్యక్రమాల గురించి విని వివిధ రాష్ట్రాల ప్రతినిధులు ప్రశంసించారు. ముఖ్యంగా అమ్మ ఒడి పథకం అమలు సాహసోపేతమైన చర్యగా పలువురు అభినందించారు. నాడు–నేడు కింద రాష్ట్రంలోని ఫౌండేషన్ స్కూళ్లు మొదలు 60 వేల వరకు ఉన్న పలు విద్యాసంస్థలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే కార్యక్రమం పట్ల నీపా అధికారులు మెచ్చుకున్నారు. ఇంత భారీ ఎత్తున కార్యక్రమం చేపట్టిన రాష్ట్రం ఏపీ ఒక్కటేనని ప్రశంసించారు. పైగా అభివృద్ధి చేస్తున్న స్కూళ్లలో వాటి భద్రత నిర్వహణ కోసం స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్, టాయిలెట్ల నిర్వహణ, పారిశుధ్య పనులకోసం టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్ ఏర్పాటుచేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు.

కార్పొరేట్ విద్యార్థులతో సమానంగా తీర్చిదిద్దేలా కృషి

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలు విద్యారంగంలో ముఖ్యంగా పిల్లలను ప్రపంచపౌరులుగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని ప్రభుత్వ ప్రతినిధులు వివరించారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతూ కార్పొరేట్ విద్యార్థులతో సమానంగా వారిని మార్చేలా జగనన్న విద్యాకానుక కింద ఏటా రూ.800 కోట్ల వరకు ఖర్చుచేస్తూ 43 లక్షల మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందిస్తున్నారు. దీనివల్ల విద్యార్థుల్లో లెర్నింగ్ అవుట్‌కమ్స్ పెరుగుతున్నాయి. మనబడి నాడు–నేడు కింద రన్నింగ్ వాటర్‌తో కూడిన మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయం, ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు, ఫర్నిచర్, గ్రీన్‌చాక్‌బోర్డులు, ఇంగ్లిష్ ల్యాబ్, పెయింటింగ్‌లు, కాంపౌండ్ వాల్, కిచెన్‌షెడ్ల నిర్మాణం వంటి ఏర్పాటు ద్వారా పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునే వీలు ఏర్పడుతోంది. విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కింద రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించేలా రోజుకో మెనూతో అందిస్తున్న భోజనం గురించి ప్రతినిధులు తెలుసుకున్నారు. ఇందుకు ఈ ఏడాది ప్రభుత్వం 1,595.55 కోట్లు ఖర్చుచేస్తోంది. అన్నిటికన్నా ముఖ్యంగా ప్రతి తల్లి తన పిల్లలను ఆర్థిక స్తోమత లేక చదువులకు దూరంగా ఉంచకుండా బడులకు పంపేలా ఏటా ఒక్కొక్కరికి రూ.15 వేలు అందిస్తున్న సంగతి విని ప్రతినిధులు ఆశ్చర్యపోయారు. 2022–23 విద్యాసంవత్సరంలోనే తల్లులకు రూ.6,500 కోట్లు అందించారు.

చైల్డ్ సెంట్రిక్ బడ్జెట్ వినూత్న ఆలోచన

- చైల్డ్ సెంట్రిక్ బడ్జెట్ ప్రవేశపెట్టిన తీరుపై నీపా అధికారులు, ఇతర ప్రతినిధులు ఆసక్తి చూపారు. ఈ బడ్జెట్ ఎలా రూపొందిస్తున్నారో తెలుసుకున్నారు.
- కుల, లింగ, వైకల్యాలు, తరగతి, మత, సాంస్కృతిక ప్రాధాన్యతలతో సంబంధం లేకుండా పిల్లలకు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపగలిగే వాతావరణాన్ని సృష్టించడమే ఈ చైల్డ్ సెంట్రిక్ బడ్జెట్ లక్ష్యం.
- 2021–22లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.16,748.47 కోట్లతో తొలిసారిగా ఈ బాలల బడ్జెట్ ప్రవేశపెట్టారు. 2022–23లో రూ.16,903 కోట్లు కేటాయించారు.
- బాలల పథకాల కోసం వందశాతం నిధులు కేటాయించే కార్యక్రమాలు మొదటి విభాగం కాగా అవసరాల మేరకు నిధులు కేటాయించే సంక్షేమ పథకాలు రెండో విభాగంగా ఈ బడ్జెట్‌ను రూపొందించారు.
- వివిధ శాఖల ద్వారా పిల్లల కోసం పలు పథకాలను అమలు చేయిస్తున్నారు. మొదటి విభాగంలో 15 స్కీములు, రెండో విభాగంలో 18 స్కీములు అమలు చేస్తున్నారు.

విద్యాభివృద్ధి కోసం సీఎం జగన్ తెచ్చిన పథకాలు భేష్

- దళిత మహాసభ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డాక్టర్ కత్తి పద్మారావు



పొన్నూరు: కుటీర పరిశ్రమలను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందని దళిత ఉద్యమ నేత, ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డాక్టర్ కత్తి పద్మారావు చెప్పారు. గుంటూరు జిల్లా పొన్నూరులోని లుంబినీ వనంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాలలోని పేద, మధ్య తరగతి కుటుంబాలు అభివృద్ధి సాధిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తెలంగాణ సీఎం కేసీఆర్‌కు దళిత బంధు పథకాన్ని ప్రవేశ పెట్టాలని సూచించినట్లు తెలిపారు. కేసీఆర్ దళిత బంధు పథకాన్ని తీసుకురావడం వల్లే మునుగోడు ఉప ఎన్నికల్లో విజయం సాధించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ దళిత బంధు పథకం తేవడం ద్వారా కుటీర పరిశ్రమలు పెరిగి దళితులు, ఎస్టీలు పారిశ్రామికవేత్తలుగా తయారవుతారని చెప్పారు. ప్రాథమిక విద్యలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ప్రభుత్వమే బస్సులను కేటాయించాలని, ప్రాథమిక విద్యాలయాల్లో పిల్లలకు ఉదయం పాలు అందించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యాభివృద్ధికి తీసుకున్న పథకాలు ఎంతో గొప్పగా ఉన్నాయని, అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనలతో విద్యాభివృద్ధి జరుగుతోందని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి చర్చి, దేవాలయాలకు అనుబంధంగా వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఫార్మసీ అడ్మిషన్లపై సందిగ్ధం

- అనుమతుల జారీలో ఫార్మసీ కౌన్సిల్ జాప్యమే కారణం
- నెల రోజులుగా విద్యార్థుల ఎదురుచూపు
- ప్రభుత్వానికి నివేదించిన సాంకేతిక విద్యాశాఖ

సాక్షి, అమరావతి: ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) కాలేజీలకు గుర్తింపు ఆమోదించే ప్రక్రియను ఆలస్యం చేయడంతో ఫార్మసీ కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. ఈఏపీ సెట్ ఫలితాలు వెలువడి నెలలు గడిచిపోతున్నా ఫార్మసీ కాలేజీలకు అనుమతులు ఆలస్యం కావడంతో ఆయా కాలేజీల్లోని సీట్ల భర్తీకి ఆటంకంగా మారింది. రెండు నెలలుగా విద్యార్థులు ప్రవేశాల కోసం నిరీక్షిస్తుండగా.. పీసీఐ అనుమతులు లేకపోవడంతో ఈఏపీ సెట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టేందుకు ఉన్నత విద్యామండలి, సాంకేతిక విద్యా శాఖ ముందుకు వెళ్లలేకపోయాయి. దీనిపై ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో పలుమార్లు సంప్రదింపులు చేశారు. గత నెలాఖరుకు అనుమతుల ప్రక్రియ పూర్తి చేస్తామని.. అనంతరం కౌన్సెలింగ్ చేపట్టవచ్చని సూచించింది. గడువు దాటినా పూర్తి స్థాయిలో అనుమతులు ఇంకా రాలేదు. దీంతో ఉన్నత విద్యామండలి, సాంకేతిక విద్యా శాఖ ఈఏపీ సెట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్‌ను కేవలం ఇంజనీరింగ్ కోర్సులకే పరిమితం చేశాయి. మూడు విడతల్లో కౌన్సెలింగ్ చేపట్టి ఇంజనీరింగ్ కాలేజీలలోని 80 శాతం సీట్లు భర్తీ చేశారు.

ప్రత్యామ్నాయాల వైపు విద్యార్థుల చూపు

రాష్ట్రంలో బి.ఫార్మసీ కాలేజీలు 121 వరకు ఉన్నాయి. ఫార్మా–డి కోర్సులు నిర్వహించే కాలేజీలు 60 ఉన్నాయి. కన్వీనర్ కోటాలో బి.ఫార్మసీ కాలేజీలలో 4,386 సీట్లు, ఫార్మా–డిలో 682 సీట్లు ఉన్నాయి. సకాలంలో కౌన్సెలింగ్ చేపట్టిన రోజుల్లోనే ఈ కాలేజీల్లో సీట్లు పూర్తిగా భర్తీ అయ్యేవి కావు. పీసీఐ తీరు కారణంగా ఈసారి చాలా ఆలస్యం కావడంతో విద్యార్థులు ప్రత్యామ్నాయాల వైపు వెళ్లిపోతున్నారని పలు కాలేజీల యాజమాన్యాలు పేర్కొంటున్నాయి.

ప్రభుత్వానికి నివేదిక

ఫార్మసీ కాలేజీలకు పీసీఐ నుంచి పూర్తిస్థాయిలో అనుమతులు రాకపోవడంతో సాంకేతిక విద్యాశాఖ ఈ కోర్సు ప్రవేశాలకు సంబంధించి ప్రభుత్వానికి నివేదిక పంపింది. ప్రస్తుతం ఉన్న కాలేజీల్లో కొన్నింటికి సరైన నిబంధనలు పాటించనందున పూర్తి సీట్లకు అనుమతివ్వలేదు. దీనిపై పలు కాలేజీలు పీసీఐని చాలెంజ్ చేశాయి. నిబంధనల ప్రకారం వసతులు, అధ్యాపకులు ఇతర అంశాలపై ఆధారాలు సమర్పణకు పీసీఐ కాలేజీలకు నెలాఖరు వరకు అవకాశం కల్పించింది. ఈ తరుణంలో కౌన్సెలింగ్ ఆలస్యం అవుతుండటంతో అధికారులు పీసీఐని సంప్రదించగా.. కొన్ని షరతులతో సీట్ల భర్తీకి అనుమతించింది. గత ఏడాది ఇన్ టేక్ ప్రకారం కౌన్సెలింగ్ చేపట్టవచ్చని, అయితే అవి తమ చివరి అనుమతుల మేరకు కొనసాగుతాయని పీసీఐ పేర్కొందని అధికారులు ప్రభుత్వానికి వివరించారు. ఈ నేపథ్యంలో ముందుకు వెళ్లేందుకు వీలుగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం సాంకేతిక విద్యా శాఖ పేర్కొన్న మేరకు కాలేజీలకు ప్రభుత్వం అనుమతిస్తే ఒకటి రెండు రోజుల్లోనే కౌన్సెలింగ్ ను చేపట్టే అవకాశం ఉందని ఉన్నత విద్యామండలి వర్గాలు పేర్కొంటున్నాయి.

చిట్‌ఫండ్ కంపెనీల్లో కొనసాగుతున్న తనిఖీలు

- 'మార్గదర్శి'లో పలు అవకతవకల గుర్తింపు
- నేడు కూడా తనిఖీలు జరిగే అవకాశం

సాక్షి, అమరావతి/తణుకు/ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలోని చిట్‌ఫండ్ సంస్థల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. వరుసగా రెండో రోజు మార్గదర్శి చిట్‌ఫండ్ కార్యాలయాల్లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. చిట్‌ల రిజిస్టర్లు, అకౌంట్ పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ పలు వివరాలు సేకరిస్తున్నారు. అయితే ఈ కంపెనీల ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉండడంతో వెంటనే సమాచారం రావడం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో అనుమానాల నివృత్తి, ఉల్లంఘనలు తెలుసుకునేందుకు తనిఖీ అధికారులకు ఎక్కువ సమయం పడుతోంది. చిట్స్ ద్వారా వసూలు చేసిన డబ్బును ఇతర కార్యకలాపాలకు మళ్లించిన తీరుపై లోతుగా వివరాలు సేకరిస్తున్నారు. చిట్‌లు పాడిన తర్వాత, గ్యారెంటీల ప్రక్రియ ముగిసేలోపు ఆ డబ్బును ప్రత్యేక బ్యాంకు ఖాతాలకు కాకుండా వేరే రకంగా వినియోగించుకున్నట్లు ఈ తనిఖీల్లో స్పష్టమైనట్లు తెలిసింది. గ్యారెంటీ చూపించలేని చందాదారులుఎ పాడుకున్న సొమ్మును ప్రత్యేక ఖాతాల్లో ఉంచి అదే రోజు వెనక్కి తీసుకున్న సందర్భాలు తనిఖీల్లో వెలుగులోకి వచ్చాయి. అలాగే తాము నిర్వహిస్తున్న చిట్‌లపై ప్రభుత్వానికి తప్పుడు ఓచర్లు సమర్పిస్తున్నట్టుగా తేలింది. ఈ కంపెనీల నగదు నిర్వహణలో తీవ్ర ఉల్లంఘనలు జరిగాయి. చిట్‌ల డబ్బును బ్యాంకుల్లో డిపాజిట్ చేయకపోవడం, ఆ డబ్బుకు సంబంధించి నగదు రసీదులు, ఓచర్లు ఇవ్వకపోవడాన్ని తనిఖీ అధికారులు నిర్ధారించుకున్నట్లు తెలిసింది. జీఎస్టీ చట్టాన్ని ఉల్లంఘించినట్లు తేలడంతో జీఎస్టీ అధికారులు సైతం తనిఖీల్లో పాల్గొని వివరాలు సేకరిస్తున్నారు. ఎంత సొమ్ము దారి మళ్లింది, ప్రభుత్వ ఆదాయానికి ఎంత మేర నష్టం కలిగిందనే అంశాలను పూర్తిగా అంచనా వేస్తున్నారు. తనిఖీల్లో అధికారులకు అవసరమైన సమాచారం ఇంకా రావాల్సి ఉండడంతో గురువారం కూడా తనిఖీలు జరిగే అవకాశం ఉంది.



ఏలూరులోని మార్గదర్శి కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా..

పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణంలోని మార్గదర్శి చిట్‌ఫండ్ కార్యాలయంలో బుధవారం కూడా తనిఖీలు కొనసాగాయి. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు సంయుక్తంగా ఈ తనిఖీలు చేపట్టారు. రెండ్రోజులుగా కార్యాలయంలో జరుగుతున్న ఈ తనిఖీల్లో పలు అవకతవకలు గుర్తించినట్లు సమాచారం. చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా వేలానికి ముందే చందాదారుల నుంచి చిట్ సొమ్ములు కట్టించుకుంటూ దానికి 5 శాతం వడ్డీను చెల్లిస్తున్నట్లుగా గుర్తించారు. మరోవైపు డిపాజిట్‌దారుల నుంచి సేకరించిన మొత్తానికి జీఎస్టీ ఎగవేస్తున్నట్లుగా గుర్తించారు. పెనాల్టీల పేరుతో చందాదారుల నుంచి అధిక మొత్తంలో సొమ్ములు వసూలు చేస్తున్నట్టు తేలింది. అలాగే ఏలూరు నగరంలోని నరసింహరావుపేటలో ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థ కార్యాలయంలో జిల్లా రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో చిట్స్ సబ్ రిజిస్ట్రార్, ఇతర సిబ్బంది, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ఉదయం నుంచి ప్రారంభమైన తనిఖీలు రాత్రి వరకూ కొనసాగాయి.

నిమ్స్‌లో 42 విభాగాల్లో సూపర్ స్పెషాలిటీ సేవలు

- విస్తరణకు రూ.1,571 కోట్లు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్: ప్రతిష్టాత్మక నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) వైద్య సేవలను మరింత విస్తరిస్తున్నారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,571 కోట్లు విడుదల చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో నిర్మించే కొత్త బ్లాక్‌లలో మరో 2వేల పడకలు సహా 500 ఐసీయూ బెడ్స్ అందుబాటులోకి రానున్నాయి. ఆస్పత్రిలో 42 సూపర్ స్పెషాలిటీ విభాగాలు ఏర్పాటు చేస్తుండటంతో ఆయా విభాగాల్లో సూపర్ స్పెషాలిటీ సీట్లు సహా నర్సింగ్ సీట్లు, ఇతర పారామెడికల్ సీట్లు పెరగనున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో కొత్తగా మరో ఓపీ విభాగం అందుబాటులోకి రానుంది.


ఢిల్లీలో మరో ఇద్దరు అదుపులోకి?

ఎమ్మెల్యేలకు ఎర కేసులో విచారిస్తున్న పోలీసులు

సాక్షి, న్యూఢిల్లీ: 'ఎమ్మెల్యేలకు ఎర' కేసులో పోలీసులు మరో ఇద్దరిని ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయి విచారణ ఎదుర్కొంటున్న నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు వీరిద్దరిని ఫరీదాబాద్ ప్రాంతంలో అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు ఢిల్లీ పోలీసు వర్గాల సమాచారం. వీరిద్దరూ కేసులో ప్రథమ ముద్దాయిగా ఉన్న రామచంద్రభారతికి అత్యంత సన్నిహితులుగా చెబుతున్నారు. ఈ ఇద్దరికీ కేసులో సహ నింది తుడిగా ఉన్న నందుకుమార్‌తోనూ సాన్నిహిత్యం ఉన్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేల ఎర కేసును తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందం (సిట్)కు అప్పగించిన మరుసటి రోజునే సైబరాబాద్‌కు చెందిన ప్రత్యేక బృందం ఒకటి ఢిల్లీకి చేరుకొని విచారణ చేపట్టింది.

అమరావతి రైతులకు హైకోర్టులో ఎదురు దెబ్బ

- రాజధాని రైతు సంఘాలు దాఖలు చేసిన అప్పీళ్లు కొట్టివేత
- ఉత్తర్వులు జారీ చేసిన సీజే ధర్మాసనం



సాక్షి, అమరావతి: అమరావతి రైతులకు ఎదురుదెబ్బ తగిలింది. అమరావతి నుంచి అరసవిల్లి వరకు చేపట్టిన మహా పాదయాత్రలో 600 మంది మాత్రమే ఉండాలంటూ సెప్టెంబర్ 9న ఇచ్చిన ఉత్తర్వులను, ఇతరులెవరూ సంఘీభావం పేరుతో పాదయాత్రలో పాల్గొనరాదంటూ గత నెల 21న ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేసేందుకు అనుమతి కోరుతూ రాజధాని రైతు పరిరక్షణ సమితి, అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లను హైకోర్టు ధర్మాసనం కొట్టేసింది. అప్పీళ్ల దాఖలుకు అనుమతి నిరాకరించిన నేపథ్యంలో సింగిల్ జడ్జి ఉత్తర్వులపై వారు దాఖలు చేసిన ప్రధాన అప్పీళ్లను సైతం కొట్టేస్తున్నట్టు ధర్మాసనం తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులుతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అమరావతి రైతు సంఘాల తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వ చర్యలకు నిరసనగా చేపట్టిన పాదయాత్రలో పాల్గొనే హక్కు తమకు ఉందన్నారు. కేవలం 600 మందే పాల్గొనాలన్న ఉత్తర్వులు తమకు అడ్డంకిగా ఉన్నాయన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. మేం కూడా మీ మద్దతుదారులమే అని నిరూపించుకునేందుకు ఇలాంటి వ్యాజ్యాలు దాఖలు చేస్తుంటారని వ్యాఖ్యానించింది. కేఎస్ మూర్తి స్పందిస్తూ.. యాత్ర చేస్తున్న వారు రైతులని చెప్పగా, రాజకీయ నాయకులెవరో, రైతులెవరో తమకు తెలియదని ధర్మాసనం స్పష్టం చేసింది. అప్పీళ్ల దాఖలుకు అనుమతిని నిరాకరిస్తూ అనుబంధ పిటిషన్లతో పాటు ప్రధాన అప్పీళ్లను కూడా కొట్టేస్తూ ఉత్తర్వులిచ్చింది. తగిన కారణాలతో పూర్తిస్థాయి ఉత్తర్వులను తరువాత వెలువరిస్తామంది.

రైల్వేలో మానవ రహిత సిగ్నలింగ్ వ్యవస్థ

సాక్షి, అమరావతి: రైలు ప్రమాదాలను నివారించే దిశగా త్వరలోనే ఆధునిక అన్‌మేన్డ్ ఆటోమేషన్ సిగ్నలింగ్ వ్యవస్థను రైల్వే శాఖ ప్రవేశపెట్టబోతోంది. దశాబ్దాలుగా ఉన్న సంప్రదాయ సిగ్నలింగ్ వ్యవస్థ స్థానంలో 'ఇండిజినస్ కమ్యూనికేషన్ బేస్డ్ ట్రెయిన్ కంట్రోల్ సిస్టమ్ (ఐ–సీబీటీసీ)' విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు భారత్ ఎల్రక్టానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)తో ఒప్పందం కుదుర్చుకుంది.

సంప్రదాయ వ్యవస్థకు మంగళం

భారతీయ రైల్వే దశాబ్దాలుగా సంప్రదాయ సిగ్నలింగ్ వ్యవస్థనే కొనసాగిస్తోంది. ట్రాక్ సర్క్యూట్లు, యాక్సిల్ కౌంటర్ల ద్వారా రైళ్ల గమనాన్ని తెలుసుకుంటూ రంగుల లైట్ల ద్వారా రైళ్ల లోకో పైలట్లకు సిగ్నల్స్ తెలిపే విధానాన్ని అనుసరిస్తోంది. రైళ్ల గమనాన్ని తెలుసుకోలేకపోవడం, నియంత్రించలేకపోవడం ఈ విధానం సరైనది కాదు. కానీ.. మన దేశంలో 68,103 కి.మీ. పొడవైన రైల్వే ట్రాక్‌లను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ప్రస్తుత వ్యవస్థ సహకరించడం లేదు. అందుకే ప్రస్తుత సిగ్నలింగ్ స్థానంలో ఐ–సీబీటీసీ పేరుతో పూర్తిగా మానవ రహిత సిగ్నలింగ్ వ్యవస్థను రూపొందించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.